
గోల్డెన్ రోబో
MB
PUBLICATIONS
మధుబాబు

# గోల్డెన్ రోబ్

"పట్టుకో శ్రీకర్...... ఈసారయినా వాడిని గట్టిగా పట్టుకో."

దారికి అడ్డుగా ప్రత్యక్షం అయిన ఒక డస్ట్‌బిన్ మీద నుంచి ఎగిరి అవతలికి దూకుతూ బిగ్గరిగా హెచ్చరించాడు ముఖేష్.

అక్కడికి పాతిక అడుగుల దూరంలో వున్న సందు ముందు మాటు వేసి వున్నాడు శ్రీకర్. రివ్వున ఇవతలికి వచ్చి, ఛట్ మని డెలివర్ చేశాడు సైడ్ కిక్ నొకదాన్ని.

యావరేజి మనిషి ఎవరయినా అయితే గుండెలు అవిసిపోయేటట్టు అరిచి అక్కడి క్కకడే విరుచుకుపడిపోయి వుండేవాడు ఆ దెబ్బకి.

యావరేజి మనిషి కాదు బదిలీ భాయ్..... అటువంటి చిన్న చిన్న సైడ్ కిక్స్‌కీ , ఫ్రంటల్ ఎటాక్స్‌కీ లొంగే మనిషి అంతకన్నా కాదు.

కంటికి కనిపించనంత వేగంతో కదిలిన శ్రీకర్ ఎడమ పాదాన్ని చటుక్కున పసికట్టేసి , చివ్వున వంగాడు క్రిందికి. వంగిన వాడు తిరిగి నిటారుగా నిలబడకుండానే శరవేగంతో దూరిపోయాడు శ్రీకర్ ఖాళీ చేసి వచ్చిన సందులోకి.

ఎంతో నేర్పుగా, మరెంతో వేగంగా తను కొట్టిన దెబ్బ ఎందుకూ పనికి రాకుండా పోయిందన్న అక్కసుతో, అతనితో పాటు గిర్రున తిరిగాడు శ్రీకర్ సందు వైపుకి.

బురద బురదగా వుంది అక్కడి నేల ..... ఆ సంగతిని మర్చిపోవటం వల్ల బాలెన్స్ తప్పి తల్లక్రిందులుగా పల్టీకొట్టేశాడు.

ఎదురుగా వచ్చిన మనుష్యుల్ని పట్టుకోలేక పోవటం మాట అటుంచి, అడుగులు వేయటం కూడా చేతకాని వాళ్ళు సీక్రెట్ ఏజెంట్స్ ఎలా అయ్యారో, అసలు అటువంటి వాళ్ళని సి.ఐ.బి. లోకి ఎవరు రిక్రూట్ చేసుకున్నారో అడుగుదామనే కోరిక ముఖేష్‌కి కలిగిన మాట వాస్తవం.

బలవంతంగా అదుముకున్నాడతను ఆ కోరికను. గుంటనక్క కంటే వంద రెట్లు తెలివితేటలు కలవాడు బదిలీ భాయ్...... వాగ్వివాదాలతో తాము ఇక్కడ కాలక్షేపం చేస్తూ కూర్చుంటే – ఢిల్లీ సరిహద్దుల్ని దాటి పారిపోగలడతను ఈ లోపల !

అందుకే శ్రీకర్ మీద ఎటువంటి కామెంట్సూ విసరకుండా, "గెట్ రెడీ.... గెట్ రెడీ ఎవ్రీబడీ...... దొంగ రాస్కెల్ మమ్మల్ని తప్పించుకుని సందులోకి వచ్చేశాడు........" అని అరిచాడు టాప్ పిచ్‌లో.

సందు చివర వున్న పెద్ద గంగరావి చెట్టు క్రింద నిలబడి వున్నాడు సి.ఐ.బి. సెక్యూరిటీ కాప్టన్ వాసు.

చిన్న చిన్న మద్ది చెట్టు మొదళ్ళ మాదిరిగా వున్న బాహువులను జాచి అతను సందుకు అడ్డం తిరగటాన్ని గమనించాడు బాణంలా పరిగెత్తుతున్న బదిలీ భాయ్.

పరుగును క్షణం కూడా ఆపకుండా, పాంటు వెనుక భాగంలో నుంచి బయటికి తీశాడతను మూరెడు పొడుగున్న పటకా కత్తిని.

ఒక అడుగు వెనక్కి వేసినట్లే వేసి, కత్తితో పాటు అతని మెడను కూడా పట్టుకున్నాడు కాప్టన్ వాసు..... ఎలక పిల్లను ఎత్తిననట్లు సునాయాసంగా గాలిలోకి ఎత్తి బలంగా విసిరాడు గంగరావి చెట్టు మొదలు కేసి.

ఆ అదటుకు పటకా కత్తి ఎటో ఎగిరిపోయినా లెక్క చేయలేదు బదిలీ భాయ్..... గంగరావి చెట్టుకు కొట్టుకొని తల పగిలిపోయినంత బాధ మెదడును ఆవరించుకుంటున్నా లక్ష్య పెట్టకుండా చటుక్కున లేచి పరుగు అందుకున్నాడు మళ్ళీ.

తను విసిరిన విసురుకు అతను ఇంకో రెండు మూడు గంటల దాకా చెట్టు క్రింది నుంచి లేవలేడని అనుకుంటున్న కాప్టన్ వాసు. అతని లాఘవానికి విస్తుబోతూ, సందు దద్దరిల్లి పోయేటట్లు వూదాడు తన దగ్గిర వున్న విజిల్‌ని.

సందును దాటి ఒక వీధిలోకి పోతున్నాడు బదిలీ భాయ్...... తన వెనుక నుంచి వినవచ్చిన విజిల్‌ని వినగానే పాంటు జేబుల్లోనుంచి బయటికి తీసి పట్టుకొన్నాడు బరువైన రెండు హేండ్ గ్రనేడ్స్‌ని.

అతను వూహించినట్లే పది అడుగుల దూరంలో వున్న బడ్డీకొట్ల చాటునుంచి వీధికి అడ్డంగా ప్రత్యక్షం అయ్యారు అరడజను మంది సి.ఐ.బి. సెక్యూరిటీ గార్డ్స్.

"తప్పుకోండి....... నా దారికి అడ్డం తప్పుకోండి....... ప్రాణాల మీద ఆశ వుంటే అవతలికి పొండి......." ప్రపంచంలో వున్న కరుకుతనాన్నంతా కంఠంలోకి తెచ్చుకుంటూ గ్రనేడ్స్‌తో వారిని బెదిరించాడు బదిలీ భాయ్.......

పాంటు బెల్టులకు వ్రేలాడుతున్న రివాల్వర్స్ మీద చేతులు వుంచి శిలా విగ్రహాల్లా అలాగే నిలబడ్డారు ఆ గార్డ్స్..... ఒక్క అడుగు కూడా అవతలికి వేయలేదు.

విపరీతమైన భయంతో చేతులు స్వల్పంగా కంపిస్తుండగా గ్రనేడ్స్‌ని గాలిలోకి ఎత్తాడు బదిలీభాయ్.

"వాటిని విసిరే ధైర్యం నీకు వుందా? మా గార్డుల్ని చంపి ఎంత దూరం పారిపోగలవు బదిలీభాయ్?" ఉన్నట్లుండి అతని ఎడమ చేతి వైపు నుంచి వినవచ్చిందొక కోకిల స్వరం.

ఉలిక్కిపడి అటు చూసిన బదిలీ భాయ్ కనులకు స్పష్టంగా కనిపించింది. మూసి వున్న ఒక హోటల్ తలుపుల దగ్గర్నించి రెండు అడుగులు ఇవతలికి వేసి నిలబడుతున్న బిందు.

"అన్యాయం..... అన్యాయం మేం సాబ్...... ఊరు పేరు లేని నా వంటి అధముడి కోసం మీరందరూ ఇలా కట్ట కట్టుకుని మాటు వేయటం అన్యాయం....... ఏం చేశాను నేను? మీకు ఏం ద్రోహం చేశాను??" ముంచుకు వస్తున్న దుఃఖాన్ని బలవంతంగా అదుముకుంటూ ప్రశ్నించాడు బదిలీభాయ్.

"ముందు ఆ గ్రనేడ్స్‌ని అవతల పడేయ్......." కమాండ్ చేసింది బిందు.

నిస్సహాయంగా తల విదిలించి గ్రనేడ్స్‌ని జాగ్రత్తగా క్రింద పెట్టి రెండు అడుగులు అవతలికి వేశాడతను.

"ఈ విధిచివర మా కార్లు నిలబడి వున్నాయి..... బుద్ధిగా అడుగులు వేయి వాటి దగ్గిరికి...... పిచ్చి వేషాలు వేస్తే ఏం జరుగుతుందో నీకు చెప్పనవసరం లేదనే అనుకుంటున్నాను ......." అన్నది బిందు.

తను పారిపోయి వచ్చిన సందు మొదట్లో శ్రీకర్, ముఖేష్, కాప్టన్ వాసులు ప్రత్యక్షం కావటాన్ని కను చివరల నుంచి గమనించి మరింతగా తల దించేసుకున్నాడు బదిలీ భాయ్...... పాదాల్ని మెల్లిగా కదిలించి వీధి చివరికి బయలు దేరాడు.

"థేంక్యూ వెరీమచ్ సిస్టర్...... ఈ గుంటనక్క గాడిని ఆపి మా పరువులు కాపాడావు..... వీడు తప్పించుకుని వుంటే నిర్మొహమాటంగా మా గొంతులు నులిమేసి వుండేవాడు గురువు గారు..... " తల వంచుకుని అడుగులు వేస్తున్న బదిలీ భాయ్‌ని చూసి తేలికా నిట్టూరుస్తూ అన్నాడు శ్రీకర్.

ఛట్ మని జ్ఞానోదయం అయింది బదిలీభాయ్‌కి ఆ మాటలు వినగానే.......

"మైగాడ్! అనవసరంగా భయపడ్డాడు తను..... వీళ్ళతో షాడో లేడు..... తనను పట్టుకునే కార్యక్రమంలో షాడో పాలుపంచుకోవటం లేదు !!"

షాడో అక్కడ లేడనే విషయం తెలిసేసరికి ఒక్కసారిగా వచ్చేసిందతనికి విపరీతమైన ధైర్యం.

మెరుపు కంటె వేగంగా పాంటు జేబులోకి పోయి, నల్లటి బంతి వంటి వస్తువును నేలకేసి బాదింది అతని కుడిచేయి.

"గెట్ బాక్.... గెట్ బాక్ ఎ వ్రీబడీ..... మనకు బురిడీ కొట్టనే కొట్టాడు దొంగ రాస్కెల్......" ఖంగారుగా అందర్నీ హెచ్చరిస్తూ, బిందు చేతిని పట్టుకొని వెనక్కి లాగాడు, ఆ కదలికను కొంచెం ఆలస్యంగా కనిపెట్టిన ముఖేష్.

చెవులు చిల్లులు పడే శబ్దంతో బ్రద్ధలైంది బదిలీ భాయ్ నేలకేసి కొట్టిన నల్లటి వస్తువు. కనులు మిరుమిట్లు గొలిపే వెలుగుతో పట్ట పగలుగా మారిపోయిందా ప్రదేశం.

ఆ వెలుగును చూడలేక అప్రయత్నంగా అందరూ కనులు మూసుకున్న తరుణంలో ఒక పెద్ద జంప్ చేసి కుడి చేతి వైపన వున్న ప్రహరీ గోడను దాటి విశాలమైన ఆవరణలో పడ్డాడు బదిలీ భాయ్.

పడిన వెంటనే లేచి నిలబడి మరోసారి పరుగు ప్రారంభించ బోతుండగా, ప్రహరీని ఆనుకొని దట్టంగా పెరిగిన పూపొదల మధ్యనుంచి అతని ముందుకు వచ్చాడు ఒక యువకుడు.

నల్లటి పాంటు మీద గోల్డెన్ చెక్స్ వున్న తెల్లని షర్టును ధరించి వున్నాడు...... పాంటు జేబులో నుంచి పనామా పాకెట్‌ని తీసి, ఎడమ చేత్తో సిగరెట్ వెలిగించుకుంటూ అతని వంక చూసి చిరునవ్వు నవ్వాడు.

"అయ్యబాబోయ్ షాడో సాబ్! మీరా!! మీరు ఇక్కడే వున్నారా??" తనకు తెలియకుండానే అన్నాడు బదిలీ భాయ్ ఆ మాటల్ని..... పారిపోయే ప్రయత్నాన్ని విరమించేసుకుని అక్కడే కూర్చుండి పోయాడు.

# 2

"....నువ్వు ఎటువంటి వాడివో తెలిసి కూడా, నీ గొప్పతనాన్ని ఎన్నోసార్లు కనులారా చూసి వుండి కూడా నేను రాకుండా వుంటానని ఎలా అనుకున్నావ్ బదిలీ భాయ్??" పనామా పొగను రింగులు రింగులుగా వదులుతూ చిరునవ్వుతో ప్రశ్నించాడు షాడో.

తన పాదాల క్రింద వున్న భూమి రెండుగా చీలి, షాడో కనులముందు నుంచి తనను లోపలికి లాగేసుకుంటే బాగుండునని ఎంతగానో కోరుకున్నాడు బదిలీ భాయ్.

అతని దురదృష్టం కొద్దీ అటువంటి మిరాకిల్ ఏదీ జరుగలేదు.

అంతలోనే ఆ గదిలోకి వచ్చింది బిందు. సెగలు వెలువరుస్తున్న ఆరు చాయ్ కప్పుల్ని తెచ్చి అతని ముందు పెట్టింది.

"మా వాళ్ళకు స్లిప్ యిచ్చే ప్రయత్నంలో పరిగెత్తి పరిగెత్తి బాగా అలసి పోయినట్లున్నావ్..... ముందు చాయ్ తాగు బ్రదర్ ...... చాయ్ తాగిన తరువాత మాట్లాడుకుందాం తీరికగా....." కప్పుల వైపు చేయి వూపుతూ అన్నాడు షాడో.

మొహమాట పడిపోయాడు బదిలీ భాయ్..... ఇబ్బందిగా కదులుతూ మెల్లిగా చేతిని జాచి ఒక కప్పును తీసుకున్నాడు....... రెండే రెండు గుక్కల్లో ఖాళీ చేసి క్రింద పెట్టేశాడు.

మిగిలిన కప్పులు అలాగే వుండి పోవటాన్ని గమనించి ఇంకోసారి చిరునవ్వు నవ్వాడు షాడో.

"ఇక్కడ పరాయి వాళ్ళు ఎవరూ లేరు బ్రదర్..... చాయ్ త్రాగటం ప్రారంభిస్తే ఒకేసారి నాలుగైదు కప్పులు ఖాళీ చేయందే నీకు తృప్తిగా వుండదని నాకు తెలుసు. నా వాళ్ళందరికి తెలుసు.... సో మొహమాటం అనవసరం......" మృదువుగా మందలించాడు.

ఆ పైన బెట్టు చూపలేదు బదిలీభాయ్...... ఒకదాని తర్వాత ఒకటిగా మిగిలిన కప్పులన్నీ ఫినిష్ చేశాడు. షాడో అందించిన సిగరెట్‌ని వెలిగించుకుంటూ కుర్చీ వెనక్కి వాలి కూర్చున్నాడు.

సన్నగా పొడుగ్గా గాలి గట్టిగా వీస్తే క్రింద పడిపోయేటట్లుగా కనిపిస్తాడు అతను. నోట్లో వేలు పెడితే కొరకటం ఎలాగో తెలియనంత అమాయకంగా ఆగుపిస్తూ వుంటాడు.

అవసరం అయితే పటకా కత్తిని పట్టుకొని పాతిక మందినైనా ఎదిరించగల దమ్ము అతని గుండెల్లో దాగి వుందనీ, ఎటువంటి ప్రాణాంతక పరిస్థితులలో నుంచైనా బయట పడేందుకు చిత్ర విచిత్రమైన సాధనాలు అతని పాంటు జేబులో నింపి వుంటాయని బహుకొద్ది మందికే తెలుసు.

ఫలానా పనిచేసే బ్రతుకుతూ వుంటాడు బదిలీ భాయ్ అనటం కంటే, అతను చేయని, చేయలేని పని ప్రపంచంలో ఏదీ లేదని అనటం సబబుగా వుంటుంది.

అంతటి అపూర్వమైన వ్యక్తి వారం రోజుల క్రితం పాకిస్థాన్ సరిహద్దుల్ని దాటి భారతదేశంలో అడుగు పెట్టినట్లు పసికట్టింది సి.ఐ.బి. ఇన్ఫర్మేషన్ డిపార్ట్‌మెంట్.....

భారతదేశంలో అడుగు పెట్టగానే సరాసరి ఢిల్లీ నగరానికి రాలేదు బదిలీ భాయ్...... రాజస్థాన్ రాష్ట్రంలోని నగరాలన్నిటినీ కలియ తిరిగాడు...... అక్కడి నుంచి బొంబాయి వెళ్ళాడు..... రెండు రోజులు ఆ సిటీనంతా సర్వే చేసి హఠాత్తుగా ప్రత్యక్షం అయ్యాడు ఢిల్లీ నగరం నడిబొడ్డులో.

"హీ మస్ట్ బి సెర్చింగ్ ఫర్ సమ్‌బడీ...... ఎవరి కోసమో వెతుకుతున్నాడు...... ఎవరి ప్రాణాలు తీయటానికో తారట్లాడుతున్నాడు......." బదిలీ భాయ్ ఢిల్లీలో కనిపించాడన్న వార్తను వినగానే షాడోతో అన్నాడు ముఖేష్.

కులకర్ణి గారికి చెప్పలేదు షాడో.... గుట్టు చప్పుడు కాకుండా తన వారిని ఎలర్ట్ చేసి వల పన్నాడు.

ఒక నైట్ క్లబ్‌లో రెండు పెగ్గుల బ్రాందీని పుచ్చుకొని మెల్లిగా రోడ్డుమీదికి వచ్చాడు బదిలీ భాయ్.......షాడో పన్నిన వలలో తల్లక్రిందులుగా పడిపోయాడు.

ఢిల్లీ నగరానికి దక్షిణ దిశలో సిటీ లిమిట్స్‌ని ఆనుకొని వుంటుంది అందమైన మీడియమ్ సైజ్ హోటల్ ఒకటి.

అతిథి మర్యాదల్లో, అత్యంత రుచికరమైన డిషెస్‌ని సర్వ్ చేయటంలో ఫైవ్ స్టార్ హోటళ్ళతో పోటీ పడుతుందని పేరు ఆ హోటల్ కి.

ఎలర్ట్‌గా స్మార్ట్‌గా వుంటారు ఆ హోటల్ వర్కర్స్..... ఎటువంటి కస్టమర్‌నయినా ఎంతో తెలివిగా మాలిమి చేసుకుంటారు.

ఆ హోటల్‌కి వస్తున్న పేరు ప్రఖ్యాతుల్ని చూసి సహించలేక వయలెన్స్‌ని వుపయోగించి కాంపిటీషన్ నుంచి తప్పించాలని ప్రయత్నించారు ఆ చుట్టుపట్ల వుండే చాలా మంది పెద్ద మనుష్యులు.

దొరికిన వాళ్ళని దొరికినట్లు కీళ్ళు తప్పించేశారు హోటల్ వర్కర్స్..... ముక్కలు ముఖాలు ఏకం చేసి వచ్చిన దారినే వెనక్కి పారిపోయేటట్లు చేశారు.

వయొలెన్స్‌తో పని జరగదని గ్రహించి పలుకుబడులను ప్రయోగించారు ఎదుటి పార్టీ.... పోలీసుల్ని మచ్చిక చేసుకుని ఉసికొల్పారు.

ధుమ ధుమలాడుతూ ఆ హోటల్‌లోకి పోయిన పది నిముషాల్లో నవ్వుతూ బయటికి వచ్చారు ఆ పోలీసులు..... ఎంత రెట్టించి అడిగినా లోపల ఏం జరిగిందో చెప్పలేదు ఎవరికీ..... తిరిగి అటుకేసి చూడను కూడా చూడలేదు.

తన మానాన తను వ్యాపారం చేసుకుంటూ, విపరీతమైన పేరు ప్రఖ్యాతులు సంపాదించుకుంది ఆ హోటల్ .... అచిరకాలంలోనే అందరికీ బాగా గుర్తుండిపోయింది.

దాన్ని ప్రారంభించింది సి.ఐ.బి. ఇన్ఫర్మేషన్ డిపార్ట్‌మెంటేనని, అందులో పనిచేసే వంట మనిషి మొదలు క్యాష్ కౌంటర్లో కూర్చునే క్లర్కుల వరకూ అందరూ సి.ఐ.బి. సెక్యూరిటీ స్టాఫ్‌కి చెందిన వారేనని కులకర్ణిగారికి, సి.ఐ.బి. స్టాఫ్‌లో అతి కొద్ది మందికీ తప్ప ఇంకెవరికీ తెలియదు.

తన చేతికి చిక్కిన బదిలీ భాయ్‌ని ఇప్పుడు ఆ హోటల్‌కి తీసుకు వచ్చాడు షాడో. ఖాళీగా వుంచిన పై అంతస్థులోని పెద్ద మీటింగ్ హాల్‌లో కూర్చోబెట్టాడు.

"ఎందుకు..... ఎందుకు నన్ను పట్టుకున్నారు షాడో సాబ్? నేను మీకు చేసిన అపకారం ఏముందని పట్టుకున్నారు??" పనామా పొగల్ని రింగులు రింగులుగా వదులుతూ అరమూసిన కన్నులతో తనవైపే చూస్తున్న షాడోని అడిగాడు బదిలీభాయ్ – జాలి గొలిపే కంఠంతో.

"ఐ వాన్ట్ సమ్ ఇన్ఫర్మేషన్ బ్రదర్..... ఐ వాన్ట్ నథింగ్ బట్ ట్రూత్....." సూటిగా అసలు విషయంలోకి వచ్చేశాడు షాడో.

ఎంత ప్రయత్నించినా దాచుకోలేక పోయాడు బదిలీభాయ్ తన ముఖంలో ప్రత్యక్షం అయిన ఆందోళనను.

"మీకు..... మీకు కావాల్సిన ఇన్ఫర్మేషన్ నా దగ్గిర ఏదీ లేదు షాడో సాబ్...... అసలు నేను పాకిస్థాన్ నుంచి బయలు దేరి వచ్చిన పనికి, మీకు ఎటువంటి సంబంధము లేదు..... మీ దేశానికి సంభందించినది కూడా కాదు...." గబగబా అన్నాడతను.

"ఇట్సాల్ రైట్ బ్రదర్ ..... మాకు సంభందించింది కాకపోయినా అదే కావాలి మాకు..... ఎందుకు వచ్చావ్ మా దేశంలోకి??" అతని ముఖం మీది నుంచి చూపుల్ని తిప్పకుండా రెట్టించాడు షాడో.

ఇబ్బందిగా ముఖం పెట్టి చేతులు జోడించాడు బదిలీ భాయ్.....

"నా సంగతి మీకు తెలుసు..... నా వృత్తిని నేను ఎంత పవిత్రంగా చూసుకుంటానో తెలుసు..... అన్నీ తెలిసి కూడా అనవసరమైన మాటలతో నన్ను బాధ పెట్టటం న్యాయమేనా?" అడిగాడు ఆవేదన నిండిన కంఠంతో.

పట్టిన పట్టు వదలలేదు షాడో.

"నథింగ్ డూయింగ్ బ్రదర్...... నా ప్రశ్నకు సమాధానం చెప్పు..... మాకు సంభందించింది కాదని నేను శాటిస్‌పై అయితే నాలోనే దాచుకుంటాను ఆ వివరాల్ని...... నీ దారిన నిన్ను పోనిస్తాను....." అని భరోసా యిచ్చాడు.

"ప్రామిస్?"

"యస్ బ్రదర్..... ఐయామ్ గివింగ్ మై వర్డ్....."

ఆ మాటల్ని వినగానే గుండెల మీది నుంచి కొండంత బరువు దిగిపోయినట్లు తేలిగ్గా నిట్టూర్చాడు బదిలీ భాయ్.

మాట ఇవ్వనే ఇవ్వడు షాడో......ఇచ్చాడంటే ప్రాణాలు పోయినా తప్పడు. షాడో మాట శిలాక్షరాలతో సమానమని వాడుక అండర్ గ్రౌండ్ సర్కిల్స్‌లో.

"కొద్ది కాలం క్రితం పాకిస్థాన్ ఆర్సెనల్ నుంచి ఆటంబాంబులను తస్కరించి టర్కీ దేశాధినేతల్ని బ్లాక్ మెయిల్ చేయటానికి ప్రయత్నించాడు సర్దార్ అమానుల్లా అనే ఒక పెద్ద మనిషి......" మెల్లిగా అన్నాడు బదిలీ భాయ్.....

[1]స్వయంగా పోయి అతని ఆటలు కట్టించి వచ్చాడు షాడో...... సర్దార్ అమానుల్లాని ఆ బాంబులతో సహా ఒక చెరువులో ముంచి ఎస్సైన్‌మెంట్‌ని ఫినిష్ చేశాడు.

ఆ విషయాన్ని బయట పెట్టకుండా నాన్ కమిటెడ్‌గా తల వూపి వూరుకున్నాడు ఇప్పుడు.

"సర్దార్ అమానుల్లాను ఎదిరించి ఆ బాంబుల్ని స్వాధన పరుచుకోవటానికి ట్వింకిల్ అనబడే ఏజెంట్‌ని రంగంలోకి దింపింది పాకిస్థాన్ స్పెషల్ బ్రాంచి......" తన మాటల్ని కంటిన్యూ చేశాడు బదిలీ భాయ్.

---

[1] పాకిస్థాన్ ఆర్సెనెల్ నుంచి ఆటంబాంబుల్ని అపహరించి టర్కీ దేశాన్ని బ్లాక్ మెయిల్ చేసిన సర్దార్ అమానుల్లాను షాడో ఎదుర్కున్న కథ "చైనీస్ మాస్క్" అనే పుస్తకంలో వివరించబడింది.

"ఆ ట్వింకిల్‌కి అనుకోకుండా ఎదురయినాడు రాజూ మియా అనబడే ఒక లోఫర్. ఎంతో తెలివిని ప్రదర్శించి అమానుల్లాని ఖతమ్ చేయటానికి సహాయ పడ్డాడు......" అంటూ అతని పోలికల్ని వివరించాడు.

"ఇప్పుడు అతని టాలెంట్స్‌తో అవసరం కలిగి అతని కోసం సెర్చి ప్రారంభించింది ఆ ట్వింకిల్...... అమానుల్లా ఖతమ్ అయిపోగానే అతను పాకిస్థాన్ బోర్డర్స్ దాటి భారతదేశంలోకి వచ్చేసినట్లు తెలుసుకుని నన్ను పంపింది......"

"రాజస్థాన్ నగరాలలో సంచరించి, బాంబే వెళ్ళాడు ఆ రాజూ మియా..... అక్కడి నుంచి ఢిల్లీ వచ్చినట్లు తెలుసుకోగలిగాను..... ఏదో ఒక విధంగా అతన్ని వెతికి పట్టుకొని ట్వింకిల్‌కి అప్పగించటంతో నా బాధ్యత ముగుస్తుంది.....ఇందుకే వచ్చాను నేను. ఎవరైనా అపకారం చేసే తలంపుతో కాదు......" మాటల్ని ముగించి ప్రక్కకు చూశాడు.

ఉబికి వస్తున్న నవ్వును అతి ప్రయత్నంలో అదిమి పట్టుకుంటూ, ఒక కుర్చీ వెనుక నిలబడి వుంది బిందు.

రాజూమియా వేషం వేసింది షాడోనేనని ఆమెకు తెలుసు. పాకిస్థాన్ స్పెషల్ బ్రాంచి తన జాడల్ని ట్రేస్ చేయకుండా బదిలీ భాయ్ చెప్పిన నగరాలన్నిటినీ కలియ తిరిగి, చల్లగా ఢిల్లీ వచ్చేశాడు షాడో. ఆ సంగతి తెలియక అల్లాడి పోతున్నాడు బదిలీ భాయ్..... తను మాట్లాడుతున్నది తనకు కావాల్సిన రాజూమియా తోనేనని తెలిస్తే గుండె ఆగి కుర్చీలో నుంచి క్రింద పడిపోతాడు.

బిందు మనస్సులోని మాటల్ని గ్రహించి నొసలు ముడివేస్తూ కోపంగా చూశాడు షాడో.

"గో ఆన్ బిందూ..... బ్రింగ్ సమ్ చాయ్ టూ అవర్ ఫ్రండ్..... అతిథి మర్యాదల్ని మర్చిపోయి అలా బొమ్మలా నిలబడిపోవటం బాగుంటుందా...... " కొంచెం తీవ్రంగానే అన్నాడు హెచ్చరింపుగా.

వెంటనే..... వెంటనే కదిలిందామె. గబగబా బయటికి పోయి, మరో ఆరు కప్పుల నిండా చాయ్‌ని నింపి తీసుకు వచ్చింది.

బదిలీ భాయ్ మరోసారి ఆ కప్పుల్ని ఖాళీ చేసేదాకా ఆగి, ఇంకో సిగరెట్‌ని ఆఫర్ చేశాడు షాడో.

"నా మాట మీద నమ్మకం వుంచి నిజం వెల్లడించి నందుకు సంతోషంగా వుంది బ్రదర్.... నీకు కావాల్సిన రాజూమియాను నేను గోరక్‌పూర్‌కి వెళ్ళే దారి దగ్గిర చూశాను..... ఎత్తుగా కండలు తిరిగిన శరీరంతో చాలా మొరటుగా వుంటాడు..... ఎప్పుడూ మందు కొడుతూనే వుంటాడు..... అతని వాలకాన్ని కాస్త మార్చి ఖరీదయిన దుస్తుల్ని ధరింపచేస్తే ఒకటి రెండు యాంగిల్స్‌లో నా పోలికలు కనిపిస్తాయి..... వుయార్ అబ్జర్వింగ్ హిమ్..... ఏ మాత్రం తోక ఝాడించినా అరస్ట్ చేయించి కటకటాల వెనక్కి నెట్టాలని మా ఉద్దేశ్యం......" తను కూడా సిగరెట్‌ని వెలిగించుకుంటూ చెప్పాడు.

"వద్దు.... వద్దు.... అతన్ని అరస్ట్ చేయవద్దు......" విపరీతమైన ఆందోళనతో వెంటనే అర్థించాడు బదిలీ భాయ్.

"అతను ఏదయినా పాడు పని చేయకముందే పట్టుకుని పాకిస్థాన్ తీసుకుపోతాను..... ఆ దేశం వదిలి ఇటుకేసి రాకుండా ఏర్పాట్లు చేయిస్తాను......" అన్నాడు.

సీరియస్‌గా ఆలోచిస్తున్నట్లు పోజు పెట్టి, పది నిముషాలు ఆ గదిలో పచార్లు చేశాడు షాడో.

"ఆల్ రైట్ బ్రదర్...... నీ మాట ప్రకారమే కానీయ్..... ఇంకోసారి అతను మాకు కనిపించటం జరిగితే ఫినిష్ చేసేస్తామనే మాటను మాత్రం బాగా గుర్తు పెట్టుకో......" అంటూ ఒక గోడకు బిగించి వున్న కాలింగ్ బటన్‌ని ప్రెస్ చేశాడు.

ఆ గది బయట వేసి వున్న సోఫాలలో కూర్చుని కునికిపాట్లు పడుతున్నారు మిగిలిన హీరోలు. నిద్రమత్తు క్షణంలో మటుమాయం అవుతుండగా ఒక్క గంతులో గదిలోకి ఎంటర్ అయినారు.

"మనం అబ్జర్వేషన్‌లో వుంచిన పాకిస్థాన్ గుండా రాజూమియా కోసం వచ్చాడు మన ఫ్రెండ్....... గోరక్‌పూర్ రోడ్డు దగ్గిర వుండే టావరిన్స్ దగ్గిర వదిలిరండి...... అతని తిప్పలేవో అతను పడతాడు....... మనకు ఎటువంటి సంబంధము లేని వ్యవహారం ఇది......" ఆశ్చర్యంగా చూస్తూ ఏదో అనబోతున్న శ్రీకర్‌ని చూపులతోనే వారిస్తూ ఆజ్ఞ యిచ్చాడు షాడో.

కృతజ్ఞత నిండిన కంఠంతో తన థేంక్స్ తెలియ చేసుకోబోయిన బదిలీ భాయ్ చేయి పట్టుకొని బయటికి లాక్కుపోయిడు ముఖేష్.

అతని సైగను అందుకొని హోటల్ వెనుక భాగంలో తమ కారు నొకదాన్ని రెడీగా నిలబెట్టాడు కాప్టన్ వాసు. వారిద్దరూ ఎక్కగానే తనే స్వయంగా డ్రయివ్ చేస్తూ గోరక్‌పూర్ రోడ్డు వైపు తీసుకుపోయాడు.

## 3

".... నో...... ఐ డోన్ట్ లైకిట్......అవసరం అయినప్పుడు ప్రాణాలకు తెగించి పనులు పూర్తి చేయటం అనేది మన వృత్తి. అవసరం లేనప్పుడు లేని పోని ప్రమాదాల్లో తలలు దూర్చటం అందుకు విరుద్ధమైన చర్య....... నువ్వు ఈ పని చేయటం నాకు ఇష్టం లేదు......" తెల్లవారు ఝామున నాలుగు గంటలకు నిద్ర లేపినందుకు విసుక్కుంటూ తన అభిప్రాయాన్ని వివరించారు కులకర్ణి.

అంతటితో ఆ టాపిక్ ఫినిష్ అయిపోయినట్లు గట్టిగా ఆవలించి, కుర్చీలో నుంచి లేచి నిలబడ్డారు.

తమ హోటల్ దగ్గిర్నించి శ్రీకర్‌ని, బిందును వెంటబెట్టుకొని అక్కడికి వచ్చిన షాడో ఆలోచనల మీద చన్నీళ్ళు చిలకరించినట్లు అయింది.

"మీరు అంత ఫర్మ్‌గా చెపుతుంటే ఇక మేము చేయగలిగింది ఏముంది సార్? వుయ్ విల్ ఫర్‌గెట్ ది ఇన్సిడెంట్......" అంటూ కుర్చీలో నుంచి లేచి వెనుతిరిగాడు.

అతని జాగ్వార్ స్పోర్ట్స్ కారు బంగ్లా మెయిన్ గేటును దాటగానే డ్రాయింగ్ రూమ్‌లో వున్న ఫోన్‌ని అందుకున్నారు కులకర్ణి.

వెంటనే సమాధానం యిచ్చింది సి.ఐ.బి. హెడ్ క్వార్టర్స్‌లో నైట్ డ్యూటీ చేస్తున్న బెట్టీ.

"మన మంకీలు అన్నీ కలిసి ఒక పాడు ఆలోచన చేస్తున్నాయి...... నా అంచనా ప్రకారం ఇంకో అరగంటలో హెడ్ క్వార్టర్స్ లోకి వస్తాయి..... డోన్ట్ ఎలౌవ్ దెమ్ ఇన్ టూ ది బిల్డింగ్ బెట్టీ...... ఇటీజ్ యాన్ ఎమర్జెన్సీ ఆర్డర్......" ఖంగుమంటున్న కంఠంతో ఆర్డర్ పాస్ చేశారాయన.

గతంలో ఎప్పుడూ అటువంటి ఆర్డర్‌ని విని వుండక పోవటం వల్ల నివ్వెరబోయింది బెట్టీ.

"అది కాదు సార్...... అసలు.....అది......" నత్తులు కొడుతూ ఏదో చెప్పబోయింది .

"మైండ్ యువర్ మానర్స్ బెట్టీ...... ఎవరితో మాట్లాడుతున్నావో అర్థం అవుతోందా??" ఖంగుమంది కులకర్ణి గారి కంఠం.

బిత్తరపోయింది బెట్టీ.

"యస్ సర్..... అలాగే చేస్తాను సర్..... ఐ విల్ ఎలర్ట్ ది సెక్యూరిటీ స్టాఫ్ సర్. ......" వినయంగా సమాధానం యిచ్చింది.

రిసీవర్‌ని ఫోన్ మీద పెట్టేసి, ఫోన్ ప్రక్కనే వున్న చిన్న ఉడెన్ బాక్స్‌లో నుంచి లావుపాటి సిగార్‌ని తీసి వెలిగించుకున్నారు కులకర్ణి.

* * * * *

".....ఉయార్ వెరీ సారీ సర్..... ఉదయం పది గంటల దాకా ఎవరినీ ఎలౌవ్ చేయొద్దని ఆర్డర్స్......"

సి.ఐ.బి. హెడ్ క్వార్టర్స్ ముఖ ద్వారానికి అడ్డుగా నిలబడుతూ వినయంగా చెప్పాడు సెక్యూరిటీ స్టాఫ్‌కి చెందిన గార్డు ఒకతను.

" ఆర్డర్స్ గీర్డర్సు మనకు వర్తించవు..... మర్యాదగా దారి వదలక పోతే పళ్ళు రాలిపోతాయని చెప్పు గురూ..... నీకు చెప్పటం చేతకాకపోతే నేను చెపుతాను......." అంటూ జాగ్వార్‌లో నుంచి క్రిందికి దూకబోయిన శ్రీకర్ చేయి పట్టుకుని ఆపేసింది బిందు. కనులతో రెండో అంతస్థు వైపు చూపించింది.

రెండో అంతస్థులో ఒక గ్లాస్ విండో వెనుక నుంచుని వుంది రిసెప్షనిస్టు బెట్టీ. ముక్కు మీద వేలు వేసుకొని తల అడ్డం తిప్పుతోంది.

"ఇది ఆ ముసలి బాస్ పన్నిన పన్నాగమే...... తన మాటల్ని పోషించుకోవటానికి అర్థం పర్థం లేని ఆర్డర్స్ యిచ్చినట్లున్నాడు..... వయస్సు పైన బడుతున్న కొద్దీ చాదస్తం ఎక్కువ అయిపోతుంది ఆయనకి......" కసిగా అంటూ సీట్లో కూర్చుండి పోయాడు శ్రీకర్.

"ఏం చేద్దాం రాజూ....... మీ బాస్ ఆఫీసుకు వచ్చేదాకా ఆగి, ఇంకోసారి ఆయనను వప్పించటానికి ప్రయత్నిద్దామా??" పనామా పొగల్ని గుండెల నిండా పీల్చుకుంటూ జాగ్వార్ దగ్గిరికి తిరిగి వచ్చిన షాడోతో అన్నది బిందు.

"లాభం లేదు బిందూ...... ఆయన వప్పుకోవటం ఇంపాజిబుల్..... ఇంకోదారి వెతుక్కోవాల్సిందే....." నుదురు రుద్దుకుంటూ సాలోచనగా అన్నాడు షాడో.

* * * * *

ప్రక్కనే వున్న ఫోన్ మ్రోగటం ప్రారంభించే సరికి చేతిలోని సిగార్ని యాష్ ట్రేలో పడేసి రిసీవర్ని అందుకున్నారు కులకర్ణి.

"మీరు చెప్పినట్లే చేశాను సర్...... రెండు నిముషాల పాటు బిల్డింగ్ ముందే నిలబడి టూ టవున్ వైపు పోయారు..... " వెంటనే వినవచ్చింది బెట్టీ కంఠం.

"ఆర్ యూ ష్యూర్ బెట్టీ? నువ్వు చూశావా??" అనుమానంగా అడిగారాయన.

"అమ్మతోడు సర్..... నా కళ్ళారా చూశాను...... " తనకు తెలియకుండానే శ్రీకర్ మాదిరిగా వట్లు పెట్టుకుంటూ సమాధానం యిచ్చింది బెట్టీ.

తన ఏజెంట్ల మాటలు చేతులు మిగిలిన స్టాఫ్ అందరి మీద ఎంతటి ఇంప్రెషన్ కలగచేస్తున్నాయో కులకర్ణిగారికి తెలుసు. ఆ విషయం ఇప్పుడు ఇంకోసారి ప్రత్యక్షంగా కనిపించేసరికి అప్రయత్నంగా వచ్చేసింది చిన్న నవ్వు.

"ఆల్ రైట్ బెట్టీ..... ఇట్సాల్ రైట్..... నీ మాటల్ని నమ్మలేక కాదు నేను అలా మాట్లాడింది. రూఢి చేసుకోవటానికి అడిగాను..... ఆల్ రైట్ యూ కెన్ గో ఆన్ విత్ యువర్ వర్క్...... " అంటూ రిసీవర్ని క్రెడిల్ చేసి రెండు క్షణాల తరువాత ఇంకో నెంబర్కి రింగ్ చేశారాయన.

"హల్లో...... ఎవరు ??" వెంటనే వినవచ్చింది నిద్ర మత్తుతో జోగుతున్న కంఠం ఒకటి.

"హోమ్ మినిష్టర్ గారితో మాట్లాడాలి.... ప్లీజ్ కనెక్ట్ మీ టూ హిమ్......" రిక్వెస్ట్ చేశారు.

ఆయన కంఠాన్ని గుర్తుపట్టి నిద్ర మత్తులో నుంచి చటుక్కున బయట పడింది అవతలి గొంతు.

"గుడ్ మార్నింగ్ సర్..... వన్ సెకన్ సర్..... వన్ సెకన్‌లో కనెక్ట్ చేస్తాను......" అంటూ ఏవేవో బటన్స్ నొక్కింది.

పది క్షణాల తరువాత లైన్లోకి వచ్చారు హోమ్ మినిస్టర్ గారు.

"హల్లో కులకర్ణీ..... ఇప్పుడే నిద్ర లేచాను..... లేవగానే రిసీవర్‌ని చేతికి యిచ్చాడు నా సెక్రటరీ...... ఏమిటి విషయం??" నవ్వుతూ ప్రశ్నించారు.

"ప్రస్తుతానికి పెద్ద విషయం ఏదీ లేదు సర్...... మా కోతులు – పెద్ద కోతితో సహా మీ దగ్గిరికి రావచ్చు..... వాళ్ళు ఏం చెప్పినా, ఏది అడిగినా ప్లీజ్ రెఫ్యూజ్.... అవుట్‌రైట్‌గా నిరాకరించండి....... ఏ మాత్రం తల వూపినా కాకమ్మ కథలు చెప్పి మిమ్మల్ని బుట్టలో వేసేసుకుంటారు..... ఓకేనా??" సూటిగా చెప్పారు కులకర్ణి.

"అసలు ఏం జరిగింది కులకర్ణి? జరిగింది ఏమిటో తెలియకుండా, షాడో మాటల్ని కాదనటం నాకు చేత కాదని నీకు తెలుసు గదా......." చిరునవ్వుతూ అన్నారు హోమ్ మినిష్టర్ గారు.

"అటువంటి సెంటిమెట్లు ఇప్పుడు పనికిరావు సర్...... మీరు నేను చెప్పినట్లు చేయకపోతే ఆ దుర్మార్గుడు ఎసైన్‌మెంట్ గోల్డెన్ రోబ్ లోకి అడుగు పెడతాడు..... అప్పుడు మీ పరువులు నా పరువులు కట్టకట్టుకుని మట్టిలో పొర్లిగింతలు పెడతాయి...... నా మాటలు అర్థం అయ్యాయా?"

చటుక్కున మాయం అయింది హోమ్ మినిస్టర్ గారి ముఖంలోని చిరునవ్వు.

"మైగాడ్.... షాడోకి ఎలా తెలిసింది? మన ఇద్దరికి తప్ప ఇంకెవరికీ తెలియదని అనుకున్న ఆ విషయం అప్పుడే అతని చెవికి ఎలా చేరింది?" ఆశ్చర్యంగా ప్రశ్నించారు.

"ఎస్సైన్‌మెంట్ గోల్డెన్ రోబ్ సంగతి షాడోకి తెలియదు సర్..... కాని కొన్ని విచిత్రమైన పరిస్థితులు అతన్ని అటుకేసి నడిపిస్తున్నాయి. ఆ నడక కాస్తా పరుగుగా మారి మన కంట్రోల్ నుంచి తప్పుకోక ముందే జాగ్రత్త పడాలి..... అందుకే మిమ్మల్ని కంటాక్టు చేశాను..... ప్లీజ్ బీ వెరీ కేర్‌ఫుల్....." అంటూ లైన్‌ని కట్ చేశారు కులకర్ణి.

తన చేతిలోని రిసీవర్‌ని సెక్రటరీ చేతికి యిస్తూ తల విదిలించారు హోమ్ మినిష్టర్ గారు......

"షాడో గాని, అతని స్నేహితులు గాని యిక్కడికి వస్తే నేను అవుటాఫ్ స్టేషన్ అని చెప్పు..... ఇంకో నాలుగు రోజులదాక రానని కూడా చెప్పు......" అని ఆర్డర్స్ పాస్ చేసి బెడ్ వెనక్కి వాలి కనులు మూసుకున్నారు......

"..... నో..... నేను నమ్మను.... అవుటాఫ్ స్టేషన్ కాదు గోంగూర పచ్చడి కాదు. ఇది కూడా ఆ ముసలి ఘటం పన్నిన పన్నాగమే......" వేడిగా అన్నది బిందు.

"గోంగూర పచ్చడి గోంగూర పచ్చడి అంటూ తొంభై తొమ్మిది సార్లు అన్నావు సిస్టర్..... అసలా పచ్చడి ఎలా వుంటుందో ఒక్కసారి కూడా నాకు రుచి చూపించలేదు......" సన్నగా గొణిగాడు శ్రీకర్.

"నాకు మాత్రం ఏం తెలుసు? తెలియటానికి నేనేమైనా ఆంధ్రప్రదేశ్‌లో పుట్టి పెరిగానా? ఈ పెద్ద మనిషిని కట్టుకున్న తర్వాతే నాకు కూడా వంట బట్టింది ఆ మాట..... అతన్నే అడుగు......" ముక్కును ఎగబీలుస్తూ షాడో కేసి చూసింది బిందు.

వాళ్ళ మాటలు ఒక్కటి కూడా అతని చెవికి చేరటం లేదు.

*ఎటువంటి ప్రమాదము లేని ఒక చిన్న నాటకం ఆడి విషయం ఏమిటో తెలుసుకోగోరాడతను. అందుకు నిరాకరించటమే కాకుండా తన అడుగు పడకుండా ఎయిర్ టైట్ ఏర్పాట్లు చేస్తున్నారు కులకర్ణి గారు. ఎందుకు ? ఎందుకు ఈ జాగ్రత్తలు ??*

ఉన్నట్లుండి అతని మనస్సులో మెదిలింది ఒక ఆలోచన.

"కమాన్ బిందు.... స్టార్ట్ ది ఇంజన్......" అంటూ చేతిలోని సిగరెట్‌ని అవతలికి విసిరి జాగ్వార్లో కూర్చున్నాడు.

ఇంజన్‌ని స్టార్ట్ చేసింది బిందు. గేర్లు మార్చి యాక్సిలేటర్‌ని అడుగు కంటా అదిమి పట్టి ముందుకు దూకించింది జాగ్వార్‌ని.

* * * * *

"మైగాడ్.... నువ్వా మిస్టర్ షాడో! నువ్వు మా సహాయం కోసం వచ్చావా?? ఇటీజ్ రియల్లీ ఎ బిగ్ సర్‌ప్రయిజ్.... కమాన్..... కమాన్......"

షాడో తనను కలుసుకోవటానికి వచ్చాడని వినగానే, నిద్ర ముఖంతో, నైట్ డ్రస్‌ని కూడా మార్చుకోకుండా ఎదురు వచ్చి సాదరంగా ఆహ్వానించాడు ఢిల్లీ నగరంలోని టర్కిష్ అంబాసిడర్.

"ఎస్సైన్‌మెంట్ చైనీస్ మాస్క్ వివరాలు మీకు గుర్తున్నాయా??" ఒక ఎయిర్ కండిషన్ గదిలో కూర్చుని, అంబాసిడర్ తెప్పించిన కాఫీని సిప్ చేస్తూ అడిగాడు షాడో.

టర్కిష్ అంబాసిడర్ ముఖం మీద మెరుస్తున్న చిరునవ్వు ఒక్కసారిగా పెరిగి పెద్దదై పోయింది.

"గుర్తులేక ఎక్కడికి పోతాయి మిస్టర్ షాడో? మా దేశపు పరువు ప్రతిష్టల్ని సర్వనాశనం కావించబోయిన ఆ అమానుల్లాని అప్పుడే ఎలా మర్చిపోతామని అనుకున్నావ్? అతని ఆట కట్టించి మాకు మరువలేని మేలు చేసిన నీ తెంపరితనాన్ని మర్చిపోవటం సాధ్యమా?" అన్నాడు ఆప్యాయంగా చూస్తూ.

ఆ మెచ్చుకోలు మాటలకు మహా ఇబ్బంది పడిపోయాడు షాడో.

" అమానుల్లాను ఎదుర్కోవటానికి నేను రాజూమియా అనే గుండా వేషం వేశాను..... ఎస్సైన్‌మెంట్ పూర్తి అయిన తరువాత అదే వేషంలో పాకిస్థాన్ నుంచి పారిపోయి వచ్చేశాను. ఇప్పుడు ఆ వేషంతో పని పడింది. అప్పటి అవతారం ఎలా వుందో, ఏ విధమైన గెటప్‌లో కనిపించానో నాకు వివరాలు కావాలి...... కెన్ యూ గివ్ మీ ది డీటెయిల్స్??" ఇబ్బందిని కవర్ చేసుకోవటానికి ప్రయత్నిస్తూ అడిగాడు.

అవి సంస్థలో వుంటాయి గదా. మేము ఇవ్వాల్సిన అవసరం ఏముందని అడగబోయి ఆఖరి క్షణంలో తమాయించుకున్నాడు టర్కిష్ అంబాసిడర్. గబగబా తన టేబిల్ దగ్గిరికి పోయి, ఒక రెడ్ కలర్ ఫోన్‌ని అందుకున్నాడు.

శాటిలైట్స్ సహాయంతో డైరెక్ట్‌గా అతని దేశాధినేతలతో మాట్లాడటానికి వీలు కల్పించే సాధనం అది.....

పది నిముషాలు ఎవరితోనో మాట్లాడి నవ్వు ముఖంతో వెను తిరిగాడతను.

"నీకు సహాయం చేయగలగటం మా అదృష్టం మిస్టర్ షాడో..... ఎస్సైన్‌మెంట్ మధ్యలో ఒకచోట మా ఏజెంట్స్ నిన్ను కలుసుకున్నారట....... స్నేహితుడివైనా చేతులు వూరుకోక తన వద్ద వున్న మినీ కెమెరాతో నీ ఫోటో తీసి భద్రపరిచాడట. మా ఏజెంట్ ఒకతను. మా విమానదళానికి చెందిన బాంబర్ విమానం ఒకటి మరో మూడు గంటల్లో ఇక్కడికి తీసుకు వస్తుంది ఆ ఫోటోని..... తీసుకు రాగానే మీ హెడ్ క్వార్టర్స్‌కి పంపించనా?" అన్నాడు.

ఉలికిపాటును నేర్పుగా కప్పిపెట్టుకుంటూ తల అడ్డం తిప్పాడు షాడో.

"ఆ శ్రమ మీకు అనవసరం సర్....... మీకు అభ్యంతరం లేకపోతే ఆ ఫోటో వచ్చేదాకా మేము ఇక్కడే వెయిట్ చేస్తాం..... బై ది బై..... నా గురించి ఎవరు ఎంక్వయిరీ చేసినా వివరాలు చెప్పవద్దు...... నేను ఇక్కడికి వచ్చినట్లుగా బయటికి పొక్కనీయద్దు......" రిక్వెస్ట్ చేశాడు.

మరింత ఆశ్చర్యానికి గురి అయినాడు టర్కిష్ అంబాసిడర్ ఆ మాటాల్ని విని. అయినా సరే ఎదురు ప్రశ్నలు వేయకుండా తన సెక్రటరీని పిలిచి వారిని లైబ్రరీ రూమ్ లోకి తీసుకుపోయి కంపెనీ ఇవ్వవలసిందిగా ఆదేశించాడు.

వాళ్ళు లైబ్రరీ రూమ్‌కి వెళ్ళిన పది నిముషాలు కల్లా వచ్చిందాయనకు ఒక ఫోన్ కాల్.

"హల్లో.... నేను హోమ్ మినిష్టర్ గారి పర్సనల్ సెక్రటరీని మాట్లాడుతున్నాను సర్..... హోమ్ మినిస్టర్ గారికి బాగా కావల్సిన వ్యక్తులు కొందరు మీ వద్దకు వచ్చారా??" రిసీవర్‌ని ఎత్తగానే వినవచ్చింది ఆ ప్రశ్న.

పాజిటివ్‌గా రిప్లయి ఇవ్వబోయి షాడో చేసిన హెచ్చరిక గుర్తుకు రాగా నెగటివ్ సమాధానం యిచ్చాడు టర్కిష్ అంబాసిడర్. ఎవరూ తన పద్దతు రాలేదని చెప్పాడు.

"థేంక్యూ సర్..... ఒక వేళ ఎవరైనా వస్తే అన్యధా భావించకుండా మా మినిష్టర్ గారికి తెలియచేయ గలరా?" అడిగాడు ఆ సెక్రటరీ.

తప్పకుండా తెలియచేస్తానని మాట యిచ్చాడు అంబాసిడర్..... కావాలంటే కాగితం మీద వ్రాసి డిప్లమాటిక్ బేగ్‌లో పెట్టి మరీ పంపిస్తానని కూడా భరోసా యిచ్చి ఫోన్ పెట్టేశాడు.

"సమ్ థింగ్ రాంగ్ విత్ దిస్ ఇన్సిడెంట్ సర్......షాడో యీజ్ నథింగ్ బట్ యాన్ పెయిడ్ ఏజెంట్ .....జీతం కోసం పనిచేస్తున్న ఒక ఏజెంట్ మాటల్ని విని హోమ్ మినిష్టర్ ఎంక్వయిరీని తప్పుదోవ పట్టించటం మంచి పని

అనిపించుకుంటుందా??" షాడోని లైబ్రరీ రూమ్‌లో కూర్చోబెట్టి కాఫీ టిఫెన్లు ఏర్పాటు చేయించటానికి అటుగా వచ్చిన అతని సెక్రటరీ అడిగింది.

వెంటనే సమాధానం యివ్వలేదు అంబాసిడర్. రెండు నిముషాలు ఆలోచించి తన పర్సనల్ ఫైల్స్‌లో నుంచి ఒక బ్లూ కలర్ ఫోల్డర్‌ని ఆమె ముందు పెట్టాడు.

*కోడ్ నెంబర్ 999*

*సబ్జక్ట్ పేరు షాడో.*

*ఎత్తు ఆరు అడుగులు .*

*చామన చాయ...... చూడగానే ఇంప్రెస్ చేయగల దృఢమైన శరీరం . వెరీ వెరీ ఎఫిషియంట్ ఇన్ మార్షల్ ఆర్ట్స్. రకరకాల ఆయుధాల్ని ఉపయోగించుటంలో విపరీతమైన నేర్పు వుంది.*

*ఎక్కువగా డాగర్ అనబడే చిన్న చురకత్తిని ఉపయోగిస్తాడు.*

*ఎటువంటి వాతావరణానికైనా ఎడ్జస్ట్ కాగల నేర్పు. ఎవరితోనైనా కలిసిపోగా చాతుర్యం వున్నాయి.*

*మేకప్ సామాగ్రిని ఉపయోగించి వేషాలు మార్చటం చాలా తక్కువ.*

*తను ప్లే చేస్తున్న కారెక్టర్‌లో నటించటం కాదు జీవించటం అతని స్పెషాలిటీ..... మేకప్ లేకపోయినా ఆ సమయంలో అతన్ని గుర్తుపట్టటం బాగా పరిచయం వున్న వారికి కూడా కొంచెం కష్టమే అవుతుంది. ఇంటర్‌పోల్ స్టార్ ఏజెంట్‌గా నామినేట్ చేయబడిన ఈ షాడో స్వయంగా వచ్చినా, లేక కబురు*

*పంపించినా , ఎటువంటి సహాయన్నయినా సరే వెంటనే చేయవలసిందిగా ఇంటర్‌పోల్ అభ్యర్థిస్తున్నది.*

*సోవియట్ రష్యా ఇంటర్‌పోల్ ఆదేశాలను అండర్ లైన్ చేసి బలపరుస్తున్నది.*

ఇంటర్‌పోల్ డైరెక్టర్లు అందరూ చేవ్రాలు చేసిన కమ్యూనికేషన్ ఆ ఫోల్డర్‌లో వుంది. అందులోని మేటర్‌ని చదివేసరికి మాట రాలేదు ఆ సెక్రటరీ నోటి వెంట.

"షాడో క్వాలిఫికేషన్స్ ఇవే కాదు డియర్.... ఇంకా చాలా వున్నాయి. తలుచుకుంటే తన అధికారులకు ఉపయోగించి తనకు తానే మన ప్రభుత్వం వద్దనున్న ఆ ఫోటోని సంపాదించుకోగలడు..... ఈ విషయాలన్నీ ఆలోచించుకొనే అతని రిక్వెస్ట్‌ని యాక్సెప్ట్ చేశాను..... యామై రైట్??" చిరునవ్వుతో ప్రశ్నించాడు అంబాసిడర్.

అంతవరకూ షాడో కేవలం సామాన్యమైన ఇండియన్ ఏజెంటేనని భావిస్తున్న అతని సెక్రటరీ, ఇంటర్‌పోల్ పేరును ఫోల్డర్‌లో చదివేసరికి మనసు మార్చేసుకుంది.

"యువార్ యాబ్సల్యూట్లీ కరెక్ట్ సర్..... ఐయామ్ సారీ....." అంటూ అంతకు ముందు మాటలకు క్షమాపణలు చెప్పుకొని తన పని మీద తను వెళ్ళిపోయింది.

సన్నపాటి టర్కిష్ సిగరెట్‌ని వెలిగించుకొని తన సీట్లో కూర్చున్నాడు అంబాసిడర్.... తమ దేశం నుంచి వచ్చే బాంబర్ విమానం కోసం ఎదురు చూడసాగాడు.

## 4

"......లాభం లేదు ముఖేష్ సార్....... ఆ రాజూ మియా అడ్రసులు మార్చేసినట్లు అగుపిస్తోంది. ఎవరిని అడిగినా అటువంటి పర్సనాలిటీని ఇంతవరకు చూడలేదనే అంటున్నారు......" గోరక్‌పూర్ రోడ్డు చుట్టు పట్ల వుండే సందులన్నిటినీ గాలించి గాలించి నీరసంగా అన్నాడు బదిలీ భాయ్.

గోరక్‌పూర్ చమన్ దగ్గర వుండే పెద్ద ఇరానీ హోటల్లో కూర్చుని చాయ్ తాగుతున్నారు ముఖేష్, కాప్టన్ వాసులు. బదిలీభాయ్ మాటలకు ఒకరి ముఖం ఒకరు చూసుకున్నారు ప్రశ్నార్థకంగా.

రాజూమియా వేషం వేసుకొని ఆ పాటికి అక్కడికి వచ్చేయాలి షాడో..... ఇంకా రాకపోవటానికి కారణం ఏమై వుంటుంది ?

"నేను కూడా ఒకసారి రోడ్డు మీదికి పోయి వస్తాను...... ఈ బదిలీ భాయ్‌ని చూసి కొత్త ముఖమనే అనుమానంతో నెగిటివ్‌గా మాట్లాడి వుంటారు ఇక్కడి వాళ్ళు......" అంటూ కుర్చీలో నుంచి లేచాడు కాప్టన్ వాసు.

రోడ్డు మీదికి పోయి రావటమంటే హెడ్ క్వార్టర్స్‌కి ఫోన్ చేసి ఏం జరిగిందో తెలుసుకోవటం...... ఆ పని బదిలీ భాయ్ ముందు చేయటం కుదరదు కదా !!

రెండు క్షణాలు ఆలోచించి అంగీకర సూచకంగా తల వూపాడు ముఖేష్. వెంటనే బయటికి వచ్చాడు కాప్టన్ వాసు. హోటల్‌కి వంద గజాల దూరంలో వున్న ఒక పబ్లిక్ ఫోన్ దగ్గిరికి పోయి రిసీవర్‌ని చేతుల్లోకి తీసుకున్నాడు.

వెంటనే అతని భుజం మీద పడింది ఒక చేయి.

"నాకు తెలుసు..... మీరు ఇటువంటి పని ఏదో చేసి మొదటికి మోసం తీసుకొస్తారని తెలిసే ఇక్కడికి పరిగెత్తు కొచ్చాను...... " అంటూ చేతిలోని రిసీవర్‌ని లాక్కుని ఫోన్ మీద పడేసి బూత్ ప్రక్కకు అతన్ని లాక్కుపోయాడు శ్రీకర్.

"మనం చేస్తున్న పని బాస్‌కి యిష్టం లేదు..... అడుగు అడుగుకూ అరడజను అడ్డంకుల్ని క్రియేట్ చేస్తున్నారు.... నోరు మూసుకుని హోటల్లోకి పోయి ఆ బదిలీ భాయ్ చేజారి పోకుండా కాపలా కాస్తూ వుండండి...... ఇంకో పది నిముషాల్లో వచ్చేస్తాడు గురువు గారు....." జరిగిన సంఘటనల్ని క్లుప్తంగా వివరిస్తూ అన్నాడు.

రెండో మాట మాట్లాడలేదు కాప్టన్ వాసు. కామ్‌గా వెనుదిరిగి వచ్చిన దారినే హోటల్ వైపు బయలు దేరుతుండగా కనిపించారతనికి, వంద అడుగుల దూరంలో టాక్సీ దిగి దిక్కులు చూస్తున్న రాజస్థాన్ స్మగ్లర్స్ రామ్‌దయాళ్ సోదరులు.

వేళ కాని వేళలో వాళ్ళు అక్కడ ప్రత్యక్షం కావటం కొంచెం ఆశ్చర్యం అనిపించి అటు కేసి తిరగబోయాడు వాసు.

గింగిరాలు తిరుగుతూ టెలీఫోన్ బూత్ ప్రక్కనుంచి దూసుకు వచ్చింది ఒక చిన్న గులకరాయి. తల వెనుక భాగానికి తగిలి కుంకుడు కాయంత బుడిపె కట్టింది.

పట్టరాని కోపంతో పళ్ళు కొరుకుతూ వెనక్కి తిరిగిన అతని కనులకు కనిపించింది అప్పుడే శ్రీకర్ ప్రక్కకు వచ్చి నిలబడిన బిందు.

"గో ఎవే యూ బ్లడీ ఫూల్.... నోరు మూసుకుని నీ దారిన నువ్వు పోకుండా ఏమిటా పిచ్చి ఆలోచనలు??" అనే అర్థాన్ని వెలువరిస్తున్న ఆమె చూపుల్ని గమనించి, రామ్‌దయాళ్ సోదరులను పలుకరించే ప్రయత్నాన్ని విరమించేసుకున్నాడు కాప్టన్ వాసు. తల వంచుకొని గబగబా హోటల్లోకి వెళ్ళిపోయాడు.

"ఏమయింది వాసూ? ఎనీ ప్రోగ్రెస్??" అని అతన్ని అడగబోతూ రోడ్డు వైపు చూసి వులిక్కిపడ్డాడు ముఖేష్.

అతనితో పాటు అటు కేసి చూసి టాక్సీ దగ్గిర నిలబడి వున్న రామ్‌దయాళ్ సోదరులను గుర్తు పట్టేశాడు బదిలీ భాయ్....

పంచ పాండవుల మాదిరి ఖచ్చితంగా ఐదుగురే వున్న ఆ సోదర బృందం అంటే అతనికి కొంచెం భయం వున్న మాట వాస్తవం.

"బాప్ రే బాప్! వీళ్ళెందుకు వచ్చారిక్కడికి? ఆ రాజూమియాకు వీళ్ళకు కనెక్షన్స్ వుండి వుంటాయా కొంపతీసి!!" తనలో తను అనుకుంటున్నట్లు పైకే అనేశాడు వణుకుతున్న కంఠంతో.

"అతనికి వీళ్ళకి కనెక్షన్స్ వుంటే నీ కెందుకు? నీకేం భయం??" పైకి వస్తున్న నవ్వును అదిమి పట్టుకుంటూ అడిగాడు ముఖేష్.

"నా కెందుకా? నా కెందుకు భయమని అడుగుతున్నారా? రాజూమియా వీళ్ళ మనిషి అయితే అతన్ని పట్టుకోవటం నాకు సాధ్యపడుతుందా? అసలు నా కోసమే వచ్చారేమో వీళ్ళు! నేను రాజూమియా కోసం రాజస్థాన్ నగరాల్ని గాలించానని తెలిసి నా అంతు చూడటానికే ఏతెంచారేమో!!" ముఖం మీద ప్రత్యక్షం అయిన చెమటల్ని తుడుచుకోవటం కూడా మరిచిపోయి ఆందోళనగా అన్నాడు బదిలీ భాయ్.

అతనా మాట అంటుండగానే వీధిలో చెలరేగింది కల్లోలం.

"పట్టుకోండి...... దొంగ నాయల్ని పట్టుకోండి.... పట్టుకోండి......." అని అరుస్తూ ఎగబడ్డారు రామ్‌దయాళ్ సోదరులు.

మీదికి వచ్చిన చేతుల్ని విదిలించి కొడుతూ బొంగరంలా గిర్రున రెండు గిరికీలు తిరిగి సూటిగా హోటల్ దగ్గిరికి వచ్చేసింది ఒక పర్సనాలిటీ. హోటల్ ప్రక్కనే వున్న చిన్న సందులోకి దూకి మాయమై పోవాలని చూసింది కాని, నేరవేరలేదు ఆ ఆశయం .

యమభటుల్లా వచ్చి అతన్ని చుట్టు ముట్టేశారు రామ్‌దయాళ్ సోదరులు.

"పట్ట పగలే మా జేబుల్ని కొట్టేటంత మొనగాడివా? ఏదీ ఇప్పుడు కొట్టు..... కొట్టరా ..... కొట్టు........" అంటూ అతని జుట్టు పట్టుకుని ఎలక పిల్లను ఎత్తినట్లు ఎత్తి అటూ ఇటూ విసిరేశాడు భీమబలుడైన రంగరాజు.

అతనిలా నోరు పారేసుకోలేదు మిగిలిన వాళ్ళు..... తలా ఒక ప్రక్క చేరి పిడికిళ్ళతో కుమ్మటం మొదలు పెట్టారు.

భరించరాని బాధలో మెలికలు తిరిగి పోతూ కూడా పెదవి విప్పి బాధా సూచక శబ్దం ఒక్కటి కూడా చేయటం లేదా పర్సనాలిటీ........ అవకాశం దొరికితే ఇంకోసారి ఉడాయించే ప్రయత్నంలోనే వుంది.

హోటల్ గుమ్మంలోకి వచ్చేసిన ఇతర కస్టమర్సతో పాటు తను కూడా ఆ దృశ్యాన్ని చూసిన బదిలీ భాయ్ గుండెల్లో ఒక్కసారిగా పడింది పెద్ద బండరాయి.

"అయ్య బాబోయ్..... అతనే..... ముఖేష్ సార్..... మనకు కావల్సిన రాజూమియానే అతను..... ఆపండి సార్.... వాళ్ళని ఆపండి..... అతని కాళ్ళు చేతులు విరిచేసి నాకు పనికి రాకుండా చేయక ముందే ఆపి పుణ్యం కట్టుకోండి......" ప్రక్కనే వున్న ముఖేష్ చేతులు పట్టుకొని బ్రతిమాలాడాడు.

తమకు రామ్‌దయాళ్[2] సోదరులకు స్నేహం వున్న సంగతి అతనికి తెలిసే అలా అడుగుతున్నాడని గ్రహించి, ఒకసారి గట్టిగా గొంతు సవరించుకుని ముందుకు అడుగు వేశాడు ముఖేష్.

తన ముఖం మీద పడబోయిన రామ్‌దయాళ్ పిడికిలిని ఎడమచేత్తో విదిలించి కొట్టాడు రాజూమియా..... అది చూసి పళ్లు కొరుకుతూ అతని ఎడమ చేతిని పట్టుకొని మధ్యకు విరిచేయబోతున్నాడు రంగరాజు.

---

[2] రామ్‌దయాళ్ సోదరులు – – రామ్‌దయాళ్, దీనబంధు, రంగరాజు, తుకారం, ధనుష్కోటి షాడోకి ఆప్తమిత్రులు. వీరితో షాడో పరిచయం అనేక పుస్తకాల్లో వివరించబడింది.

"ఆగు బ్రదర్ ఆగు..... కొంచెం ఆగి నా మాట విను....." గబగబా అంటూ అతన్ని సమీపించి చేతిని గట్టిగా పట్టుకున్నాడు ముఖేష్.

కోపంగా చూడబోయి,అతన్ని గుర్తుపట్టి ఆనందంగా నవ్వేడు రంగరాజు.

"చూడు ముఖేష్ ....... ఈ దగుల్బాజీ పట్టపగలు మా జేబులు కొట్టాడు. వీడిని ఏం చేస్తే బాగుంటుంది??" మోకాలితో రాజూమియా మెడ మీద పొడుస్తూ అన్నాడు.

"ఆకలితో పేగులు మాడి ఏదో కాస్తంత కక్కుర్తి పడినట్టున్నాడు..... మీరెవరో తెలియక సాహసం చేశాడు..... వదిలేయండి రంగరాజూ..... పాపం ఈసారికి క్షమించి వదిలేయండి ......." సర్ది చెప్పాడు ముఖేష్.

తమ సోదరుడు రామ్‌దయాళ్ వైపు చూశాడు రంగరాజు.

"మన దోస్త్ వచ్చి అడిగితే అందుకు అప్పీలు ఏముంటుంది? వదిలేయండి" గంభీరంగా అన్నాడు రామ్‌దయాళ్.

చెవి మెలిపెట్టి "నువ్వు లేచిన వేళ చాలా మంచిది బే.....మా దోస్త్ ముఖేష్ ఇక్కడ వుండటం నీ అదృష్టం....... భాగ్ జావ్ యహా సే....... భాగో......" అంటూ ముందుకు నెట్టబోయి, మళ్ళీ ఏదో గుర్తుకు వచ్చినట్లు చటుక్కున మెడ పట్టుకున్నాడు.

ఊపిరి బిగపట్టి చూస్తున్నాడు హోటల్ గుమ్మంలో ఇతర కస్టమర్స్ మధ్య నిలబడిన బదిలీ భాయ్..... రంగరాజు చేతుల్లో నుంచి రాజూమియా కాళ్ళు చేతులతో తిన్నగా బయట పడగలడనే ఆశను వదిలేసుకున్నాడు.

"ఏమయింది బ్రదర్? మళ్ళీ ఏమొచ్చింది?" రాజూమియా మెడను పట్టుకున్న రంగరాజును ప్రశ్నించాడు ముఖేష్ ఆశ్చర్యంగా.

"అసలు సమస్య అలాగే వుంది దోస్త్..... నా జేబులో నుంచి కొట్టేసిన పర్సు బయటికి రానే లేదు......" అంటూ లాగిపెట్టి గుద్దాడు రంగరాజు రాజూమియా వెన్నుమీద.

బల్లిలా నేలను కౌగలించుకున్నాడు రాజూమియా.... అతని షర్టుక్రింద దాచి వుంచిన పర్సు కాస్తా చేపలా ఎగిరి రంగరాజూ పాదాల ముందు పడింది.

"మా పని అయిపోయింది దోస్త్.... ఇక మేము వెళ్ళి వస్తాం" అంటూ వెనుతిరిగాడు రంగరాజు.

ముఖేష్ వంక సాభిప్రాయంగా చూస్తూ అతన్ని అనుసరించారు మిగిలిన వారందరూ. ఎంత సడన్‌గా అక్కడ ప్రత్యక్షం అయ్యారో అదే మాదిరి టాక్సీ ఎక్కి వెళ్ళిపోయారు.

వాళ్ళు అటుపోగానే చటుక్కున లేచి, హోటల్ ప్రక్కనే వున్న సందులోకి పరుగు తీయబోయిన రాజూమియా చేతిని గట్టిగా పట్టుకున్నాడు ముఖేష్.

"అంత తొందర అనవసరం మై ఫ్రండ్..... ఎటువంటి స్వార్థము లేకుండా మేము నీకు హెల్ప్ చేయలేదు. నీతో పెద్ద పని వుంది. మర్యాదగా వచ్చి మాతో కూర్చోకపోతే పోలీసులకు అప్పచెప్పి వీపు విమానం మోత ఎక్కించేస్తాను." అంటూ హోటల్లోకి తీసుకు పోయి, బదిలీ భాయ్‌కి అప్పగించాడు.

# 5

" ....సర్దార్ అమానుల్లా ఆటలు కట్టించిన విధానాన్ని చూసి నువ్వేదో చాలా గొప్పవాడివనీ, ఎటువంటి చిక్కు సమస్యనయినా చిటికెలో పష్కరించగలవనీ అనుకున్నాం రాజూమియా......" అన్నది ట్వింకిల్.

చినుగులు పడి, మట్టి మరకలతో అసహ్యకరంగా అగుపిస్తున్న పాంటును, చెమట చారికలతో వికృతంగా వున్న షర్టును ధరించి వున్నాడు రాజూమియా వేషంలో వున్న షాడో.

టర్కిష్ అంబాసిడర్ తమ దేశం నుంచి తెప్పించిన ఫోటో ఆధారంగా షాడో అవతారాన్ని పూర్తిగా మార్చేశాడు సి. ఐ.బి. స్పెషల్ ఎఫెక్ట్స్ డిపార్ట్‌మెంట్‌కి హెడ్‌గా పని చేస్తున్న అరుణాచలం.

వత్తుగా ఎత్తుగా వుండే అతని రింగుల జుట్టును ఇష్టం వచ్చినట్లు కత్తిరించేసి సమ్మర్ క్రాఫ్‌గా మార్చేశాడు.

నెల రోజుల పాటు ఒక ప్రత్యేకమైన కెమికల్‌ని వాటర్‌తో కలిపి రోజుకు మూడుసార్లు స్నానం చేస్తే గాని శక్తి విహీనం కాని మెడిసిన్ ఒకటి అతని శరీరాన్ని చామన చాయకు మరి రెండాకులు తక్కువకు మార్చేసింది. ఎండలో విపరీతంగా తిరగటం వల్ల, శరీరం కమిలి నల్లగా మారినట్లు అగుపిస్తోంది ఇప్పుడు అతని కాంప్లెక్షన్.

బదిలీ భాయ్‌ని కలుసుకున్నప్పటి నుంచీ షేవ్ చేసుకోక పోవటం వల్ల గడ్డం పెరిగి కొంచెం అసహ్యకరంగానే వుంది గెటప్.

"నా గురించి మీరు ఏమనుకున్నా ఐ డోన్ట్ కేర్ మేడం..... అసలు నన్ను పిలిపించటానికి కారణం ఏమిటో చెపితే నా దారిన నేను పోతాను..... అవతల నాకు బోలెడు పనులున్నాయి....." దురద పెడుతున్న గడ్డాన్ని రుద్దుకుంటూ అన్నాడు షాడో ట్వింకిల్ మాటలకు సమాధానంగా.

అటువంటి రెక్‌లెస్ సమాధానాలు వినటానికి ట్వింకిల్ సిద్ధంగా వున్నా, తను మాత్రం తట్టుకోలేక పోయాడు ఆమె సహచరుడు అంజాద్.

"సువ్వర్ కీ బచ్చే...... మర్యాదగా ప్రశ్నవేస్తే మర్యాదగా సమాధానం యివ్వటం చేతకాదా నీకు?" అంటూ పిడికిలి బిగించి మీదికి దుమికాడు.

చటుక్కున చేయి జాచి అతన్ని అడ్డుకుంది ట్వింకిల్.

"టేకిట్ ఈజీ అంజాద్.... టేకిట్ ఈజీ..... మాటలు మునుపటి రాజూమియానే..... ప్రవర్తన కూడా అదే మాదిరిగా వుంది.... జేబు దొంగతనాలు చేసి దెబ్బలు తినటం ఒక్కటే నాకు అంతు బట్టటం లేదు..... లెటజ్ హావ్ సమ్ పేషన్స్....." అంటూ షాడో వైపు తిరిగింది.

ఆ పైన అతిగా బెట్టు చేయటం మంచిది కాదని గ్రహించి, చినుగుల పాంటులో నుంచి చిన్న ఉలిపిరి కాగితపు పొట్లాన్ని తీశాడు షాడో. కాగితపు పొరల్ని విప్పి వారి ముందు పెట్టాడు.

నడి నెత్తి మీద వున్న సూర్యుడి కిరణాలు పడి తళుక్కు తళుక్కున మెరవటం ప్రారంభించింది పొట్లంలోని వజ్రం ఒకటి. కనులు మిరుమిట్లు గొలిపే కాంతుల్ని వెలువరచసాగింది.

ఎంత తక్కువగా వెల కట్టినా హీనపక్షం ఐదు లక్షలకు పైనే విలువ చేసే ఆ డైమాండ్ ని చూసి ఊపిర్లు బిగపట్టారు ట్వింకిల్ అంజాద్.

" .....దీని కోసం జేబుదొంగ నాటకం ఆడాను..... షర్టు గొడవలో పడి దీనిని పోగొట్టుకున్న విషయాన్ని గమనించుకోలేదు వాళ్ళు....." కామ్‌గా చెప్పి ఆ వజ్రాన్ని పాంటు జేబులో దాచుకున్నాడు షాడో.

టర్కిష్ అంబాసిడర్ తెప్పించి ఇచ్చిన ఫోటో సహాయంతో అరుణాచలం దగ్గిర తన వేషాన్ని మార్చుకుంటున్న సమయంలో అతనికి తెలిసింది రామ్‌దయాళ్ సోదరులు ఢిల్లీ నగరములోనే వున్న వార్త. బిందును పంపి వారిని పిలిపించుకున్నాడు తన దగ్గిరికి. బదిలీ భాయ్ ముందు ఆడవలసిన నాటకాన్ని వారికి వివరించాడు.

"రాజూమియా వేషానికి మీరు చెప్పినంత గ్లామర్ వుండి వుంటే, మామూలు జేబుదొంగ మాదిరి బ్రతకటం చాలా పెద్ద అవమానం షాడో సాబ్......" అంటూ తన వద్ద వున్న వజ్రాన్ని యిచ్చాడు రంగరాజు.

"అవసరం అంటూ వస్తే దీన్ని బయట పెట్టండి..... దీనితో మాకు ఇప్పుడు పెద్ద పని కూడా ఏమీ లేదు....." అని కూడా అన్నాడు.

అతని అనుమానమే నిజం అయింది. ఆ వజ్రాన్ని బయట పెట్టటంతో చక్కగా రక్తి కట్టింది నాటకం.

"షహభాష్ రాజూమియా.... రియల్లీ యువ్వార్ ఎ వండ్రఫుల్ పర్సన్...... నీ శక్తియుక్తులమీద నాకున్న నమ్మకం వమ్ము కానందుకు ఎంతో సంతోషంగా

వుంది. నేను చెప్పినట్లు చేస్తే ఆ వజ్రానికి రెండు రెట్లు విలువైన బహుమతిని ఇప్పిస్తాను. వస్తావా??" అడిగింది ట్వింకిల్ ఆశ్చర్యాన్నించి తేరుకుంటూ.

రాజూమియా వేషం వేసినందుకు ఫలితం కనిపించబోతున్నదని గ్రహించి చెవులు రిక్కించాడు షాడో.

"బదిలీ భాయ్‌తో మన అవసరం తీరిపోయింది. అతని ఎకౌంట్‌ని ఫైనలైజ్ చేశేయ్ అంజాద్......." ఉన్నట్లుండి తన సహచరుడు అంజాద్ వైపు తిరుగుతూ అన్నది ట్వింకిల్.

ఎకౌంట్ సెటిల్ చేయటం అనే మాటకు వున్న అర్థాలన్నీ మనసులో గిర్రున తిరిగి చేదుగా తయారయింది షాడో నోరు.

"ఏరు దాటిన తరువాత తెప్పను తగుల బెట్టే పాకిస్థాన్ ఏజెంట్లతో పొత్తు కలపటం ప్రమాదమని ఎంత చెప్పినా వినిపించుకున్నావా? అనుభవించరా..... అనుభవించు.... నీకు కూడా ఆ బదిలీ భాయ్‌కి పట్టిన గతే పడుతుంది చూడు....." అని ఎత్తి పొడుస్తున్న అంతరాత్మ వ్యంగ్యపు మాటల్ని పెడ చెవిన పెడుతూ బదిలీ భాయ్ వైపు చూశాడతను.

బదిలీ భాయ్‌కి కూడా అతనికి వచ్చిన ఆలోచనలే వచ్చినట్లున్నాయి...... రక్తం లేనట్లు తెల్లగా పాలిపోయిన ముఖంలో ఒక పాదాన్ని వెనక్కి తిప్పి రెడీగా నిలబడ్డాడు – అవసరం అయితే పిక్కబలాన్ని చూపించటానికి వీలుగా.

అతని అంచనా , షాడో ఆలోచనా దారుణంగా తప్పి పోయాయి.

ట్వింకిల్ ఆదేశాల్ని వినగానే వెంట వున్న కాన్వాస్ బేగ్‌లో నుంచి నాలుగు పెద్ద పెద్ద నోట్ల కట్టల్ని బయటికి తీశాడు అంజాద్.

దగ్గిర దగ్గిరగా లక్షరూపాయలకు పైనే వున్న ఆ మొత్తాన్ని చూసేసరికి చింపి చేటంత అయింది బదిలీ భాయ్ ముఖం.

"నీ సహాయానికి చాలా థేంక్స్ మై ఫ్రెండ్..... ఈ విషయాన్ని ఇక్కడే మర్చిపోవటం చాలా మంచిదని ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదనే అనుకుంటున్నాను......" నోట్ల కట్టల్ని అతని చేతిలో పెడుతూ అన్నాడు అంజాద్.

ఆత్రంగా అందుకున్నాడు బదిలీ భాయ్ వాటిని..... ఆనందంగా చూశాడు షాడో వంక.

తన ఆలోచన దారుణంగా దెబ్బతిని పోయినందుకు బాధ పడలేదు షాడో. బదిలీ భాయ్‌కి వీడ్కోలు ఇవ్వటానికి చేతిని ఎత్తబోతుండగా కనిపించింది అతనికి, అక్కడికి రెండు వందల గజాల దూరంలో వున్న బండ రాళ్ళ మధ్య చిన్న కదలిక.

ఉలిక్కిపడి అటు కేసి తిరుగుతున్న అతనితో పాటు అటువైపు చూశాడు బదిలీభాయ్.

"అయ్యబాబోయ్.... ముంచుకు వచ్చేసింది ప్రమాదం..... పారిపొండి.... పారిపొండి......." అని అరుస్తూ ఎగిరి దూకాడు వెనక్కి.

ఆ మాటలు అతని నోటివెంట వెలువడుతుండగానే నిట్టనిలువుగా నేలమీద పడిపోయాడు షాడో. పాములా మోచేతుల మీద పాకుతూ దగ్గిర్లో వత్తుగా పెరిగి వున్న పెద్ద రెల్లు దుబ్బు చాటుకు వెళ్ళిపోయాడు.

చెవులు చిల్లలు పడే శబ్దంతో మ్రోగాయి నాలుగు రివాల్వర్లు. అంతవరకూ అతను నిలబడి వున్న ప్రదేశంలో దుమ్ముతెరలు రేపాయి వాటి బుల్లెట్లు.

చోటు కాని చోటులో తమను చంపటానికి ప్రయత్నిస్తున్నది ఎవరో వూహించటానికి ప్రయత్నిస్తూ తనకు తెలియకుండానే పాంటు బెల్టు వెనుక చేతిని పెట్టాడు షాడో......

ఏముందని అక్కడ చేతికి తగలటానికి ??

రాజూమియా వేషానికి, రివాల్వర్ పనికిరాదని చేతులు వూపుకుంటూ బయలు దేరి వచ్చాడు తను..... అందుకు తగిన ఫలితం అనుభవిస్తున్నాడు.

"పట్టుకోండి.... ఒక్కళ్ళను కూడా వదలకుండా అందరినీ పట్టుకోండి...... పారిపోవటానికి ప్రయత్నిస్తే కాల్చి చంపండి......" ఖంగు మంటున్న కంఠంతో ఆజ్ఞలు జారీ చేస్తూ ఒక బండరాయి వెనుక నుంచి లేచి నిలబడ్డాడు ఆజానుబాహుడు ఒకతను .

పెద్ద పెద్ద మెషిన్ గన్స్ పట్టుకొని అతని వెనుక నుంచి బండరాళ్ళ ఇవతలికి దూకారు అరడజను మంది దృఢకాయులు.

దాహం వేస్తున్నట్లు ఎండుకు పోయిన పెదవుల్ని నాలుకతో తడి చేసుకుంటూ ప్రక్కకు చూశాడు షాడో.

లోతుగా వున్న రెండు ఇసుక గుంటలలో తన దాచుకుని వున్నారు ట్వింకిల్ అంజాద్..... షాడో నిలుచున్న చోట దుమ్ము తెరలు రేపిన రివాల్వర్ బుల్లెట్లలో ఏదో తగిలింది కాబోలు. గాయపడిన ఎడమ పాదాన్ని ఒక చేత్తో, నోట్ల కట్టల్ని రెండో చేత్తో గట్టిగా పట్టుకొని గబగబా దేక్కుంటూ వారి దగ్గిరికి చేరుకుంటున్నాడు బదిలీ భాయ్.

నల్లటి రంగులో నిగనిగ మెరిసిపోతున్న రివాల్వర్లను బయటికి తీసి రెడీగా వున్నారు ట్వింకిల్ , అంజాద్.

వాటిని ఉపయోగించే అవకాశం వారికి లభించటం లేదు. మొదటగా ఫైరింగ్ ఓపెన్ చేసిన రివాల్వర్లు ఇంకా బండల వెనుకే వున్నాయి.... మిషన్ గన్స్ పట్టుకొని ముందుకు దూకిన తమ సహచరులను కవర్ చేస్తున్నాయి.

అంత వరకే చూశాడు షాడో. ఇక అక్కడే కాలక్షేపం చేయటం ఆరోగ్యానికి ఎంత మాత్రము మంచిది కాదని గ్రహించి, రెల్లు దుబ్బును వదిలి, వెనక్కి వెనక్కి జరగటం మొదలు పెట్టాడు.

పది గజాల దూరం జరగగానే వున్నట్లుండి ప్రత్యక్షం అయింది అతని వెనుక ఒక పెద్ద డిప్రెషన్.

యుద్ధ సమయాల్లో తలలు దాచుకోవటానికి సైనికులు తవ్వుకునే ట్రెంచి మాదిరిగా చాలా దూరం విస్తరించి వుంది.

దుమ్ము తెరలు లేవకుండా వుండటానికి విశ్వ ప్రయత్నం చేస్తూ అందులోకి దొర్లిన షాడో ముఖంలో ముఖం పెట్టి ముద్దు ముద్దుగా మ్యావ్ మని పలుకరించింది ఒక పిల్లి పిల్ల.

## 6

డిప్రెషన్ అవతలి నుంచి విన వస్తున్న రివాల్వర్ మ్రోతల్ని వింటూ చేతిని జాచి ఆ పిల్లి ముఖాన్ని తడిమాడు షాడో.

"ఐయామ్ వెరీ సారీ బేబీ..... నీతో కూర్చుని కబుర్లు చెప్పే తీరిక నాకు ఇప్పుడు లేదు.... అర్జంటుగా ఆ ప్రదేశాన్ని వెకేట్ చేయకపోతే నా దుమ్ము వదిలిపోతుంది......." అంటూ ప్రక్కకు తిరిగి మోకాళ్ళ మీద లేచాడు పిక్కబలం చూపించటానికి.

మడిచి పట్టుకున్న ఇనుప స్ప్రింగుల్లా కాళ్ళను ముడిచి అతని భుజం మీది నుంచి ఎగిరి ఎదుటికి దూకిందా పిల్లిపిల్ల.

తోకను నిఠారుగా ఎత్తి నోటిని ఇంత లావున తెరిచింది పెద్దగా అరవటానికి.

అదిరిపడి దాని నోటిని మూసేశాడు షాడో.

"అరవకు బేబీ నీకు దణ్ణం పెడతాను..... నా అవసరాన్ని నీకు విడమరిచి చెప్పినా వినిపించుకోకుండా అల్లరి పెట్టటం బాగోలేదు..... వదులు బేబీ దారి వదులు....." అంటూ దాని నడుముకు పట్టుకొని రఫ్‌గా వెనక్కి విసిరి ముందుకు పరిగెత్తాడు.

లావుపాటి క్రరతో నడుములు విరగగొట్టినట్లు కీసర బాసరగా అరుస్త అతని వెనుక పడిందా పిల్లిపిల్ల.

చెవులు మూసుకోవాలన్న కోరికను బలవంతంగా అణుచుకున్నాడు షాడో. గిరుక్కున వెనక్కి తిరిగి దాని నడుములు నిజంగానే విరగగొట్టాలన్నంత కోపాన్ని కూడా అదుముకుని సూటిగా ముందుకే పోయాడు.

పోయిన కొద్దీ పెద్దవి అవుతున్నాయి పిల్లి పిల్ల అరుపులు..... తన జాడల్ని ట్రేస్ చేయటానికి బండరాళ్ళ మధ్య ప్రత్యక్షం అయిన దృఢకాయులు పంపంకం చేసిన సైతాన్ కాదు కదా అది !!

తన ఆలోచనలకు తనే నవ్వుకోకుండా వుండలేకపోయాడు షాడో.

పుట్టి బుద్దెరిగిన తర్వాత మెత్తగా మాట్లాడే మనిషి ఎవరూ ఎదురుపడి వుండరు దానికి...... ఒక్కసారిగా కనపించిన తనని వదల్లేక అలా వెంట పడి వస్తోంది.......కొంచెం స్పీడ్‌గా పరిగెత్తితే అదే వెనుకబడిపోతుంది.

తన ఆలోచనల్లో తనుండి తను అనుసరిస్తున్న డిప్రెషన్ షార్పుగా పెద్ద మలుపు తిరగటాన్ని పట్టించుకోలేదు షాడో. యాదాలాపంగా టర్న్ కొట్టిన అతని దారికి అడ్డుగా కనిపించింది పెద్ద పుట్ట.

పడగల్ని మూడు మూరల ఎత్తుకు లేపి శివం ఎత్తినట్లు వూగిపోతున్నాయి నాలుగు ఎడారి తాచులు ఆ పుట్టమీద.

తన అడుగుల చప్పుడును పసికట్టినందువల్లే వాటికి అంత ఆవేశం వచ్చిందని గ్రహించి, ఎంత వేగంగా వచ్చాడో అంతకు రెట్టింపు వేగంతో వెనక్కి దూకాడతను.

కాటు పడితే క్షణాల మీద ప్రాణాల్ని హరించే విషం కలిగి వుంటాయి ఆ పాములు..... ఒకదాన్ని ఎలాగో తప్పించుకోవచ్చు...... యాకంగా నాలుగు పాములు వెంటపడితే నిలుస్తాయా తన ప్రాణాలు ??

తన మనస్సులో అడుగు పెట్టిన భయాన్ని పసికట్టి పుట్టమీది నుంచి జారటానికి సిద్ధపడుతున్న ఆ పాముల్ని చూడగానే ఛట్ మని అయిందతనికి జ్ఞానోదయం.

పిల్లి పిల్ల!

ఆ పుట్టను గురించి తనను హెచ్చరించటాని అలా వెన్నంటిందా జానెడు ఎత్తు కూడా లేని ఆ మూగ ప్రాణానికి అంత తెలివి వున్నదా ??

ఎందుకైనా మంచిదని బూటు ప్రక్కన బిగించి వున్నడాగర్ ని బయటికి లాగుతూ భుజం మీది నుంచి వెనక్కి చూసిన షాడో ముఖంలోకి చూస్తూ మరోసారి అరిచింది ఆ పిల్లపిల్ల..... తోకను క్రిందికి దించుతూ వెనక్కి జరిగింది.

"థేంక్యూ బేబీ...... థేంక్యూ వెరీమచ్..... పెద్ద తెలివితేటలున్న మొనగాడిలా పోజు పెట్టి నీ హెచ్చరికను త్రోసి పుచ్చాను..... ఐ యామ్ సారీ...." అంటూ వచ్చిన దారినే వెనక్కి పరుగు ప్రారంభించాడు షాడో.

అప్పటి వరకూ వినవచ్చిన రివాల్వర్ మ్రోతల ఆగిపోయాయి.....

ఏ క్షణంలో నయినా ఎవరో ఒకరు ఆ డిప్రెషన్ లోకి తొంగి చూడవచ్చు......

పళ్లు బిగపట్టి పరుగులు తీస్తున్న షాడో కంటె పది అడుగులు ముందుగా బయలుదేరిన పిల్లిపిల్ల..... మొట్ట మొదట అతన్ని చూసిన ప్రదేశాన్ని దాటి పది గజాల దూరం పోగానే చటుక్కున ప్రక్కకు తిరిగి మాయం అయిపోయింది.

ఏమరిపాటుగా వున్న షాడో అదిరిపడి ఆగిపోయాడు అక్కడ.... పిల్లి పిల్ల ఏమయిందని అనుకుంటుండగానే డిప్రెషన్ గోడ దగ్గిర వత్తుగా పెరిగి వున్న రెల్లు దుబ్బల చాటు నుంచి వినవచ్చిందా అరుపు......

ఆశ్చర్యంగా చూస్తూ ఆ దుబ్బలు మధ్యలోకి పోయిన షాడో కనుల ముందు ప్రత్యక్షం అయింది ఒక చిన్న సొరంగం.

ఇద్దరు మనుష్యులు పట్టే ఆ సొరంగ ద్వారంలో నిలుచుని తోకను వూపుతోంది పిల్లిపిల్ల.

"థేంక్స్ వన్స్ ఎగైన్ బేబీ..... నీకు చాలా చాలా ఋణపడి పోతున్నాను......" అంటూ రెండో ఆలోచన లేకుండా ఆ సొరంగంలోకి దూర ముడుచుకు కూర్చున్నాడు షాడో.

అదే సమయంలో మిషన్ గన్స్ పట్టుకొని డిప్రెషన్ లోకి దూకారు నలుగురు దృఢకాయులు.

"వెతకండి....... ఈ డిప్రెషన్‌కి అటూ ఇటూ పోయి గాలించండి...... ఎంతో దూరం పోయి వుండడు..... " డిప్రెషన్ పై నుంచి వినవచ్చింది అంతకు ముందు ఆజ్ఞాలు జారీ చేసిన కంఠం.

కుతూహలంగా ముందుకు తొంగి చూడబోయిన పిల్లిపిల్ల నడుమును పట్టుకొని వెనక్కి లాగేశాడు షాడో.

"కీప్ క్వయిట్ బేబీ..... కీప్ వెరీ వెరీ క్వయిట్... నన్ను పలకరించినట్లు వాళ్ళని కూడా పలకరించావంటే సర్వనాశనం అయిపోతాం." అంటూ కొంచెం ముందుకు జరిగి రెల్లు దుబ్బుల అవతలికి చూశాడు.

పాముల పుట్ట వైపు పోతున్నాడు ఒక దృఢకాయుడు. మిషన్ గన్‌ని రెడీగా పట్టుకొని షాడో దాగుని వున్న సొరంగం వైపు వస్తున్నాడు రెండో వ్యక్తి.

పాముల్ని చూసిన ఖంగారులో బలంగా అడుగులు వేశాడు షాడో...... కొట్టవచ్చినట్లు ఆగుపిస్తున్నాయి నేలమీది ఇసుకలో అతని పాద ముద్రలు అవి ఆ వ్యక్తి కంటపడటం అంటూ సంభవిస్తే.......

ఆ పైన ఆలోచించటానికి భయం వేసి ఊపిరి బిగపట్టాడు షాడో. అతను క్రిందికి చూడకూడదనీ, ముందుకే చూస్తూ సొరంగాన్ని దాటి వెళ్ళి పోవాలనీ గుర్తుకు వచ్చిన దేవతలనందర్నీ పేరు పేరునా తలుచుకున్నాడు.

వ్యర్థం అయ్యాయి అతని తలంపులు. ఉన్నట్లుండి క్రిందికి చూడనే చూశాడు ఆ వ్యక్తి. షార్పుగా ప్రక్కకు తిరిగిన అడుగు జాడలతో పాటు సొరంగం వైపు తిరిగాయి అతని చూపులు.

త్వరపడకపోతే ఆ తరువాత బాధపడుతూ కూర్చునే అవకాశం కూడా లభించదని గ్రహించి, తన ప్రక్కనే వదిగి వున్న పిల్లిపిల్లను ఎత్తి బయటికి విసిరేశాడు షాడో.

"మ్యావ్.... మ్యావ్....." అంటూ ఆనందంగా అరిచి అతన్ని పలుకరించిందా చిన్ని ప్రాణం. షాడో మాదిరిగా అతను కూడా తనను ముద్దు చేస్తాడని ఎదురు చూసింది.

అనుకోని విధంగా వచ్చి పడిన ఆ పిల్లి పిల్లను చూస కంగుతిన్నాడు ఆ దృఢకాయుడు. అడుగు జాడల్ని అన్వేషించటం మాని మిషన్ గన్‌ని దాని వైపు తిప్పాడు.

చేతిలోనే వున్న డాగర్‌ని అండర్ హేండ్ త్రోలో బలంగా ముందుకు విసిరాడు షాడో. విసురుతూనే తను కూడా బయటికి జంప్ చేసి పిల్లి పిల్లను అవతలికి నెట్టేశాడు.

ధనాధన్..... ధనాధన్ మని వికృత శబ్దం చేసింది మిషన్ గన్ రెండుసార్లు. వేగంగా బయటికి వచ్చి నేలలో దిగబడ్డాయి దాని బుల్లెట్లు.

అదే సమయంలో గింగిరాలు తిరుగుతూ పోయి అతని కంఠంతో దిగబడింది షాడో విసిరిన డాగర్.

చేతిలోని మిషన్ గన్ తనకు తెలియకుండానే జారిక్రింద పడిపోతుండగా వెర్రిగా అరవబోయాడు ఆ దృఢకాయుడు.

అరుపు బయటికి రాకముందే అనంత విశ్వంలో కలిసి పోయాయి అతని ప్రాణ వాయువులు.

తన మీదా, భయం భయంగా చూస్తున్న పిల్లి పిల్లమీదా పడబోయిన అతని శరీరాన్ని అవతలికి నెట్టి, కంఠంతో దిగబడిన డాగర్‌ని పైకి లాగేశాడు షాడో. మొనకు అంటిన రక్తాన్ని అతని దుస్తులకే తుడిచి, బూటు ప్రక్కన బిగించుకుంటూ, రెండో చేత్తో క్రిందపడిన మిషన్ గన్‌ని అందుకున్నాడు.

దాని గర్జన వినపడి గిరుక్కున వెనుతిరిగినట్లున్నాడు పాములపుట్ట వైపు పోతున్న దృఢకాయుడు, షాడోని గమనించి వెర్రిగా అరుస్తూ తన చేతిలోని ఆయుధాన్ని పైకి ఎత్తాడు.

చటుక్కున నేల మీదికి వంగాడు షాడో.

"మనుష్యులందరూ మంచివాళ్ళు కాదు బేబీ..... కనపడగానే కాల్చి చంపాల్సిన జాతి వాళ్ళు చాలా మంది వున్నారు మా మనుష్యుల్లో...... బాగా చూడు......" పిల్లిపిల్లతో అంటూ నొక్కాడు మిషన్ గన్ ట్రిగ్గర్‌ని.

పొగలు వెలువరిస్తూ పోయాయి బుల్లెట్లు. అవతలి దృఢకాయుడి చూపుడు వేలు ట్రిగ్గర్ మీద బిగుసుకోక ముందే బలి తీసుకున్నాయి అతని ప్రాణాల్ని.

ముందు వినబడిన మ్రోతలకు, ఆ మ్రోతలు కూడా తొడయ్యేసరికి, డిప్రెషన్ అంచు దగ్గిరికి పరిగెత్తుకు వచ్చేశారు మిగిలిన దృఢకాయులు అందరూ.

"ఏమయిందిరా? కనిపించాడా? పారిపోయిన బద్మాష్ ఖతం అయిపోయాడా?" అని అడుగుతూ డిప్రెషన్‌లో కనిపించిన దృశ్యాన్ని చూసి అదిరి పడ్డాడు వారి నాయకుడు.

"మైగాడ్! చంపండి..... ఆ దుర్మార్గుడిని చంపండి." అని కమాండ్ చేస్తూ గురి పెట్టబోయాడు తన రివాల్వర్‌ని.

నిర్దాక్షిణ్యంగా ఫైరింగ్ ఓపెన్ చేశాడు షాడో. నిర్మొహమాటంగా తూట్లు పడవేశాడు వారందరి శరీరాల్ని.

ఏం జరుగుతున్నదో అర్థం అయ్యేలోపుగానే ప్రాణాలు పోగొట్టుకున్నారు వారందరూ...... ఆఖరి వరుసలో వున్న ఒకే ఒక వ్యక్తి తప్ప.

బొమ్మలు దొర్లినట్లు డిప్రెషన్ లోకి దొర్లుతున్న తన సహచరుల శరీరాన్ని చూసి భయంతో వణికిపోతూ వెనుతిరిగాడతను. చేతిలోని రివాల్వర్‌ని అవతలికి విసిరేసి పాదాలకు బుద్ధి చెప్పాడు.

# 7

"వాట్! వాట్ నాన్సెన్స్ యువార్ టాకింగ్?? చనిపోయారా? మన వాళ్ళందరూ ఒక బద్మాష్ చేతిలో హతమారిపోయారా??" మట్టి కొట్టుకున్న దుస్తులతో ఎడారి పొదలు పట్టుకోవటం వల్ల రక్తసిక్తమైన శరీరంతో తన ముందుకు వచ్చి నిలబడిన దృఢకాయుడిని చూస్తూ ఆశ్చర్యంగా అన్నాడు గనీఖాన్.

ఎండుకు పోయిన పెదవుల్ని నాలుకతో తడి చేసుకుంటూ తల వూపాడు అతను..... తడబాటును అణుచుకోవటానికి విఫల ప్రయత్నం చేస్తూ డిప్రెషన్ దగ్గర జరిగినదంతా పూసగుచ్చినట్లు వివరించి చెప్పాడు.

విపరీతమైన ఆలోచనలతో ముడతలు పడింది గనీఖాన్ వదనం.

"ఆల్ రైట్..... ఇక నువ్వు పోయి విశ్రాంతి తీసుకో...... ఆ ఏజెంట్స్ సంగతి నేను చూసుకుంటాను......" అంటూ వెనుతిరిగి మరో పెద్ద గదిలోకి బయలుదేరాడు.

అదే సమయంలో పరుగులాంటి నడకతో అతన్ని సమీపించి వినయంగా వంగి సలాం చేసింది ఒక పరిచారిక.

"కల్నల్ షా ఆలం వస్తున్నారు సార్..... ముందు గదుల్లో కూర్చోబెట్టమంటారా?" లో గొంతుకతో అడిగింది.

షా ఆలం పేరు వినేసరికి మటుమాయం అయ్యాయి గనీఖాన్ ఆలోచనలు.

"కూర్చోబెట్టడం దేనికి డియర్? తీసుకురా.... ఇక్కడికి తీసుకురా....." అంటూ అక్కడే వున్న ఒక సోఫాలో కూర్చున్నాడు.

రెండు వందల కిలోల బరువుండే శరీరాన్ని అతి ప్రయత్నం మీద కదిలిస్తూ ఆ గదిలోకి వచ్చాడు కల్నల్ షా ఆలం...... సోఫాలో వున్న గనీఖాన్ నీ చూడగానే తేలికగా నిట్టూర్చి అతని ప్రక్కనే కూలబడ్డాడు.

కిర్రుమని శబ్దం చేసింది సోఫా..... నాలుగు అంగుళాలు క్రిందికి వంగింది.

ఎందుకైనా మంచిదని తను వెంటనే లేచి నిలబడ్డాడు గనీఖాన్.

పాకిస్థాన్ ఆర్మీలో పెద్ద పేరున్న ఆఫీసర్ ఆ షా ఆలం..... పాకిస్థాన్ అధ్యక్షుడికి చాలా బాగా కావాల్సిన వ్యక్తి.

ఆ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని, అతని స్థూల శరీరాన్ని గురించి ఎటువంటి కామెంట్లూ చేయకుండా మాట్లాడతారు అందరూ.... అతని పలుకులు తమకు వెగటు కలిగించినా ఆ విషయాన్ని బయట పెట్టకుండా చిరునవ్వులు ఒలికిస్తారు.

అదే పని చేశాడు ఇప్పుడు గనీఖాన్.

"కల్నల్ సాబ్ ఈ వేళప్పుడు వచ్చారేమిటి? తమరు ఇంత శ్రమపడి ఇక్కడికి రావాల్సిన అవసరం ఏమొచ్చింది??" చిరునవ్వుతో ప్రశ్నించాడు.

"పూనీ ఏరియాలో వున్న ఏడారిలో స్పెషల్ బ్రాంచి ఏజెంట్స్ మీద ఎవరో కాల్పులు జరిపారట...... స్పెషల్ బ్రాంచి అధికారులందరూ

కలవరపడుతున్నారు.... అది మనవాళ్ళు చేసిన పని కాదు గదా?" సూటిగా అసలు విషయంలోకి వచ్చేసాడు షా ఆలం.

"మీరు అనవసరంగా ఖంగారు పడకండి కల్నల్ సాబ్..... మన వాళ్ళు తెలివి తక్కువ రకం కాదు. తల్లక్రిందులుగా తపస్సు చేసినా మన జాడలు ఆ స్పెషల్ బ్రాంచి వాళ్ళకి తెలియవు......"

"స్పెషల్ బ్రాంచిని తక్కువగా అంచనా వేయద్దు గనీఖాన్...... ఆవలిస్తే ప్రేవులు లెక్క బెట్టగల మనిషి ఆ ట్వింకిల్...... మన గుట్టును రట్టు చేసే ఎంతో కాలంగా మనం వేసుకొంటూ వస్తున్న పథకాల్ని బూడిద పాలు చేయగలదు......"

"ఆల్‌రైట్ కల్నల్ సాబ్..... యువార్ సెంట్ పర్సంట్ కరెక్ట్..... ఆ ట్వింకిల్ మీరు అన్నట్లు నిజంగా, అసాధ్యురాలే – మన గుట్టు మట్లు తెలుసుకోవటానికి ఆమె ప్రయత్నిస్తోంది. అందుకే ఆమె మీద ఆమె సహచరుల మీద కాల్పులు జరిపారు మన వాళ్ళు. మన విషయాలు వాళ్ళకి ఎంత వరకూ తెలుసో గ్రహించేందకు ప్రాణాలతో పట్టుకోవటానికి కూడా ప్రయత్నించారు. కాని..... ఆఖరి క్షణంలో ఎవడో బద్మాష్ మూలకంగా తారుమారు అయ్యాయి అన్నీ......."

"మైగాడ్..... అనుమానం కలిగిందా? ట్వింకిల్‌కి మన మీద అనుమానం కలిగిందా?" విపరీతమైన ఆందోళనతో అంటూ సోఫాలో నుంచి చివ్వున లేవబోయాడు షా ఆలం. స్థూల శరీరం అందుకు సహకరించకపోవటంతో ఎక్కడి వాడు అక్కడే వుండిపోయాడు.

చిన్నగా నవ్వి అతని భుజం మీద చేయి వేశాడు గనీఖాన్.

"ట్వింకిల్‌కి కలిగింది వట్టి అనుమానం మాత్రమే కల్నల్ సాబ్..... మిగిలిన వివరాలు మీకు నాకు తప్ప మరెవరికీ తెలియవు. అయినా అవతలి శత్రువును తక్కువగా అంచనా వేయటం మంచిది కాదు..... ఇరవై నాలుగు గంటల్లో ఆమెను, ఆమెకు సహాయపడుతున్న వారిని ఖతం చేయించేస్తాను.... వారి చరిత్రలకు సమాధులు కట్టించేస్తాను...... " అంటూ కోటు జేబులో నుంచి విజిటింగ్ కార్డ్‌ని బయటికి తీశాడు.

"మన మిత్ర దేశమైన ఇరాన్‌లో పెద్ద గాంగెస్టర్ ఇతను...... పేరు పీటర్ ఆలీ...... తగినంత ధనం యిస్తే ఎంతటి వారినైనా ఎటువంటి వారినైనా చిటికెలో సఫా చేయిగల కర్కోటకుడు..... వెంటనే పిలిపిస్తాను ఇతన్ని...... మన చేతులకు మసి అంటకుండా, మన పేర్లు బయటికి రాకుండా మీ స్పెషల్ బ్రాంచి మనుష్యులను బొగ్గుల క్రింది మార్పిస్తాను......." అంటూ ఆ గదిలోనే ఒక మూలగా వున్న టెలీఫోన్ వైపు కదిలాడు.

అప్పుడు...... అప్పుడు గాని తేలిక పడలేదు షా ఆలం మనస్సు. తన పాంటు జేబులో నుంచి పిడికిలంత లావున్న సిగార్‌ని బయటికి తీసి వెలిగించుకుంటూ సర్దుకు కూర్చున్నాడు సోఫాలో.

కిర కిరమని ఇంకోసారి ప్రొటెస్ట్ చేసింది సోఫా...... మరో రెండు అంగుళాలు క్రిందికి వెలిగిపోయింది.

* * * * *

" .....అది రాజూమియా అసలు సంగతి........" అంటూ మాటల్నీ ఆపింది ట్వింకిల్ రెండూ క్షణాలపాటు.

"గనీఖాన్ అంటే గడగడ లాడతారు మా దేశస్థులు...... కోట్లకు పడగ ఎత్తిన మహామేధావి అతను...... దాదాపు రెండు మూడు వందల ఇండస్ట్రియల్ ఎస్టేట్స్ అతని ఆధీనంలో వున్నాయి..... దేశంలోని ట్రాన్స్‌పోర్ట్ కంపెనీలు చాలా వరకు అతనివే..... అటువంటి ధనవంతుడు. అంతటి పేరుగల పెద్ద మనిషి తనకున్న అంతస్థుతో తృప్తి చెందక కల్నల్ షా ఆలంని కలుపుకొని ఏదో పాడు ఆలోచన చేస్తున్నాడు..... అదేమిటో తెలుసుకోవాలి మనం...... " పూనీ ఏరియా ఎడారి నుంచి పాతిక మైళ్ళు ఇవతలికి వచ్చి, ఒక చిన్న పట్టణంలోని హోటల్లో విడిది చేస్తూ చెప్పిందామె.

"గనీఖాన్ వ్యాపారాల్లో వేళ్ళు పెట్టారు మా వాళ్లు..... అతని భవనంలో పనిమనుష్యుల క్రింద చేరారు..... ఏదో ఒక విధంగా అతని పథకాన్ని పసి కట్టాలని చూశారు...... అన్ని ప్రయాత్నాలు వృధా అయినాయి..... ప్రశ్నలు వేయటం మొదలు పెట్టీ పెట్టక ముందే ఖతం చేసేశాడు అతను వారందర్నీ..... శరీరాలు కూడా కనపడకుండా మాయం కావించాడు......." మెల్లిగా అందించాడు అంతవరకూ మౌనంగా వున్న అంజాద్.

"నా వుద్దేశ్యంలో పూనీ ఏరియా అవతల వున్న ఇండియన్ బోర్డర్‌ని దాటి పది పదిహేను గ్రామాల్ని ఆక్రమించుకోవటమే గనీఖాన్ లక్ష్యం అనిపిస్తోంది. ఆ గ్రామాల్లో తాగటానికి గుక్కెడు మంచినీళ్లు దొరకవు గాని, భూగర్భంలో అపారమైన పెట్రోల్ నిలువలున్నాయని ఒక వార్త విన్నాను....... " ఉన్నట్లుండి అందుకున్నాడు బదిలీ బాయ్.

ఎకౌంట్ సెటిల్ చేయటం జరిగినా, వారిని వదిలి పోలేదతను. వారితో పాటు ఆ హోటల్‌కి వచ్చేశాడు.

ఇండియన్ గ్రామాల్ని ఆక్రమించుకోవటమే గనీఖాన్ లక్ష్యం కావచ్చనే మాటను వినేసరికి చలిగాలి వీచినట్లు జలదరించింది షాడో శరీరం.

బదిలీ భాయ్ దృష్టిలో అవి పది పదిహేను గ్రామాలే కావచ్చు..... కాని వాటి మీదికి దండెత్తటం అంటే భారతదేశాన్ని కవ్వించటం వంటిదే..... తమ భూభాగాన్ని రక్షించుకునేందుకు యుద్ధాన్ని ప్రకటించక తప్పదు భారత సైన్యాలకు...... జన నష్టం ధన నష్టం – ప్రగతిపథంలో పురోగమనాన్ని వదిలి తిరోగమనం ప్రారంభించటం.......

ఎటూ తెగని ఆలోచనతో గిజాటుగా తల ఎత్తిన షాడో ముఖంలోకి చూసి చిరునవ్వు నవ్వింది ట్వింకిల్.

"భారతదేశంతో యుద్ధాన్ని కోరుకోవటం లేదు మన ప్రజలు..... వారి గ్రామల్లో పెట్రోలియం నిలువలు కాదు బంగారపు ముద్దలున్నా మనకు అవసరం లేదు..... కానీ షా ఆలం వంటి పిసినారి పక్షుల్ని రెచ్చగొడితే ఆ పని జరగటం మాత్రం ఖాయం...... అందుకే రాజూమియా నిన్ను పిలిపించింది...... ఏదో ఒకటి చేసి వారి పథకం ఏమిటో సవివరంగా తెలుసుకో గలిగితే ముందు జాగ్రత్తలు తీసుకోవచ్చు......" అన్నది.

అయినా సరే తెగలేదు షాడో ఆలోచన. సమ్మర్ క్రాఫ్ కొట్టిన తలను బరుక్కుంటూ పాంటు జేబులో నుంచి సిగరెట్‌ని బయటికి తీసి, మెల్లిగా తమ గది ముందున్న కారిడార్ లోకి పోయాడు.

"ప్రమాదం ముంచుకు వస్తే నీ కదలికలు అపూర్వమయిన వేగాన్ని కలిగి వుంటాయని ట్వింకిల్ మేడం చెపితే ముందు ఏమో అనుకున్నాను రాజూమియా...... ఆ మిషన్ గన్ గాంగ్‌ని మట్టి కరిపించిన విధానం అమోఘం..... అప్పుడు నిన్ను చూస్తుంటే అచ్చం ఆ ఇండియన్ ఏజెంట్ షాడోని చూసినట్లే అనిపించింది" అతనితో పాటు కారిడార్లోకి వస్తూ అన్నాడు బదిలీ భాయ్.

వీపు మీద ఎవరో లాగిపెట్టి గుద్దినట్లు ఉలిక్కిపడుతూ, తన భావాలు అతనికి కనిపించకుండా తలవంచుకున్నాడు షాడో పెదవుల చివర్ల వున్న సిగరెట్ వైపు జాపాడు.

అంత వరకూ కారిడార్లో వున్న ఒక చెక్క పెట్టె మీద పడుకుని కునుకు తీస్తోంది బేబీ.

బదిలీ భాయ్ పోజును చూసేసరికి, రెల్లు దుబ్బల దగ్గిర తన కేసి మిషన్ గన్‌ని గురి పెట్టిన దృఢకాయుడు గుర్తుకు వచ్చాడు దానికి.

షాడో తనకు చెప్పినట్లు బదిలీ భాయ్ కూడా కాల్చి చంపేయాల్సిన జాతికి చెందిన వాడేననుకొని, పెద్ద పులిలా ఎగిరింది అతని మీదికి.

అదిరిపడి వెనక్కి దూకాడు బదిలీ భాయ్.....

బేబీ పంజాలు అతని ముఖాన్ని సర్వనాశనం చేయకముందే చటుక్కున పట్టుకొని వెనక్కి లాగేశాడు షాడో.

"కీప్ క్వయిట్ బేబీ...... కీప్ క్వయిట్..... వద్దన్న కొద్దీ మా వెంట వచ్చి, ఎంత తోలినా అవతలికి పోకుండా ఇక్కడే మకాం పెట్టింది ఇందుకా? నువ్వు పులి

పిల్లవు కాదు బేబీ...... అఫ్టరాల్ ఒక ఎడారి పిల్లివి..... పిరికితనం నీ సహజ లక్షణం.... మైండ్ ఇట్....." మృదువుగా అంటూ దాన్ని తిరిగి చెక్కు పెట్టె మీదికి చేర్చాడు.

"ఇండియన్ ఏజెంట్ షాడోకి కూడా జంతువు లంటే విపరీతమైన అభిమానం. రక్తం తాగే పులులు కూడా అతని దగ్గిర పిల్లుల్లా ప్రవర్తిస్తాయని అందరూ అంటారు..... పిరికితనానికి పేరు పొందిన పిల్లులు నీ దగ్గిర పులుల మాదిరి బిహేవ్ చేస్తున్నాయంటే విచిత్రంగానే వుంది......." లైటర్‌ని పట్టుకొని ముందుకు వస్తూ ఇంకోసారి అన్నాడు బదిలీ భాయ్.

లాగి పెట్టి అతని నోటి మీద గుద్దాలనే కోరికను అతి ప్రయత్నం మీద అదుముకుంటూ సిగరెట్‌ని వెలిగించుకొని గోడకు చేరగిలబడ్డాడు షాడో.

బదిలీ భాయ్ అక్కడి నుంచి ఎంత తొందరగా అవతలికి పోతే అంత మంచిదని కోరుకోసాగింది అతని అంతరంగం.

తనకు ప్రమాదాల్ని తెచ్చిపెట్టే యాంగిల్స్‌లో ఆలోచన ప్రారంభించాడతను. ఇంకో రెండు మూడు ఇన్సిడెంట్స్ ఏవైనా జరగటం అంటూ సంభవిస్తే బయటపడిపోతుంది తన బండారం.

"నీ ఎకౌంట్ సెటిల్ అయిపోయింది కదా! ఇక నీ దారి నువ్వు చూసుకోక ఇక్కడే తచ్చట్లాడటం దేనికి?" అని అడగబోయి, అనవసరమైన అనుమానాల్ని రేకెత్తించటం అవుతుందేమోనని ఆగిపోయాడు షాడో.

అదే సమయంలో గది బయటికి వచ్చింది ట్వింకిల్.

"బదిలీ భాయ్ కూడా మన తోనే వుంటాడు రాజూమియా..... మన సంగతులన్నీ తెలిసిన తరువాత అతను వంటరిగా తిరగటం మంచిది కాదు......" షాడో మనసులోని భావాల్ని గమనించినట్లు చటుక్కున అనేసింది.

"వద్దు వద్దున్న కొద్దీ పెద్ద మొనగాడిలా వేషం వేసుకువచ్చావ్.... ఇవాళ కాకపోయినా రేపయినా నిన్ను గుర్తుపట్టేస్తాడు బదిలీ భాయ్...... నీ బ్రతుకు పాకిస్థాన్ జైళ్ళలోనో, ఫైరింగ్ స్క్వాడ్ ముందో తెల్లవారి పోవటం గారెంటీ..... అనుభవించరా..... అనుభవించు......." అని వెక్కిరించటం ప్రారంభించిన అంతరాత్మను నోరుమూయించటం చేతకాక చేతిలోని సిగరెట్‌ని క్రింద పడవేస్తూ హోటల్ బయటికి బయలు దేరాడు షాడో.

అతనితో పాటు కదలబోయిన బదిలీభాయ్‌ని కనులతోనే వారించింది ట్వింకిల్.

"మనం ఎదుర్కోవాల్సిన పరిస్థితుల్ని చెప్పిన దగ్గర్నించీ ఆలోచనలో పడ్డాడు రాజూమియా..... అతన్ని కొంచెం ప్రశాంతంగా వుండనీయటం చాలా అవసరం.......లెట్ హిమ్ గో......" అన్నది లోగొంతుకతో.

ఆ సమయంలో రాజూమియా పోజు తనకు ఇండియన్ ఏజెంట్ షాడో పోజును గుర్తుకు తెస్తోందని చెప్పబోయి , ఆగిపోయాడు బదిలీభాయ్.

షాడో పేరు వింటే మండిపడతారు పాకిస్థాన్ సీక్రెట్ సొసైటీ సభ్యులు. దానికి అనుభంధ సంస్థ అయిన స్పెషల్ బ్రాంచికి కూడా వున్నది అతని మీద విపరీతమైన కచ్చ...... సమయం కాని సమయంలో అతని పేరును వుచ్చరించి స్పెషల్ బ్రాంచి ఏజెంట్ అయిన ట్వింకిల్‌ని రెచ్చగొట్టం దేనికి ??

# 8

"ఎక్కడికి పోవాలి సార్ ?"

హోటల్లో నుంచి బయటికి వచ్చిన షాడోని వెంటనే అడిగాడు ఒక రిక్షావాలా.

"మనసంతా ఒకటే చికాకుగా వుంది బ్రదర్..... ఊరి బయటికి పోనీ..... ఎవరూ తిరగని ప్రదేశంలో కాస్సేపు వంటరిగా కూర్చుని వస్తాను......" అంటూ రిక్షా ఎక్కాడు షాడో.

విజిల్ వేస్తూ రిక్షాని కదిలించాడు డ్రయివర్. వేగంగా తొక్కుకుంటూ తీసుకుపోయి ఊరి బయట వున్న చిన్న నది వడ్డున ఆపాడు.

పాంటు జేబులో నుంచి ఒక కరెన్సీ నోటును తీసి అతనికి ఇస్తూ ముందుకు అడుగు వేశాడు షాడో.

నాలుగు అడుగులు కూడా వేయక ముందే అతన్ని ఆపాడు ఆ రిక్షావాలా.

"చీకటి పడక ముందే తిరిగి వచ్చేయండి సార్.... ఈ మధ్య ఇక్కడ చేతబడులు, మంత్ర ప్రయోగాలు చేసే వాళ్లు ఎక్కువగా తిరుగుతున్నారు..... ఊరంతా ఒకటే గోలగా వుంది. " అని హెచ్చరించి తన దారిన తనుపోయాడు.

అన్యమనస్కంగా ఆ మాటల్ని విన్నాడు షాడో. సిగరెట్ పాకెట్‌ని తీసి సిగరెట్ వెలిగించుకుంటూ నది వడ్డున అడుగులు వేశాడు.

చూస్తుండగానే గడిచి పోయింది సమయం..... పడమటి దిక్కుకు మరలిన సూర్యుడు మాయమై పోగానే నది మీదుగా బయలు దేరాయి చీకటి తెరలు....

మరో అరమైలు దూరం పోయి మెల్లిగా వెనక్కి తిరిగాడు షాడో.

" అదుగో..... అ డు గ డు గో దొంగనాయాలు..... చూస్తారేం కొట్టండి.... పళ్ళు వూడపోయేటట్లు కొట్టండి......" ఖంగుమంటూ వినవచ్చిందొక కంఠం.

అదిరిపడి ఈ లోకంలోకి వచ్చేశాడు షాడో. కనులు చిట్లిస్తూ చుట్టూ చూశాడు.

దట్టంగా ముసురుకుంటున్న చీకట్లను తమ చేతుల్లోని టార్చిలైట్లతో దూరంగా పారద్రోలుతూ పరుగు పరుగున అతని దగ్గిరికి వస్తున్నారు పాతిక మంద ఆగంతకులు.

టార్చిలైట్లు మాత్రమే కాదు...... పొడవాటి కర్రలు , సైకిల్ చైన్లు , తళ తళ మెరుస్తున్న గులకరాళ్ళు మొదలైన ఆయుధాలు చాలా వున్నాయి వారి వద్ద.

"ఏమిటిది? ఏమయింది మీకు? ఎందుకు నన్ను అటకాయిస్తున్నారు??" సమీపంలోకి వచ్చి నిలబడిన ఒక యువకుడిని చూస్తూ ఆశ్చర్యంగా అడిగాడు షాడో.

"మాకు ఏమీ కాకూడదనే నిన్ను ఆటకాయిస్తున్నాం బే...... పగలంతా మా వూళ్ళో తిరిగి, తిరిగి, చీకటి పడగానే శ్మశానాల్లోకి వస్తావా? మంత్ర ప్రయోగాలతో మా ప్రాణాలు తీయాలని చూస్తావా??" చేతిలోని కర్రను పైకి ఎత్తుతూ కర్కశంగా అన్నాడా యువకుడు.

అంతకు ముందు రిక్షావాలా చెప్పిన మాటలు అప్పుడు బుర్రకు ఎక్కి ఖంగారుగా క్రిందికి చూశాడు షాడో.

ఎగుడు దిగుడుగా వుంది నేల..... పెద్ద పెద్ద మట్టి దిబ్బలు దర్శనమిస్తున్నాయి ఎటు చూసినా.

తన ఆలోచనల్లో తనుండి ఏదో శ్మశానం మధ్యలోకి వచ్చినట్లు గ్రహించి ఖంగారును కప్పి పెట్టుకుంటూ చిరునవ్వు నవ్వాడు షాడో.

"చూడండి బ్రదర్స్..... మీరు పొరపడుతున్నారు..... నాకు మంత్రాలు రావటమనే మాట దేవుడెరుగు... అసలు మంత్రమనే మాటకే అర్థం తెలియదు..... చల్లగాలిలో షికారుకు వచ్చి యిక్కడ మీకు కనిపించాను...... అంతకన్నా ఇంకేం లేదు..... నా మాట నమ్మి నా దారిన నన్ను పోనీయండి....." మృదు స్వరంతో తెలియచేశాడు తన పరిస్థితిని.

తమను చూసి భయపడటమో, పారిపోవటమో చేస్తాడని అనుకున్న ఆ మనిషి అలా మృదు మధురంగా మాట్లాడే సరికి మెత్త బడ్డారు ఆ యువకులు.

"నిజమే అయి వుంటుందిరా.... నిజం కాకపోతే అంత చక్కగా ఎలా మాట్లాడగలడు? దుస్తులు మాసిపోయినా మంచివిగానే కనిపిస్తున్నాయి....... మంత్రగాడి దుస్తుల మాదిరిగా లేవు......"

తమలో తాము గుసగుసలు మొదలు పెట్టిన తన సహచరులతో అన్నాడు ఒక యువకుడు.

అంత తేలికగా వారి మధ్యలో నుంచి బయట పడగలనని వూహించిన షాడో గుండెల మీది నుంచి కొండంత బరువు దిగిపోయినట్లు నిట్టూరుస్తూ ప్రక్కకు తిరిగి బిగుసుకు పోయాడు శిలా విగ్రహంలా.

అతనికి తెలియకుండానే హోటల్లోనుంచి బయటికి వచ్చేసింది పిల్లిపిల్ల. అతనెక్కిన రిక్షా అనుసరించి నదీ తీరాన్ని చేరుకుంది .

చప్పుడు కాకుండా నడవటం దాని జాతి లక్షణం కావటంతో ఆ విషయాన్ని గమనించలేక పోయాడతను.

అతన్ని నిలవేసిన గుంపును చూసి భయంతో దూరంగా నిలబడి పోయిందది. అతను ప్రక్కకు తిరగగానే భయం తీరి కేరింతాలు కొడుతూ ముందుకు వచ్చేసింది.

చోటు గాని చోటులో కనబడినందుకే మంత్రవాది బిరుదు తగిలించి బుర్ర రామకీర్తన పాడించటానికి సిద్ధపడుతున్నది ఆ గుంపు...... ఇప్పుడు దాన్ని కూడా చూస్తే ఊరుకుంటుందా??

"గెట్ ఎవే యూ బ్లడీ ఇడియట్...... గెట్ ది హెల్ అవుటాఫ్ హియర్......" ఎవరికీ వినపడకుండా లోగొంతుకతో కమాండ్ చేస్తూ కాళ్ళ దగ్గిర వున్న ఒక గులకరాయిని దాని కేసి తన్నాడు షాడో.

సూటిగా పోయి ముక్కు మీద తగిలింది కాబోలు గుండెలు జలదరించేటట్లు గురక పెట్టిందా అమాయకజీవి. తోకను నిఠారుగా ఎత్తి ఎగిరి దూకింది అతని మీదికి.

అంతే !

ఎంతో నేర్పుగా నిరూపించుకున్న షాడో నిజాయితీని వెంటనే శంకించింది ఆ గుంపు

"పిల్లిని కూడా వెంట బెట్టుకు తిరుగుతున్న ఇతను మంత్రగాడు కాకపోవటం ఏమిటి? చూస్తారేం?? ఏదో ఒక ప్రయోగం చేసేలోగా తల పగలగొట్టండి......" ఆ ప్రదేశం దద్దరిల్లిపోయేలా అరుస్తూ చేతిలోని కర్రను పై కెత్తి ముందుకు దూకాడు ఒక యువకుడు.

తనకు తెలియకుండానే రియాక్ట్ అయినాడు షాడో. ఎడమ చేత్తో ఆ కర్రను అడ్డుకుంటూ లాగిపెట్టి గుద్దాడు అతని ముఖం మీద.

కళ్ళు బైర్లు క్రమ్మినంత పనికాగా గావుకేక ఒకటి పెట్టి నేలమీద చతికిల పడిపోయాడా యువకుడు.

"కొట్టండిరోయ్ కొట్టండి..... పళ్ళు రాలగొట్టండి....." అని కేకలు పెడుతూ షాడోని చుట్టూ ముట్టేశారు మిగిలిన వారందరూ.

జాగ్రత్తల నన్నిటినీ గాలికి వదిలేశాడు షాడో..... నేల కూలిన యువకుడి కర్రను చేతిలోకి తీసుకొని బొంగరంలా గిర్రున తిరగసాగాడు.

అతని కర్ర దెబ్బలకు అవయవాలు కమిలిపోతున్నా లెక్క చేయకుండా నిలబడ్డారు ఆ యువకులు.

ఉన్నట్లుండి క్రిందికి వంగి నేలబారుగా కర్రను విసిరాడు ఒక యువకుడు.

ఎగిరెగిరి దూకుతున్న షాడో ఎడమ పాదానికి తగిలింది దెబ్బ....... అప్రయత్నంగా ఆగింది అతని వేగం.....

అదే సమయంలో అతని తల మీద పడిందొక సైకిల్ చైన్..... చర్మాన్ని పగలగొట్టి నెత్తురును వెలువరించింది.

భరించరాని బాధతో గుండెలు జలదరించేటట్లు సింహనాదం చేశాడు షాడో. అంతవరకూ వాళ్ళు అమాయకులనీ, అటువంటి పోరాటాల్లో అనుభవం లేని వారని అనిపించి ప్రాణాలు తీసే దెబ్బల్ని డెలివర్ చేయటం లేదతని చేతులు.

ఆలస్యం చేస్తే ప్రాణాలు దక్కవని పూర్తిగా అనుభవమై రెచ్చిపోయాడతను. బాంబర్ విమానం ఎగురుతున్నట్లు శబ్దం చేయటం మొదలు పెట్టింది అతని చేతిలోని కర్ర. దెబ్బకు ఒకరు చొప్పున గావుకేకలు పెడుతూ వెనక్కి పారిపోవటం మొదలు పెట్టారా యువకుడు.

రెండు నిముషాలు కూడా గడవక ముందే నిర్మానుష్యమై పోయింది శ్మశానం....... ఆయుధాలన్నీ చేతులలో నుంచి జారిపోతుండగా దూరంగా పోయి చీకట్లలో కలసి పోయిందా గుంపు.

ఇంకెవరినైనా వెంటబెట్టుకు రాకముందే అక్కడి నుంచి తప్పుకోవటం మంచిదని గ్రహించి, చేతిలోని కర్రను అవతలికి విసిరేసి, ముందుకు అడుగు వేశాడు షాడో.

రెండు అడుగులు కూడా వేయకముందే గిర్రున తిరిగాయి కనులు....

క్రింద పడిపోకుండా వుండటానికి విశ్వప్రయత్నం చేస్తూ ఎడమ చేత్తో తలను తడుముకున్నాడతను.

తగిలింది ఒక దెబ్బే అయినా చాలా బలంగానే తగిలింది.......

తల మీది నుంచి ధారలు ధారలుగా కారుతోంది రక్తం..... షర్టునంతా తడిపేస్తుంది.

"వదిలిందా తిక్క? షికారు కావల్సి వచ్చిందా నీకు? గుర్తు పడితే ప్రాణాలు తీసే శత్రువులు నిండి వున్న ఈ దేశంలో చేతులు వూపుకుంటూ షికారుకు బయలు దేరతావా?" వ్యంగ్యంగా వెక్కిరించటం మొదలు పెట్టింది అతని అంతరాత్మ.

తడబడుతున్న అడుగులతో నది వద్దకు పోయి, తల మీది గాయాన్ని నీళ్ళతో శుభ్రం చేసుకున్నాడతను. పాంటు జేబులోని హేండ్ కర్చిఫ్‌ని తల చుట్టూ చుట్టుకొని వెను తిరగబోతుండగా కాళ్ళకు అడ్డం పడింది పిల్లిపిల్ల.

పట్టరాని కోపంతో విస్తరించాయి అతని నాశికాపుటాలు.

"నీ మూలకంగానే ఈ ఖర్మ పట్టింది..... నిశబ్దంగా వుండమని చెప్పినా అర్థం చేసుకోలేని నిన్ను వెంట బెట్టుకు తిరగటం నాదే బుద్ధి తక్కువ........" అంటూ దాని నడుమును పట్టుకొని, బలమంతా ఉపయోగించి విసరబోయాడు నదిలోకి.

మ్యావ్ మ్యావ్ మని అరుస్తూ కళ్ళు ఆర్పిందా పిల్లి పిల్ల. తోకను శరవేగంగా వూపుతూ అతని చేతుల్ని నాకింది.

మటుమాయం అయిపోయింది షాడో కోపం.

"డర్టీ రాస్కేల్.... చేసిందంతా చేసి ఇప్పుడు తోక ఆడిస్తున్నావా? నీకు బుద్ధి లేదు ." అంటూ క్రిందికి దించాడు.

సంతోషం పట్టలేనట్లు ఎగిరి గంతులు వేస్తూ గట్టు మీదికి ఎక్కింది పిల్లి పిల్ల. దాని వెనుకే అడుగులు వేశాడు షాడో. గుట్టు ఎక్కుతూ వుండగానే మరోసారి

అతన్ని ఆవరించుకుంది. కనులు తిరుగుతున్న సెన్సేషన్..... గుండెల నిండా వూపిరి పీల్చుకొని దాన్ని దూరం చేసుకోవటానికి ప్రయత్నించాడు.

ఫలించలేదు ఆ ప్రయత్నం గట్టు పూర్తిగా ఎక్కక ముందే తెలివి తప్పి బోర్లా పడిపోయాడు నది వడ్డున పెరిగి వున్న పొదల మధ్య.

## 9

పిల్లి తల, మనిషి శరీరం కల భయంకరాకారం ఒకటి తన గుండెల మీద కూర్చుని గొంతు పిసుకుతున్నట్లు కల వచ్చి చటుక్కున లేచి కూర్చున్నాడు షాడో.

అంత వరకూ అతని తల దగ్గర కూర్చుని ఏదో ఒక విధంగా మేల్కొలపటానికి ప్రయత్నిస్తున్న పిల్లి పిల్ల ఆనందంగా అరిచి రెండు పిల్లి మొగ్గలు వేసింది.

పలుగులు పెట్టి పొడుస్తున్నట్లు పోటెత్తి పోతున్న తలను తడుముకుంటూ చుట్టూ చూశాడు షాడో.

నది వడ్డున పొదల మధ్యే పడి వున్నాడు తను..... సీనరీలో మార్పు రాలేదు గాని టైమ్‌లో వచ్చింది.

బారెడు దూరం పైకి వచ్చి వున్నాడు ఆకాశంలో సూర్యుడు.....

స్పృహలేని స్థితిలో ఒక రాత్రంతా అక్కడే వుండి పోవటం జరిగిందని గ్రహించి చికాకుగా లేచి నిలబడ్డాడతను. నీరసంగా అడుగులు వేస్తూ గట్టు ఎక్కి వూళ్ళోకి బయలు దేరాడు.

పొలి మేరల్ని దాటి హోటల్ వైపు తిరుగుతుండగానే వచ్చిందతనికి అనుమానం...... జరుగకూడని దేదో జరిగిందన్న అనుభూతి అమాంతంగా వచ్చి ఆవరించుకుంది అతని అంతరంగాన్ని.

అడుగుల వేగాన్ని తగ్గించి, కనిపించిన ప్రతి సందుముందు రెండు రెండు నిముషాలు ఆగుతూ అరగంట తరువాత సమీపించాడతను హోటల్ వుండే మెయిన్ రోడ్డుని.

ఎంత మెయిన్ రోడ్డు అయినా ఎప్పుడో సాయంత్రపు వేళల్లో తప్ప జనసంచారం పెద్దగా కనిపించని ఆ ప్రదేశం అడుగు తీసి , అడుగు వేయటానికి కూడా వీలుకానంత రద్దీతో నిండి వుంది ఇప్పుడు.

తన మనస్సులోని అనుమానం మరింత పెరిగి పెద్దది అవుతుండగా వీధి ప్రక్కన ఖాళీగా కనిపించిన అరుగు నొకదాన్ని ఎక్కి హోటల్ వైపు చూశాడు.

రెండు అంతస్థుల భవనం ఆ హోటల్..... అందమైన కిటికీలతో చక్కటి దర్వాజాలతో ఆకర్షణీయంగా వుండేది.

ఆ కిటికీలు, దర్వాజాలు మాయం అయిపోయాయి. నునుపైన సిమెంట్ గోడలు కాస్తా ఇటుక రాళ్ళ గుట్టలుగా మారి కనిపిస్తున్నాయి.

"ఏమయింది భాయీ సాబ్? హోటల్‌కి ఏమయింది??" ప్రక్కనే వున్న పౌరుడిని ప్రశ్నించాడు వేగంగా కొట్టుకుంటున్న గుండెలతో.

"రాత్రి పన్నెండు గంటల ప్రాంతంలో పెద్ద ప్రేలుడు సంభవించింది..... పునాదులతో సహా పైకి లేచి పోయింది బిల్డింగ్.... ప్రాణనష్టం ఎంత జరిగిందో

అంచనా వేయటానికి రాత్రి నుంచీ ప్రయత్నిస్తున్నారు......" ప్రక్కకు చూడకుండానే చెప్పాడు ఆ పౌరుడు.

రాత్రి తనను ఆవరించుకున్న మైకపు తెరలు మళ్ళీ వచ్చి మీద పడుతున్నట్లు అరుగు వెనుక వున్న గోడను ఆనుకున్నాడు షాడో.

హోటల్ మీద బాంబింగ్ జరిగిందా ?

ఎవరి కోసం? తమ కోసమేనా??

అంతకు మించి ముందుకు జరుగలేదు అతని ఆలోచనలు. అదే సమయంలో అటుగా వచ్చి పోలీస్ సైరన్ మాదిరిగా అరిచాడు అంతకు ముందు రోజు సాయంత్రం అతన్ని నది వద్దుకు తీసుకుపోయిన రిక్షావాలా.

" అడుగో.... హోటల్లో మకాం వేసిన వారిలో ఒకతను ఇంకా బ్రతికే వున్నాడు.... హోటల్లో నుంచి బయటికి వచ్చి నా రిక్షా ఎక్కింది అతనే..... అతనే..... హోటల్ ప్రేలి పోతుందని తెలిసే నది వద్దుకు వెళ్ళి వుంటాడు......" అంటూ అందరినీ హెచ్చరించాడు.

గొల్లున అరిచారు గుంపులు గుంపులుగా నిలబడి వున్న పౌరులు.

"కొట్టండి.... బద్మాష్‌ని చావకొట్టండి.." అని కేకలు పెడుతూ షాడో వైపు తిరిగారు.

అదిరిపడి అరుగు మీది నుంచి దూకేశాడు షాడో. అక్కడే నిలబడితే ఆ తరువాత నిలబడటానికి కాళ్ళు, పని చేయటానికి చేతులు వుండవని గ్రహించి, అంతకు ముందు తను ఆగిన ఒక సందులోకి పరుగు దీశాడు.

ఆకాశం బ్రద్దలైపోయేలా అరుస్తూ అతన్ని వెంబడించారు పౌరులు.

శరీరంలో వున్న శక్తినంతా పాదాల్లోకి తెచ్చుకొని వింటి నుంచి వెలువడిన బాణంలా మళ్ళీ నది దగ్గిరికి వచ్చేశాడు షాడో. అటూ ఇటూ చూసి తల్లక్రిందులుగా దూకేశాడు నీళ్ళలోకి.

వాటర్ అంటే విపరీతమైన భయం కలుగుతున్నా లెక్క చేయకుండా తను కూడా అతనితో పాటు జంప్ చేసింది పిల్లి పిల్ల.

రాళ్ళు రప్పల్ని పట్టుకొని అరగంట సేపు ఆ వడ్డునంతా గాలించారు పౌరులు. అవతలి వడ్డుకు కూడా పోయి చూశారు.

నీటి మీదికి వాలి వున్న తుంగ పొదల్ని చాటు చేసుకొని దూకిన ప్రదేశంలోనే తల దాచుకున్నాడు షాడో.

అతనలా చేస్తాడని తెలియక నీటి వాలుకు వెళ్ళిపోయింది పౌర సమూహం. పది నిముషాలు తరువాత ఖాళీ అయింది ఆ ప్రదేశం .

నీటిలో తడవటం వల్ల గజ గజ వణుకుతున్న పిల్లి పిల్లను చంకలో పెట్టుకొని మెల్లిగా వడ్డుకు చేరుకున్నాడు షాడో. పాదాల్లో మిగిలి వున్న కొద్దిపాటి శక్తిని పూర్తిగా ఖర్చుపెట్టి ఆ పట్టణానికి దూరంగా వెళ్ళిపోయాడు.

## 10

" ......నీకు అసలు బుద్ధి లేదు.... బుద్ధి జ్ఞానం వున్న మనిషి ఎవడు తల మీద ఇంత పెద్ద దెబ్బ పెట్టుకుని నీళ్ళలో మునగడు....." షాడో తల మీది గాయాన్న స్పిరిట్ తో తుడిచి కట్టు కడుతూ తన అభిప్రాయాన్ని వివరించాడు అమ్జీ సిటీలోని ఒక డాక్టర్.

నదిలో దూకటం వల్ల తడిసి నిజంగానే బరువు చేసింది షాడో తల మీది గాయం. విపరీతమైన తలనొప్పి, కళ్ళు బైర్లు క్రమ్మటం మొదలైన లక్షణాలన్నీ ఎక్కువ అవుతున్నాయి వున్నకొద్దీ.

" ఆల్‌రైట్.... ఇప్పటి కయినా మించి పోయిందేమీ లేదు.... మంచి ఇంజక్షన్లు రెండు చేస్తాను..... డబ్బులు వున్నాయా ??" కట్టు కట్టటం పూర్తి చేసి వాష్ బేసిన్‌లో చేతులు కడుగుకుంటూ అడిగాడు డాక్టర్.

మౌనంగా తల వూపి, వళ్ళో కూర్చుని వున్న పిల్లి పిల్లను ప్రక్కన పెట్టాడు షాడో. పాంటు జేబులో నుంచి రెండు కరెన్సీ నోట్లను తీసి అతనికి అందించాడు.

ఒకే ఒక సిరంజితో చేయాల్సిన ఇంజక్షన్‌ని రెండు సిరంజిలలో ఎక్కించి అక్కడికేదో పవర్‌ఫుల్ మెడిసిన్స్ ఇస్తున్నట్లు పోజు పెట్టాడు డాక్టర్.

"ఒకే చేతికి చేస్తే తట్టుకోలేవు నెప్పిని.... రెండు చేతులకూ చేస్తాను..... కాస్త ఓర్చుకో......" అంటూ బలవంతంగా పట్టుకొని అంటపొడిచాడు.

కూర్చున్న చోటి నుంచి కదలకుండా తల తిప్పి ఆ గోల నంతా జాగ్రత్తగా పరికిస్తున్నది పిల్లిపిల్ల.... మొండి సూది తన కండరాల్లోకి ఎక్కటంతో బాధను భరించలేక నిజంగానే శాసలు విడుస్తున్న షాడోని చూసేసరికి ఆ డాక్టర్ కూడా తమను శత్రువేనేమో అనే అనుమానం కలిగి గుర్‌ర్ మని శబ్దం చేయబోయింది.

చటుక్కున చేతిని జాచి దాని నోటిని మూశాడు షాడో. ఆశ్చర్యంగా చూస్తున్న డాక్టర్ వైపు తిరిగి అపాలజిటిక్‌గా నవ్వాడు.

"పిల్లి పిల్ల బాగుంది.... నీ ఇంజక్షన్‌కి అయిన ఖర్చును తిరిగి యిచ్చేస్తాను . దాన్ని నాకు వదిలేస్తావా ??" ఉన్నట్లుండి అడిగాడు డాక్టర్.

తన చెవుల్ని తనే నమ్మలేక పోయాడు షాడో.

పిల్లి పిల్లను తన దగ్గిర్నుంచి తీసుకుంటాడా? నిజంగా అంత అదృష్టం తన జాతకంలో వ్రాసి పెట్టి వుందా??

ఆలస్యం అయితే మళ్ళీ అతను తన మనసును ఎక్కడ మార్చుకుంటాడోననే భయంతో పిల్లిపిల్ల నడుమును పట్టుకొని అతని చేతుల్లోకి నెట్టేశాడు. కోటు జేబులో నుంచి తను యిచ్చిన కరెన్సీ నోట్లను బయటికి తీయబోతున్న అతన్ని వారిస్తూ పరుగులాంటి నడకతో హాస్పిటల్ బయటికి బయలుదేరాడు.

లోపలి గుమ్మం దాటక ముందే వినవచ్చా అరుపులు. ముఖద్వారాన్ని దాటుతుండగా రాకెట్‌లా వచ్చి అతని దారికి అడ్డు నిలబడ్డాడు డాక్టర్.

అందమైన అతని కళ్ళజోడు మధ్యకు విరిగి వ్రేలాడుతోంది. నీట్‌గా కనిపించిన తెల్లటి షర్టు చినిగి పేలికలై పోయింది.

"ఇది పిల్లిపిల్ల కాదు..... బ్రహ్మరాక్షసి...... నీ దగ్గిర ఎక్కువ డబ్బులు వసూలు చేశాననే కక్షతో దీన్ని నాకు అంటకట్టావ్.... చూడు నా గతిని చూడు....." కన్నీళ్ళ పర్యంతం అవుతూ అన్నాడతను.

పంజాలను విప్పి అతని చేతుల్ని ముఖాన్ని కూడా అంటగీరినట్లుంది పిల్లి పిల్ల...... గవర్నమెంట్ తుమ్మల మీద పడినట్లు నెత్తురు ఓడుతున్నాయి గాయాలు.

అక్కడే నిలబడి వుంటే పోలీసుల్ని పిలిపించి తన మీద కేసు పెడాతడేమోననే అనుమానం కలిగి సానుభూతిగా తల వూపుతూ, వున్నట్లుండి

పరుగు అందుకున్నాడు షాడో. జరుగుతున్నదేమిటో డాక్టర్‌కి అర్థం అయ్యేసరికి ఆ వీధిని దాటి ఇంకో వీధిలోకి వెళ్ళిపోయాడు.

అరిచి కేకలు పెడుతూ అతన్ని వెంటాడబోయాడు డాక్టర్. కన్సల్టింగ్ రూమ్ కిటికీలో నుంచి ప్రహరీ గోడ మీదికి ఎక్కి, అక్కడి నుంచి రోడ్డు మీదికి వస్తూ అతనికి ఎదురు పడింది పిల్లి పిల్ల.

షాడోని వెంటాడే వుద్దేశ్యాన్ని అర్జంటుగా మార్చుకున్నాడు డాక్టర్. సీరియస్ కేసు ఏదో తన కోసం ఎదురు చూస్తున్నట్లు పోజు పెట్టి హాస్పిటల్ లోకి వెళ్ళిపోయాడు.

నోటిని ఇంత లావున తెరిచి ఒకసారి వళ్ళు దులుపుకుంది పిల్లి పిల్ల...... పరుగులాంటి నడకతో షాడో వెళ్లిన వైపు బయలుదేరింది.

* * * * *

మెయిన్ రోడ్డు చివర్లో వున్న ఒక టీ బంక్‌లో కూర్చుని చాయ్‌ని ఆర్డర్ యిచ్చాడు షాడో.

నీళ్ళలో తడిసి, చాయ్ మరకలతో అసహ్యకరంగా తయారయిన ఆ రోజు న్యూస్ పేపర్ని అడిగి తీసుకొని పేజీలు తిరగవేశాడు.

"జహోరీ పట్టణంలో జరిగిన బాంబింగ్ గురించి చూశావా భాయీ? నిజంగా చాలా దారుణం.... ఎంతమంది చనిపోయారో, ఎంత మంది ఆ రాళ్ళ గుట్టల క్రింద చిక్కు పడి వున్నారో ఇంతవరకూ తెలియనే లేదట......" చాయ్ గ్లాసును తెచ్చి అతని ముందు పెడుతూ కామెంట్ చేశాడు బంక్ ఓనర్.

నోరంతా వేపాకు నమిలినట్టు చేదుగా తయారై పేపర్ని అవతల పడవేశాడు షాడో.

"ఎందుకు ఆ బాంబింగ్ జరిగిందో తెలుసుకున్నారా భాయీ సాబ్? ఎవరు ఆ పని చేశారో కనిపెట్టారా?" చాయ్‌ని సిప్ చేస్తూ బంక్ ఓనర్నే అడిగాడు.

అటూ ఇటూ చూసి గొంతు తగ్గించాడతను.

"హోటల్లో ఎవరో గవర్నమెంట్ మనుష్యులు విడిది చేశారట..... వాళ్ళని చంపటానికి ఆ పని జరిగి వుండవచ్చని అనుకుంటున్నారు..... గమ్మత్తు ఏమిటంటే, ఇంకో పది నిముషాలకు హోటల్ పడిపోతుందనగా వాళ్ళు రోడ్డు మీదికి వచ్చారట..... బాంబింగ్ జరిగేసరికి ఆ చుట్టుపట్ల వుండకుండా మాటుమాయం అయిపోయార్ట........"

ఉన్న పళాన లేచి అతన్ని గట్టిగా కౌగలించుకొని గాలిలోకి ఎత్తాలన్న పిచ్చి కోరిక మనస్సును ఆవరించుకుంటుండగా, కుర్చీ వెనక్కి వాలిపోయాడు షాడో.

థేంక్ గాడ్ ! రియల్లీ థేంక్యూ వెరీమచ్ మై గాడ్!! ఇప్పుడే వస్తానని చెప్పి వీధిలో పడిన తన కోసం వెయిట్ చేసి చేసి, ఏమైపోయాడో తెలుసుకునేందుకు హోటల్‌ని వదిలి పెట్టి వుంటారు ట్వింకిల్ , అంజాద్.....

అలా బయటికి రావటమే వారి ప్రాణాల్ని కాపాడి వుంటుంది.....

శ్మశానంలో పిల్లి పిల్ల తనను మంత్రవాదిగా నిరూపించి తన్నులు తినిపించి వుండకపోతే కామ్‌గా హోటల్‌కి చేరుకొని వుండేవాడు.... అందరితో

పాటు తాము కూడా ఇటుక రాళ్ళ గుట్టల క్రింద సమాధి అయి పోయి వుండేవాళ్ళు.

పిల్లి పిల్ల మీద పెంచుకుంటున్న ఎలర్జీ కాస్తా మాయం అయిపోతుండగా, తల ఎత్తి పెద్దగా విజిల్ వేశాడు షాడో.

"ఏమిటి భాయీ? ఏమిటది??" ఆశ్చర్యంగా అడిగాడు బంక్ ఓనర్.

"నాకు బాగా కావాల్సిన ప్రాణ స్నేహితురాలు బయట నిలబడి వుంటుంది భాయీ సాబ్..... లోపలికి పిలుస్తున్నాను.....ఒక స్పెషల్ చాయ్ రెడీ చేయి......" అంటూ ఇంకోసారి విజిల్ వేశాడు.

స్నేహితురాలు అంటే ఎంత అందమైన మనిషో అనుకుంటూ గబగబా చాయ్ ని తయారు చేసి తీసుకు వచ్చాడు బంక్ ఓనర్.

షాడో వళ్ళో కూర్చుని అతని చేతుల్ని ముఖాన్ని నాకటానికి ప్రయత్నిస్తున్న పిల్లి పిల్లను చూసేసరికి వచ్చేసింది. అతనికి విపరీతమైన కోపం.

"భాగ్ జావ్ యహాఁ సే. పహలే ఇధర్ సే బాహర్ నికలో...." అనబోయి , ఆ పిల్లి పిల్ల తనవైపు కోరగా చూసేసరికి నోటిని మూసేసుకున్నాడు గట్టిగా.

మామూలు పిల్లుల వంటివి కావు పాకిస్తాన్ ఎడారి ప్రాంతాల్లో నివశించే పిల్లులు. కోపం వస్తే పెద్ద పులుల్లా మీద పడతాయి. మనిషి వాసన తగలని ప్రదేశాల్లో నివశించే ఆ దారుణ ప్రాణి తన కస్టమర్‌కి ఎక్కడ దొరికిందో వూహించటానికి ప్రయత్నిస్తూ స్పెషల్ చాయ్ కప్పును టేబిల్ మీద పెట్టేసి వెనక్కి తగ్గాడు.

తిండి తిప్పులు లేకుండా షాడోని అంటి పెట్టుకొని వుండటం వల్ల ఆకలితో నకనకలాడి పోతున్నాయి పిల్లి పిల్ల ప్రేగులు.

ఒక్క గంతులో టేబిల్ మీదికి ఎక్కి కప్పులోని చాయ్‌ని స్వాహా చేయటం మొదలు పెట్టింది.

"తీసుకురా భాయీ సాబ్.... నీ దగ్గిర వున్న మీగడ, వెన్న, పాలు అన్నీ తీసుకొచ్చి నా ఫ్రండ్ ముందు పెట్టు.... కడుపు నిండి ఇక వద్దని మీదికి ఎగబడేదాకా పెడుతూనే వుండు......" రెండు కరెన్సీ నోట్లను బంక్ ఓనర్ మీదికి విసురుతూ హెచ్చరించాడు షాడో.

తెచ్చిన పదార్థాలను తెచ్చినట్లే మాయం చేస్తున్న పిల్లి పిల్లను చూస్తూ తన ఆలోచనలలోకి జారిపోయాడు.

జహీరా పట్టణం నుంచి అమ్జీసిటీకి వెళ్ళాలని అన్నది ట్వింకిల్ తనతో. గనీ ఖాన్‌కి సంభంచిందించిన ట్రాన్స్‌పోర్టు కంపెనీలు. వాటి గోడవున్లు ఎన్నో ఆ సిటీలోనే వున్నాయట. నెలలో ఇరవై రోజులు అక్కడే వుంటాడట గనీఖాన్..... తన కోసం మహా వెతికితే ఇంకో రోజు జహీరా పట్టణంలో వెతుకుతుంది ట్వింకిల్.... ఆ తరువాత అమ్జీసిటీకి వచ్చి తీరుతుంది.... అంత వరకూ వెయిట్ చేయాలి తను..... ఎటువంటి గొడవల్ని నెత్తి మీదికి తెచ్చుకోకుండా బుద్ధిగా వుండాలి.....

కడుపు నిండింది కాబోలు బంక్ ఓనర్ తెచ్చి పెట్టిన మీగడ ప్లేటులో నుంచి తల ఎత్తి పిల్లి పిల్ల మ్యావ్ మని అరిచేసరికి తన ఆలోచనల్లో నుంచి బయట పడ్డాడు షాడో.

"చిల్లర వస్తుంది సార్.... మీక ఇంకా కొంచెం చిల్లర తిరిగి వస్తుంది......" అంటున్న బంక్ ఓనర్ మాటల్ని వినిపించుకోకుండా పిల్లి పిల్లను చంకలో ఇరికించుకొని రోడ్డు మీదికి వచ్చాడు.

అమ్జీసిటీ మధ్య భాగంలో వుంటుందిట హోటల్ మదీనా..... ఆ సిటీకి వచ్చిన పెద్ద పెద్దవాళ్ళు. డబ్బున్న టూరిస్టులు అందరూ అక్కడే మకాం వేస్తారట...... అక్కడికి పోయి ఆ చుట్టు పట్లే బిచాణా పరచాలి......

రోడ్డు వారగా తల వంచుకొని అడుగులు వేస్తున్న షాడో వున్నట్లుండి తన ముందు ఒక పోలీస్ ఆఫీసర్ ప్రత్యక్షం అవటంతో వులికిపాటును కప్పి పెట్టుకుంటూ ప్రశ్నార్ధకంగా చూశాడు.

"ఎక్కడికి పోతున్నావ్ మిస్టర్...... ఎటువైపు నీ ప్రయాణం??" చేతిలోని లాటీ కర్రను గిర్రున తిప్పుతూ ప్రశ్నించాడు పోలీస్ ఆఫీసర్.

"మదినా సార్..... హోటల్ మదీనా దగ్గిరికీ పోతున్నాను...... అక్కడ......" అంటూ, పోలీస్ ఆఫీసర్ ముఖం కఠినంగా మారటంతో మాటల్ని మ్రింగేశాడు షాడో.

"ఈ వూరికి కొత్త వాడివా?" ఠక్కున అడిగాడు ఆఫీసర్.

బిక్క ముగంతో తల వూపాడు షాడో.

"నీ లాంటి లఫూట్లు, అడుక్కు తినేవాళ్ళు మదీనా సమీపాల్లోకి వెళ్ళకూడదు..... నీ వంటి జిడ్డు ముఖాల్ని చూస్తే మన దేశమంతా నీ మాదిరిగానే జిడ్డు ఓడుతూ వుంటందని అపోహ పడతారు అక్కడే దిగే టూరిస్టులు...... వెళ్ళి

పో...... వెనక్కి తిరిగి ఇంకెక్కడికయినా వెళ్ళిపో......" ఖంగు మంటున్న కంఠంతో ఆర్డర్ యిచ్చి వెళ్ళిపోయాడు ఆ ఆఫీసర్.

చంకలో నుంచి జారి పోవటానికి సిద్ధం అవుతున్న పిల్లి పిల్లను గట్టిగా పట్టుకుంటూ పంక్చర్ పడిన తలను జాగ్రత్తగా బరుక్కున్నాడు షాడో.

ఆదిలోనే హంసపాదు పడింది తన ఆలోచనకి..... మదీనా చుట్టుపట్ల రెడీగా వుండకపోతే ట్వింకిల్‌ని కలుసుకోవటం ఎలా? అమ్జీ సిటీలో కూడా తాము కలుసుకోవటం కుదరకపోతే వచ్చిన పని మట్టి కొట్టుకు పోదూ??

ఎంత గట్టిగా పట్టుకున్నా ఆగకుండా పిల్లి పిల్ల క్రిందకి దూకేయటంతో ఈ లోకంలోకి వచ్చేశాడు షాడో.

"ఆగు..... ముందుకు పోయి కొంపలు ముంచకు...." అని పిలుస్తూ తిరిగి పట్టుకోవటానికి ప్రయత్నించాడు.

దొరకలేదది..... బాణంలా పోయి ఆ వీధి మధ్యలో వున్న చిన్న సందులోకి మరలింది. తను కూడా ఆ సందులోకి ఎంటర్ అయిన షాడో కనులకు కనిపించింది పిల్లి పిల్ల నోటికి చిక్కుకున్న ఒక లావుపాటి ఎలుక.

"ఛీ ఛీ యూ బ్లడీ ఇడియట్..... వెన్న, మీగడ, రెండు కప్పుల పాలతో పాటు స్పెషల్ టీ కూడా ఆరగించి అరగంట పూర్తిగా నిండలేదు... అప్పుడే ఆకలయిందా నీకు? నీ వెధవ పిల్లి బుద్ధి పోనిచ్చుకున్నావ్ కాదు......" అని విసుక్కుంటూ దాని నోట్లో నుంచి ఎలుకను వదిలించటానికి విశ్వ ప్రయత్నం చేశాడు షాడో.

వదిలినట్లే వదిలి మళ్ళీ పట్టుకుంటూ ఆటలు మొదలు పెట్టింది పిల్లి పిల్ల. అలా అలా అతన్ని ఆ సందు చివరి వరకూ తీసుకు పోయింది.

ముళ్ళ పొదలు, జిల్లెడు మొక్కలు పెరిగి వున్న ఆ సందు చివరి భాగంలో కనిపిస్తోంది పాడుబడి కూలిపోవటానికి సిద్ధంగా వున్న చిన్న మసీదు ఒకటి. అందులోకి అడుగు పెడుతూనే పిల్లి పిల్ల బిహేవియర్‌ని గురించి మరిచిపోయాడు షాడో.

"నువ్వు ఎలుక కోసం సందులోకి రావటం చాలా మంచిదయింది బేబీ...... థేంక్యూ వెరీమచ్..... ఈ చుట్టుపట్ల ఇంకేవైనా పందికొక్కులు కూడా వున్నాయేమో వెతుక్కో..... ఐ డోన్ట్ కేర్." అనుకుంటూ పడిపోతున్న ఒక గోడ మీదికి ఎక్కి ముందుకు చూశాడు.

మసీదుకు వంద అడుగుల దూరంలోనే వుంది ఒక పెద్ద వీధి. ఆ వీధి మధ్యలో రమ్యాతి రమ్యంగా అగుపిస్తోంది హోటల్ మదీనా.

## 11

వచ్చిన దారినే వెనక్కి మరలి అంతకు ముందు చాయ్ తాగిన హోటల్లో పది పెద్ద రొట్టెల్ని పాక్ చేయించాడు షాడో. హోటల్ ప్రక్కనే కనిపించిన ఫాన్సీ షాపులోకి పోయి మీడియమ్ సైజు వాటర్ కాన్ ని కూడా కొన్నాడు. దాని నిండా వాటర్ నింపుకొని పిల్లి పిల్లతో సహా పాడు పడిన మసీదులో కాపరం పెట్టాడు.

"ఉయ్ విల్ స్టే హియర్ బేబీ.... మన జిడ్డు ముఖాలను చూసి అసహ్యించుకునే పోలీసులు , టూరిస్టులు కంట పడకుండా ఇక్కడే వుండిపోదాం.

ట్వింకిల్ గాని, అంజాద్ గానీ ఈ పట్టణంలోకి వస్తే తప్పకుండా మదీనా లోనే బస చేస్తారు...... వాళ్ళు కంటపడేంత వరకూ వుయ్ విల్ స్టే హియర్....." చీకటి పడబోతున్న సమయంలో తన ప్రక్కకు చేరి ముఖంలోకి చూసిన పిల్లి పిల్లను చెపుతూ, నేలమీది చెత్తా చెదారాన్ని పాదాలతో అవతలికి నెట్టి పడక వేశాడు.

పది నిముషాల పాటు అతని దగ్గిరే కూర్చుంది పిల్లి పిల్ల. అతను పెదవి విప్పకపోవటంతో మసీదు చుట్టూ విహారానికి బయలు దేరిన ఎలుకల అంతు చూసే ప్రయత్నాల్లో బిజీ అయిపోయింది.

మర్నాడు ఉదయం ఆరు గంటలకల్లా నిద్రలేచాడు షాడో. వాటర్ కాన్ లోని నీటితో ముఖం కడుక్కొని రెండు రొట్టెల్ని ఆరగించాడు. కాన్ లోని వాటర్‌నే టీ కాఫీ మాదిరిగా భావించి పుచ్చుకున్నాడు. తన ప్రక్కకు వచ్చి యిక నిద్రపోవటానికి సిద్ధపడుతున్న పిల్లి పిల్లకు ఒక రొట్టెను యివ్వ చూశాడు గాని, రాత్రంతా ఎలుకల్ని పట్టుకొని విందు చేసుకొని ఉండటం వల్ల నిర్మొహమాటంగా తిరస్కరించి గట్టిగా కళ్ళు మూసుకుంది అది.

దాని మానాన దాన్ని వదిలి మళ్ళీ పడిపోవటానికి సిద్ధంగా వున్న పాత గోడమీద పీఠం వేశాడు షాడో.

తొమ్మిది... పది..... పన్నెండు గంటలు అయినా కనిపించలేదు అతనికి కావాల్సిన వారి జాడలు. పన్నెండు గంటలు దాటిన పది నిముషాలకు క్రిందికి వచ్చి మరో రెండు రొట్టెల్ని తిని కాసిని మంచినీళ్ళు తాగాడు. సిగరెట్ నొక దాన్ని వెలిగించుకుంటూ తిరిగి పాత గోడ వైపు తిరగబోతుండగా వున్నట్లుండి మసీదు ముందు ప్రత్యక్షం అయ్యాడు ఆ వ్యక్తి.

ఆరు అడుగుల ఎత్తు షాడో కంటె కొంచెం లావుగా దృఢంగా ఆగుపిస్తున్నాడు. నల్లటి శరీర ఛాయ..... నున్నగా షేవ్ చేసిన తల మీద ఎడారి ఉడుతల చర్మంతో చేయబడిన చిన్న టోపీ..... మెలి పెట్టి వుంచిన చిన్న మీసాలు, ఎర్రటి కనులు – పెద్ద పెద్ద అడుగులు వేస్తూ మసీదు మధ్యలోకి వచ్చి అక్కడ కూర్చుని వున్న షాడో వంక క్రూరంగా చూశాడు.

"ధర్మ ప్రభువులు చల్లగా వుండాలి.... తమ లాంటి వాళ్ళు రాకూడని గలీజ్ ప్రదేశం యిది....." తనది జిడ్డు ముఖమని గ్రహించి సలాం చేస్తూ అన్నాడు షాడో.

"నోరు మూసుకుని అవతలికి పో బే...... అధిక ప్రసంగం చేశావంటే నరికి పోగులు పెడతాను....." గర గరలాడుతున్న కంఠంతో హెచ్చరించి, అంత వరకూ షాడో ఉపయోగించిన పాత గోడ మీదికి ఎక్కాడా ఆగంతకుడు.

అధిక ప్రసంగం చేయకుండా నోటినైతే మూసుకున్నాడు గాని, తన మనస్సును మాత్రం కంట్రోల్ చేసుకోలేకపోయాడు షాడో.

ఎదురు పడటం అదే ప్రథమం అయినా, ఆ వ్యక్తిని ఎక్కడో చూసిన ఫీలింగ్ కలుగ సాగింది.

ఆ గొంతు, అవతలి వ్యక్తిని చులకన చేసి మాట్లాడే తీరు బాగా పరిచయం వున్నట్లే అనిపిస్తోంది.....

పది నిముషాలు పాటు గోడ మీదే కూర్చుని, వున్నట్లుండి క్రిందికి వచ్చాడు ఆ ఆగంతకుడు. తన భుజానికి వ్రేలాడుతున్న ఎయిర్ బేగ్‌ని క్రింద పెట్టి అందులో నుంచి మినీ బైనాక్యులర్స్ ని తీసుకుంటూ తిరిగి పైకి పోయాడు.

మదీనా ముందు భాగాన్ని, మసీదు కేసి వున్న కారిడార్లను, ఆఖరి అంతస్తు పై నుంచి కనిపిస్తున్న రూఫ్ గార్డెన్‌ని అతను బైనాక్యులర్స్ ద్వారా శ్రద్ధగా పరికిస్తూ వుండటాన్ని గమనించి నొసలు ముడివేశాడు షాడో.

అరగంట తరువాత మళ్ళీ క్రిందికి వచ్చాడా వ్యక్తి. బైనాక్యులర్స్‌ని ఎయిర్ బేగ్ లో పెడుతూ తల ఎత్తి షాడో వంక చూశాడు.

"ధర్మ ప్రభువులు ఎండలో చాలా కష్టపడుతున్నారు. నా వంటి లపూట్లను ఆ హోటల్ ముందుకు రానీయరు గాని, తమ వంటి గొప్పవాళ్ళకు అడ్డం ఏముంది? సూటిగా హోటల్లోకే పోయి చూడక, ఇలా దొంగదార్లు పట్టుకొని తిరగటం దేనికి??" నోరు వూరుకోక మెల్లిగా అన్నాడు షాడో.

ఎయిర్ బేగ్ జిప్‌ని లాగి క్లోజ్ చేస్తూ చివ్వున తల ఎత్తాడా వ్యక్తి.

"నోరు మూసుకోకపోతే నరికి పోగులు పెడతానని చెప్పానా?" ఎర్రటి కనులు మరింత ఎరుపు రంగుకు తిరుగుతుండగా అన్నాడు.

"చెప్పారు సార్.... నాకేమీ చెవుడు లేదు... దేంతో నరుకుతారో, ఎక్కడ పోగులు పెడతారో తెలుసుకుందామని మాత్రం మహా ఇదిగా వుంది" వెంటనే సమాధానం యిచ్చాడు షాడో.

చేతిలోని ఎయిర్ బేగ్‌ని ఎత్తి నేలకేసి బాదుతూ నేలను బలంగా తన్నాడు ఆ వ్యక్తి.

"దేంతో నరుకు తానో తెలుసుకోవాలని వుందా? చూపిస్తాను బే.... బాగా చూపిస్తాను.... " అని రంకె వేసినంత పని చేస్తూ, పాంటు వెనుక నుంచి బయటికి లాగాడు మూరెడు పొడుగున్న ఐరాన్ రాడ్‌ని.

వెంటనే..... వెంటనే గుర్తు పట్టాడు షాడో అతన్ని.

పీటర్ ఆలీ !

ఇరాన్ దేశాన్ని బేస్‌గా చేసుకొని హెరాయిన్, ఓపియమ్ మొదలైన మాదక ద్రవ్యాలను రవాణా చేసే గాంగెస్టర్ పీటర్ ఆలీ అతను !!

మూరెడు మాత్రమే పొడుగుండే ఐరాన్ రాడ్‌తో ఎంతమందినైనా ఎదిరించగల మహా మొండి ఘటం.... ఎటువంటి వారినైనా, ఎంతటి వారినైనా ఏదో ఒక విధంగా సర్వనాశనం చేయగల మాస్టర్ క్రిమినల్ పీటర్ ఆలీ !!!

ఒకసారి పారిస్‌లో వున్న ఇంటర్‌పోల్ హెడ్‌క్వార్టర్స్‌లో కూర్చుని మాదక ద్రవ్యాలను రవాణా చేసే గాంగ్‌స్టర్స్ వివరాలను చదివాడు తను..... ఆ ఫైలు మధ్యలో సవివరంగా వ్రాయబడి వుంది పీటర్ ఆలీని గురించి .... అతని మాట, నడక, చూపు మేనరిజమ్స్ మొత్త పాయింట్ అవుట్ చేయబడ్డాయి.

దారిన పోయే కట్టపాము తోకను తొక్కి అనవసరంగా తన మీదికి రప్పించుకోవటం జరిగిందేమోనన్న సంకోచం ఒక్కసారిగా మనస్సును ఆవరించుకుంటుండగా, చేతిలోని సిగరెట్‌ని అవతలికి విసిరేసి లేచి నిలబడ్డాడు షాడో.

"దొంగదారులు పట్టుకొని తిరుగుతున్నానా? లాగి పెట్టి తంతే లేచి నిలబడటం చేత కాని లఫూట్ ముఖానివి..... నన్ను ఒక దొంగ క్రింద జమ కట్టి చులకనగా మాట్లాడతావా??" పళ్ళు కొరుకుతూ వచ్చి అతని మీద కలబడ్డాడు పీటర్ ఆలీ. చేతిలోని ఐరానన్ రాడ్‌ని గిర్రున తిప్పి తల మీద మోదాడు.

తగిలి వుంటే రెండుగా విచ్చి వుండేది షాడో తల.

ఆఖరి క్షణంలో ఒక అడుగు ప్రక్కకు వేసి ఆ దెబ్బను తప్పించుకున్నాడతను.

ఉన్నట్లుండి కుడి పాదాన్ని ఎత్తి బలంగా డెలివర్ చేశాడు ఒక సైడ్ కిక్‌ని.

సూటిగా పోయి పీటర్ ఆలీ కుడిచేతికి కనెక్ట్ అయింది అతని పాదం. కరెంట్ షాక్ తగిలినట్లు అదిరిపడి, ఐరన్ రాడ్‌ని వదిలేశాడతను.

పాదం నేలకు ఆనటంతోటే ముందుకు ఎగిరి మరో కిక్‌ని డెలివర్ చేశాడు షాడో. అతని గుండెల మీద తన్నాడు.

విపరీతమైన ఆశ్చర్యంతో కనులు పెద్దవి అవుతుండగా వెనక్కి విరుచుకు పడిపోయాడు పీటర్ ఆలీ......

"కమాన్ బ్రదర్.... కమాన్..... నేల మీద వుండి నన్నేలా నరికి పోగులు పెడతావ్? లేచి నిలబడు....." రెండు అడుగులు ముందుకు వేస్తూ అతన్ని నీడిల్ చేశాడు షాడో.

పట్టరాని ఆగ్రహంతో వళ్ళు మరిచిపోయాడు పీటర్ ఆలీ...... నేలకు కొట్టిన రబ్బర్ బంతిలా లేచి నిలబడుతూ, చటుక్కున జేబులో చేయి పెట్టి బయటికి తీశాడు నల్లటి రివాల్వర్‌ని.

దాన్ని గురి పెట్టే అవకాశం అతనికి ఇవ్వలేదు షాడో...... సుడిగాలి కమ్ముకొన్నట్లు ఒక్కసారిగా పోయి అతన్ని చుట్టుకున్నాడు. చేతికి చేయి అడ్డం పెట్టి రివాల్వర్‌ని ఎగర కొట్టేశాడు... మోకాలి మీద బలంగా తన్ని క్రింద పడవేయాలని ప్రయత్నిస్తుండగా ప్రయోగించాడు పీటర్ ఆలీ తన వద్ద వున్న ఒక విచిత్రమైన ఆయుధాన్ని.

షాడో భుజం తగిలి దానంతట అదే బయటికి వచ్చింది అతని రిస్ట్ వాచిలో అమర్చి వున్న చిన్న సూది వంటి ఆయుధం.....

అది తన చర్మాన్ని తాకబోతున్న ఆఖరి క్షణంలో గమనించి ఖంగారుగా వెనక్కి దూకేశాడు షాడో.

వయొలెట్ కలర్‌లో వున్న ద్రవం ఏదో బొట్లు బొట్లుగా బయటికి వస్తోంది ఆ సూదిలో నుంచి.......

*సైనేడ్ మిక్స్ చేయబడిన ద్రావకాన్ని వెలువరిచే నీడిల్ ఒకటి వుంటుంది పీటర్ ఆలీ దగ్గర...... హేండ్ టూ హేండ్ కంబాట్‌లో అతన్ని ఎవరూ హతమార్చ లేకపోవటానికి గల కారణాల్లో అది ఒకటి.....*

ఇంటర్‌పోల్ ఫైల్లో చదివిన విషయాలు ఇంకోసారి కనుల ముందు మెదిలి చెమటలు పట్టేశాయి షాడో అరిచేతులు.

అతని ముఖంలో ప్రతిఫలించిన భావాల్ని గమనించి వికృతంగా నవ్వాడు పీటర్ ఆలీ.

"యువ్వార్ ఫినిష్డ్ యూ బ్లడీ రోగ్..... ఈ క్షణంలో చెల్లిపోయాయి భూమి మీది నీ నూకలు. నీ దేవుడు ఎవరో గట్టిగా ప్రార్థించుకో....." అంటూ ఎడమ చేతిని ప్రక్కకు వంచి ఎగిరి దూకాడు అతని మీదికి.

హడావుడిగా వెనక్కి తగ్గబోయి, హాయిగా పడుకుని నిద్రపోతున్న పిల్లి పిల్ల మీద కాలు వేశాడు షాడో.

చెవులు చిల్లులు పడేటట్లు అరుస్త ఎగిరి దూకిందది. ఎదురుగా కనిపించిన పీటర్ ఆలీ పాదాల మధ్య నుంచి అవతలికి పారిపోయింది.

షాడో కంటె రెండింతలు ఎక్కువగానే ఖంగారు పడ్డాడతను..... అప్రయత్నంగా క్రిందికి చూశాడు.

శరవేగంతో బాలెన్స్ సరి చేసుకున్నాడు షాడో. గుండెలు జలదరించే కుంగ్‌ఫూ షాట్‌ని వెలువరిస్తూ ఇంతెత్తున గాలిలోకి ఎగిరి, శరీరంలోని శక్తినంతా కుడి పాదంలోకి తెచ్చుకుంటూ కొట్టాడు తనకు అత్యంత ప్రీతిపాత్రమైన ఫ్లయింగ్ కిక్ ని.

పద్దెనిమిది అంగుళాల మందం గల ఇటుక రాతి గోడలను సైతం పగల గొట్టగల అత్యంత ప్రమాదకరమైన ఆ కిక్‌ని ఎబ్జార్స్ చేసుకొని తాగిన వాడు తూలినట్లు తూలాడు పీటర్ ఆలీ.

అటువంటి దెబ్బకు కూడా అతను పడిపోక పోతే తను ప్రమాదంలో చిక్కుకున్నట్లే లెక్క అని గ్రహించి ఇంకో తన్ను తన్నటానికి రెడీ అయినాడు షాడో.

రెండు అడుగులు వెనక్కి వేసి తల విదిలించాడు పీటర్ ఆలీ...... పిడికిళ్ళు బిగించి షాడో వైపు చూశాడు. చూస్తూ వుండగానే ముంచుకు వచ్చింది మైకం. బిగించిన పిడికిళ్ళు బిగించినట్లుండగానే చాప చుట్టలా నేల మీద పడిపోయాడు.

క్షణం కూడా ఆలస్యం చేయకుండా అతన్ని సమీపించి ఎడమ చేతికి వున్న రిస్ట్ వాచిని వూడతీసి, మసీదు బయట వున్న జిల్లేడు చెట్టులోకి విసిరేశాడు షాడో. నాలుగు అడుగుల దూరంలో కనిపించిన ఐరన్ రాడ్‌ని అతని మాదిరిగానే పాంటు వెనుక దాచుకుంటూ, రెండు అంగల్లో ఎయిర్ బేగ్‌ని సమీపించి ఓపెన్ చేశాడు.

ఖరీదయిన క్లాత్‌తో స్టిచ్ చేయబడిన దుస్తులు రెండు జతలున్నాయి అందులో. రివాల్వర్‌కి అమర్చేందుకు సైలన్సర్ వుంది. దాన్ని చూడగానే క్రింద పడిన రివాల్వర్ గుర్తుకు వచ్చి, దాన్ని కూడా తన దుస్తుల్లో భద్రపరుచుకుంటూ తిరిగి ఎయిర్ బేగ్‌ని చేతుల్లోకి తీసుకున్నాడు.

దుస్తుల క్రింద జాగ్రత్తగా పెట్టి వుంది పాస్‌పోర్టు...... పాకిస్తాన్‌లో టూరిస్ట్‌గా పర్యటించటానికి వీలుగా ప్రభుత్వం అనుమతించిన పర్మిషన్ కూడా పాస్‌పోర్టుతో జత పరచబడి వుంది.

వాటిని దాటి మరికొంచెం లోపలికి పోయిన షాడో చేతికి తగిలిందొక మందపాటి కాగితం.

పూర్తిగా బయటికి తీయకముందే అర్జంటుగా యివ్వబడిన కేబిల్ గ్రాం అని అర్థం చేసుకుంటూ , మడతలు విప్పి చూశాడు.

సరిగ్గా ఆ అఫ్జీ సిటీ నుండే ఇరాన్ దేశంలో వుండే పీటర్ ఆలీకి పంపబడింది ఆ కేబిల్ గ్రాం.

"నీతో అర్జంటుగా అవసరం వచ్చింది. హోటల్ మదీనాలో నీ పేరిట రూమ్ రిజర్వ్ చేయిస్తున్నాను. నా అనుచరులు వచ్చి నిన్ను కలుసుకునేదాకా గదిలో నుంచి బయటికి పోవద్దు – గనీఖాన్ "

కేబిల్ గ్రాంని మడత బెట్టి ఎయిర్ బేగ్ లోకి వెడుతూ సిగరెట్ వెలిగించుకున్నాడు షాడో.

కల్నల్ షా ఆలంతో కలిసి గనీఖాన్ చేస్తున్న దరిద్రపు ఆలోచనల్ని తెలుసుకోవటం తమకు అసాధ్యం కాగా, తనను పిలిపించింది ట్వింకిల్.

ఆమె కంటె రెండు ఆకులు ఎక్కువే చదివాడు గనీఖాన్. స్పెషల్ బ్రాంచి బాధను విరగడ చేసుకునేందుకు నర హంతకుడు పీటర్ ఆలీని ఇరాన్ నుంచి దిగుమతి చేశాడు.

ఆయాచితంగా లభించిన ఈ అవకాశాన్ని సద్వినియోగ పరుచుకొని పీటర్ ఆలీ మాదిరి యాక్ట్ చేస్తూ అతని ముందుకుపోతే ??

"మక్కెలు విరిగిపోతాయి..... నువ్వు పీటర్ ఆలీని కాదని మొదటి చూపులోనే కనిపెట్టేసి చర్మం వలిచి చెప్పులు కుట్టించుకుంటాడు గనీఖాన్. తెలివి తేటలు నీకు ఒక్కడికే వుంటాయని భ్రమపడకు." వెంటనే సమాధానం యిచ్చింది అంతరాత్మ.

నిజమే! గుట్టు బయటపడితే ప్రాణాలు పోగొట్టుకోవటమనే మాట సెంట్ పర్సెంట్ యదార్ధమే !!

ధైర్యం చేసి ముందుకు అడుగు వేయగలిగితే గనీఖాన్ వ్యవహారం ఏమిటో తేల్చుకోవటానికి సాటిలేని మేటి అవకాశం యిప్పుడు తన ముందుకు వచ్చింది. దీన్ని ఉపయోగించుకొని అటు తిరిగి ఇటు తిరిగి అతని దగ్గిరికి వచ్చి కూర్చుంది పిల్లి పిల్ల. కబుర్లు ఏవైనా చెపుతాడేమోనని కొద్దిసేపు అతని ముఖంలోకి చూసింది అతను తనను పలుకరించక పోయేసరికి వెల్లికిలా పడుకొని కాళ్ళను గాలిలోకి ఎత్తింది.

ఆ పోజును చూసేసరికి ఛట్ మని విడిపోయాయి షాడో మనస్సును ఆవరించుకొని వున్న సందేహాలు.

తను అడిగినంత డబ్బు యిస్తే ఎటువంటి దారుణ కృత్యాన్నయినా కనురెప్ప కూడా కదిలించకుండా చేసి పారేయగల సర్వ సమర్ధుడు పీటర్ ఆలీ. అయితే, అతని స్పెషాలిటీలను ఉపయోగించుకొన్న కస్టమర్స్ ఎవరూ అతన్ని చూడలేదనీ, మధ్యవర్తుల ద్వారా మాత్రమే బేరసారాలు జరిగాయనీ తెలియ చేస్తున్నాయి ఇంటర్‌పోల్ ఫైల్స్......

ఆ వివరాల ప్రకారం చూస్తే, గనీఖాన్ పేరు ప్రఖ్యాతుల్ని విని మొట్ట మొదటి సారిగా తన ప్రిన్సిపల్స్‌ని గాలికి వదిలేసి ముఖాముఖి మాట్లాడటానికి వచ్చాడనే అనుకోవాలి... తన అనుచరులు కంటాక్ట్ చేసేదాకా గది వదిలి బయటికి రావద్దని గనీఖాన్ అతనికి వ్రాయటంలోనని పరమార్థం అదే అయి వుంటుంది.

మొట్ట మొదటి సారిగా తన ముఖారవిందాన్ని నలుగురి మధ్యలోకి తీసుకు రావాల్సి వస్తున్నందుకు ముందు జాగ్రత్తగా హోటల్ మదీనాను బైనాక్యులర్స్ ద్వారా పరిశీలించాడు పీటర్ ఆలీ..... అక్కడి సెటప్‌ని అర్థం చేసుకోవటానికి ప్రయత్నించాడు.

చేతిలోని సిగరెట్ చివరికంటా కాలి వ్రేళ్ళను చురుక్కు మనిపించటంతో అవతలికి విసిరేశాడు షాడో.

మట్టి కొట్టుకొని వున్న తన షర్టును చించి బలమైన తాళ్ళను రెండింటిని తయారు చేశాడు. వాటితో అచేతనంగా పడివున్న పీటర్ ఆలీ కాళ్ళు చేతుల్ని కదలకుండా బంధించాడు.

"నిన్ను ఈ విధంగా అవమానిస్తున్నందుకు క్షమించు బ్రదర్..... నీకు తెలివి వచ్చేలోగా నా పని పూర్తి చేసుకుంటాను. అలా కాని పక్షంలో నిన్ను ఇక్కడ నుంచి మరో సురక్షితమైన ప్రదేశానికి పంపించే ఏర్పాట్లు చేస్తాను. అంతవరకూ నువ్వు దిక్కు మొక్కు లేని ఈ దరిద్రపు ప్రదేశంలో వుండాల్సిందే తప్పదు. అంటూ, షర్టుని చించి తాళ్ళు తయారు చేయగా మిగిలిన గుడ్డ పీలకలన్నిటినీ అతని నోటిలో కుక్కి మసీదు వెనుక భాగంలో దట్టంగా పెరిగి వున్న బొమ్మజెముడు కంపల మధ్య పడుకోబెట్టాడు.

వాటర్ కాన్‌లో మిగిలిన నోటితో తన ముఖాన్ని శుభ్రం చేసుకోవటం ఆ తరువాత అతను మొదలు పెట్టిన ప్రిపరేషన్స్‌లో మొదటిది.

ఎత్తుకు సంభందించినంత వరకూ పరఫెక్ట్ గానే మాచ్ అయ్యాయి ఎయిర్ బేగ్‌లో వున్న పీటర్ ఆలీ దుస్తులు. షాడో కంటె రెండు అంగుళాలు లావుగా వున్నందు వల్ల లూజ్ అయింది షర్టు. పట్టు వదిలితే మోకాళ్ళ మీదికి జారిపోసాగింది పాంటు.

దాన్ని గట్టిగా పట్టుకొని తన పాంటు బెల్టునే మరింత టైట్‌గా బిగించాడు షాడో. బురదతో నిండి వున్న తన బూట్లను నీట్‌గా తుడుచుకొని, ఎయిర్ బేగ్‌లో నుంచి పీటర్ ఆలీ పాస్‌పోర్టును తీసి పాంటు జేబులో పెట్టుకున్నాడు.

తన ఆయుధాల్ని అతను ఎక్కడెక్కడ భద్రపరుచుకున్నాడో అదే విధంగా అమర్చుకుంటూ ఎయిర్ బేగ్‌తో సహా రోడ్డు వైపు కదిలాడు.

ప్రత్యేకంగా మేకప్ వేసుకొని రూపాన్ని మార్చుకోకపోయినా, క్రొత్త రకమైన దుస్తుల్లో కొంచెం విచిత్రంగానే అగుపించాడు కాబోలు తలను అటూ యిట తిప్పుతూ మ్యావ్ మని అరిచింది పిల్లి పిల్ల. ప్రశ్నార్థకంగా చూసింది.

" కమాన్ డియర్.... వేషం వేసుకోగానే పూర్తి అవలేదు మన పని.... ఈ పాస్‌పోర్టుకు కూడా వేషం వేయించాలి.... అప్పుడు రెడీ అయినట్లు లెక్క రోట్లో తలకాయను పెట్టటానికి , కమాన్ ." అంటూ ముందుకు అడుగు వేశాడు.

అప్పటికీ తీరలేదు పిల్లి పిల్ల అనుమానం. రెండు నిముషాలు కూర్చున్న చోటి నుంచి కదల లేదది.

తన కోసం ఎదురు చూడకుండా అతను మెయిన్ రోడ్డు మీదికి పోయి మలుపు తిరుగుతూ వుండటం గమనించి , విధిలేక వెంబడించింది.

## 12

"పాస్ పోర్టు సైజు ఫోటోలు అందంగా తీయబడును..... అందంగా తీయటమే కాదు అరగంటలో డెలివరీ ఇవ్వబడును....."

పెద్ద అక్షరాలతో వ్రాయబడి వున్న బోర్డును చూసి ఒక ఫోటో స్టూడియోలోకి పోయాడు షాడో. బోర్డు మీద వ్రాయబడి వున్న రేటును ముందుగానే చెల్లించాడు.

జర్దా కిళ్ళీలు నమిలి నమిలి గారపట్టిన పళ్ళన్నీ కనబడేలా నవ్వుతూ లోపలికి తీసుకుపోయాడు స్టూడియో ఓనర్.

"బ్రహ్మాండమైన పర్సనాలిటీ సార్ మీది...... కళ్ళు చెదిరి పోయే ఫోటోజెనిక్ పేస్ .... బట్టలు కాస్త మంచి టైలర్ దగ్గిర కుట్టించుకుంటే అదిరి పోతారు " అంటూ కెమేరా వెనక్కి చేరాడు.

ఉలికిపాటును నేర్పుగా కప్పి పెట్టుకొని తన బట్టల వంక చూసుకున్నాడు షాడో. మొదటి చూపులోనే పట్టించేటట్లున్నాయి అవి. వాటిని మార్చుకోవటం ఏమంత కష్టం కాదు ...... ఏ రెడీమేడ్ షాపులోకి పోయినా, క్షణాల మీద తన లోటును పూడ్చుకోవచ్చు......కాని, ఇరాన్ దేశం నుంచి వస్తూ, పాకిస్తాన్‌లో తయారుకాబడిన దూస్తుల్ని ఎందుకు ధరించాల్సి వచ్చిందని ఎవరైనా అనుమానిస్తే ??

బట్టల మీది టైలర్ మార్కుల్ని గమనించి గోల చేస్తే ??

"పెళ్ళికొడుకులా మరీ తలను వంచుకోకండి సార్..... కొంచెం పైకి ఎత్తండి సార్...... కొంచెం పైకి" కెమేరా వెనుక నుంచి స్టూడియో ఓనర్ హెచ్చిరించే సరికి అంతం అయిపోయాయి షాడో ఆలోచనలు.

కనుబొమ్మల్లో నుంచి గుర్రుగా చూస్తున్నట్లు భయంకరమైన పోజు ఒకటి యిచ్చి ఫోటో దిగాడు.

"పని ఏమైనా వుంటే చూసుకురండి సార్.... రెడీ చేసి వుంచుతాను మీరు వచ్చేసరికి." షాడో ముఖం మీదికి ఫోకస్ చేసిన లైట్లను ఆఫ్ చేస్తూ అన్నాడు ఓనర్.

ఎయిర్ బేగ్‌ని భుజం మీద వేసుకొని బయటికి వచ్చాడు షాడో. ఆ వీధిలోనే వున్న ఫాన్సీ షాపులన్నీ తిరిగి మరికొన్ని ఐటమ్స్‌ని పర్చేజ్ చేశాడు. ఒక

మీడియమ్ సైజ్ హోటల్లో టీ తాగి తాపీగా తిరిగి వచ్చేసరికి, బోర్డు మీద పెయింట్ చేసుకున్న టైమ్ ప్రకారం సిద్ధం చేసి వుంచాడు స్టూడియో ఓనర్ ఫోటోల్ని.

"నా హేండ్ కర్చీఫ్‌ని ఇందాక లోపల మర్చిపోయి నట్లున్నాను, దయచేసి కాస్త చూస్తారా ?" వినయాతి వినయంగా అడిగాడు షాడో.

కౌంటర్ వెనుక నుంచి లేచి లోపలికి పోయాడు స్టూడియో ఓనర్.

శరవేగంతో కదిలాయి షాడో చేతులు. కౌంటర్ మీదే వుంది అతని ఫోటోలకు సంభందించిన నెగటివ్. బూటు ప్రక్కన బిగించి వున్న డాగర్‌ని తీసి నీట్‌గా చెక్కేశాడు దానిలోని ముఖాన్ని.

"లోపల లేదు సార్ మీ హేండ్ కర్చీఫ్ ..... ఇంకెక్కడయినా పడిపోయిందేమో చూసుకోండి. అంతా వెతికాను." అపాలిజిటిక్‌గా ముఖం పెడుతూ బయటికి వచ్చిన స్టూడియో ఓనర్ గమనించక ముందే డాగర్‌ని బూటు ప్రక్కకి పంపించేస్తూ చిరునవ్వు నవ్వాడు షాడో.

ఆ నవ్వును చూసే సరికి మరింతగా బలపడిపోయింది అంతకు ముందు నుంచీ స్టూడియో ఓనర్ మనస్సులో మెదులుతున్న ఆలోచన.

"లైఫ్ సైజ్ కాపీలు తీస్తాను సార్ మీ ఫోటోని..... స్టూడియో లోపలా బయటా ఫ్రేములు కట్టి అలంకరిస్తాను...... ఈ దెబ్బతో నాకు గిరాకీలు రెట్టింపు అయి తీరాలి " అనుకుంటూ షాడో యధాస్థానంలో పెట్టేసిన నెగిటివ్‌ని తీసుకొని డార్క్ రూమ్ లోకి పోయాడు.

రెండు కాపీలను ఎన్ లార్జ్ చేసిన తర్వాత గాని అర్థం కాలేదతనికి అసలు విషయం. ముఖం లేని ఫోటోల కోసం ఖరీదయిన పేపర్ని పాడుచేసుకున్నందుకు బాధపడుతూ బయటికి వచ్చి కూర్చున్నాడు.

* * * * *

"..... మన ఫోటోని ఎన్‌లార్జ్ చేసి ఎగ్జిబిషన్‌లో పెట్టినట్టు రోడ్డుమీద వ్రేలాడ కట్టాడనుకో. ఏమౌతుందో తెలుసా.....??" అమ్జీ సిటీ మధ్య భాగంలో వున్న ఒక పెద్ద పార్కులో కూర్చుంటూ తన వెనుక ప్రత్యక్షం అయిన పిల్లి పిల్లను ప్రశ్నించాడు షాడో.

చింపిరి దుస్తులు వదిలిన క్షణం నుంచీ అతని పర్సనాలిటీలో ఏదో మార్పును పసికట్టి యింకా విచిత్రంగానే చూస్తోందది.

"పాకిస్తాన్ సీక్రెట్ సొసైటీకి చెందిన టాప్ ఏజెంట్స్‌కి అందరికీ మన ముఖం ఎలా వుంటుందో తెలుసు..... ఖర్మకాలి వాళ్ళు ఎవరయినా ఆ ఫోటోల్ని చూశారనుకో...... నువ్వు నేను ఇక ఊచలు లెక్కబెట్టుకుంటూ గడపాల్సిందే ఈ పాకిస్థాన్ జైళ్ళలో...... రెండో మార్గం అంటూ లేదు." తమ స్టూడియోలో చేసొచ్చిన ఘనకార్యన్ని గురించి వివరంగా చెపుతూ, ఫాన్సీ షాపుల్లో ఖరీదు చేసుకొచ్చిన సరంజామాను నేలమీద పరిచాడు షాడో. పాంటు జేబులో వున్న పీటర్ ఆలీ పాస్ పోర్టును తీసి, అందులో అంటించి వున్న అతని ఫోటోని నేర్పుగా తొలగించాడు.

పాస్‌పోర్టులను సరి చేయటం అనేది గొప్ప ఆర్ట్..... అందులో పూర్తి ట్రయినింగ్ యివ్వబడింది అతనికి.

పట్టపగలు పార్కులో కూర్చున్న ఆ విచిత్రమైన పర్సనాలిటీని గురించి పటించుకోలేదు బయట రోడ్డు మీద తిరుగుతున్న పౌరులు ఎవరూ......

పరాయి దేశం నుంచి టూరిస్ట్ మాదిరిగా వచ్చి, దారి తెలియక అలా కూర్చుండి పోయాడేమోనే వుద్దేశ్యంతో అరగంట తరువాత అతన్ని సమీపించాడు ఒక పోలీస్ కానిస్టేబిల్.

అప్పటికే తన పని పూర్తి చేసుకొని, పాస్ పోర్టును ఎడ్జస్టు చేసే సరంజామానంతా ఒక పొద క్రింద పాతి పెట్టేశాడు షాడో.

"ట్రబుల్ ఏం లేదు బ్రదర్... ఇక్కడి సీనరీ బ్రహ్మాండంగా వుంది. కాస్సేపు ఎంజాయ్ చేద్దామని ఆగాను.... అంతే.... " ఎంక్వయిరీకి వచ్చిన కానిస్టేబిల్‌తో అంటూ మెల్లిగా లేచి ఎయిర్ బేగ్‌ని భుజం మీద వేసుకుంటూ పార్కు బయటికి వచ్చాడు.

* * * * *

" రండి సార్..... రండి.... రండి.... మీ పేరున గనీఖాన్ సాబ్ రూమ్‌ని రిజర్వ్ చేయించిన క్షణం నుంచీ మీకు మా సేవలు అందించటానికి సిద్ధంగా వున్నాం......." హోటల్ మదీనా ముందు..... టాక్సీని దిగి రిసెప్షన్ కౌంటర్ దగ్గిరికి వచ్చి తన పేరును ఎనౌన్స్ చేసిన మరుక్షణం ప్రారంభించాడు రిసెప్షనిస్టు తన పాటను.

"స్టాపిట్ స్టాఫ్ ది నాన్సెన్స్....." ఖంగు మంటున్న కంఠంతో కసురుకున్నాడు షాడో. "నేను ఎవరినో ఎందుకు వచ్చానో మీ దేశం అంతా

వినబడేటట్లు అరవటం కంటె వేరే పని లేదా?? " పాడు బడిన మసీదులో పీటర్ ఆలీ తన వంక చూసిన విధానాన్ని గుర్తుకు తెచ్చుకుంటూ కోరగా చూశాడు.

చిన్న బోయింది రిసెప్షనిస్టు ముఖం. తల వంచుకొని అతను అందించిన పాస్‌పోర్టును తీసుకొని భద్రపరిచాడు.

తను అవతలికి పోయిన మరుక్షణం అతను దాన్ని నిశితంగా పరిశీలిస్తాడని ఏ మాత్రం అనుమానం కలిగినా సరాసరి ఘనీఖాన్‌కి రిపోర్టు చేస్తాడని షాడోకి తెలుసు.

అటువంటి పరిస్థితి ఎదురు కాకూడదని దేవతల నందర్నీ ప్రార్థిస్తూ కను చివరల నుంచి రిసెప్షన్ హాల్లో వున్న కస్టమర్స్ నందర్నీ చూశాడు.

గోడలకు ఆనించి వేయబడిన మెత్తటి కుషన్ సోఫాల్లో కూర్చుని తమ యావలో తామున్నారు పాతిక మంది టూరిస్టులు.

వారందరికీ కొంచెం ఇవతలగా కూర్చుని వుంది ఒక అందమైన యువతి. తన సోఫా దగ్గిర వున్న టీపాయ్ మీది నుంచి ఒక మాగజైన్‌ని తీసి ముఖానికి అడ్డు పెట్టుకుంటోంది.

"మీ రూమ్ నెంబర్ త్రీ టూ సెవెన్ సార్...... ఎయిర్ బేగ్‌ని హోటల్ బాయ్‌కి యిస్తే......" రూమ్ తాళం చెవిని కౌంటర్ మీద పెడుతూ అంటున్న రిసెప్షనిస్టు మాటల్ని వినిపించుకోకుండా ఠీవిగా అడుగులు వేస్తూ ఆ యువతి దగ్గిరికి పోయాడు షాడో.

"హల్లో నేను పీటర్ ఆలీ అని పిలువబడే ఇరాన్ దేశస్థుడిని...... మీ పేరేమిటో తెలుసుకోవచ్చా??" సోఫా ముందు నిలబడుతూ అడిగాడు.

ఎంత ప్రయత్నించినా ఉలికిపాటును కప్పిపెట్టుకోవటం చేతకాలేదు ఆమెకు.

"నా.... నా పేరు ఆస్మా..... ఐయామ్ ఫ్రమ్ బంగ్లాదేశ్..... " తడబాటును దాచుకోవటానికి విఫల ప్రయత్నం చేస్తూ అన్నది.

"వెరీ గ్లాడ్ టూ మీట్ యూ మిస్ ఆస్మా...... మీ దేశంలో మాగజైన్స్ తల్లక్రిందులుగా పట్టుకొని చదవటం సాంప్రదాయమా? సరిగ్గా పట్టుకొని చదివితే మీకు అర్థం కాదా??" సూటిగా అన్నాడు షాడో.

కరెంట్ షాక్ కొట్టినట్లు అదిరిపడి తన చేతిలోని మాగజైన్ వంక చూసుకుంది ఆస్మా.

నథింగ్ యీజ్ రాంగ్ దేర్...... సరిగ్గానే పట్టుకొని వున్నదామె తన చేతుల్లోని మాగజైన్‌ని.......

మాటల గారడీతో అతను తనను బోల్తా కొట్టించి నందుకు ఆగ్రహించకుండా గలగలా నవ్వేసిందామె.

"వెరీ ఫన్నీ మిస్టర్ పీటర్ ఆలీ.... మీరు చాలా గమ్మత్తుగా మాట్లాడతారు." అన్నది.

"నన్ను పీటర్ ఆలీ అని కొందరు. గమ్మత్తు ఆలీ అని మరి కొందరూ పిలుస్త వుంటారు మిస్ ఆస్మా...... ఎప్పుడూ ఏదో ఒక గమ్మత్తు చేస్తూ ఉండక పోతే నాకు నిద్ర పట్టనే పట్టదు. బైది బై ఈ రోజు సాయంత్రం సరదాగా సినిమాకో షికారుకో పోదామని వుంది. కంపెనీ ఇస్తారా?" వెనుకా ముందూ చూసుకోకుండా ప్రపోజ్ చేశాడు షాడో.

"గమ్మత్తుగా మాట్లాడటమే కాదు.... మీకు ధైర్యం కూడా చాలా ఎక్కువగా వుంది..... ముక్కు ముగం తెలియని అమ్మాయిని వంటరిగా సినిమాకో షికారుకో రమ్మనటం విచిత్రంగా వుంది....." విశాలమైన కాటుక కనుల్ని గుండ్రంగా తిప్పుతూ అన్నదామె.

"ధైర్యపు ఆలీ నా మూడో పేరు..... ఇంకా చాలా పేర్లున్నాయి గాని వాటిని ఇప్పుడు చెప్పటం బాగోదు..... వాటెబౌట్ మై ప్రపోజల్ ....." ఎయిర్ బేగ్‌ని గిరగిరా తిప్పి ఇంకో భుజం మీదికి మార్చుకుంటూ అడిగాడు షాడో.

"ఓకే మై ఫ్రండ్...... సాయంత్రం ఆరుగంటలకల్లా నేను ఇక్కడికి వస్తాను..... బీ రెడీ...." యాక్సెప్ట్ చేసింది ఆస్మా...... సోఫా మీద పెట్టిన తన హేండ్ బేగ్‌ని తీసుకొని బయటికి వెళ్ళిపోయింది.

తన చేతుల్లోని ఎయిర్ బేగ్‌ని తీసుకి వివిధ రకాలుగా ప్రయత్నిస్తున్న హోటల్ బాయ్ ప్రయత్నాలన్నిటినీ విఫలం చేస్తూ అతని వెనుకే తనకు ఎలాట్ చేయబడిన గదిలోకి పోయాడు షాడో.

సినిమా సెట్టింగ్ మాదిరి కనులు చెదిరిపోయేటంత అందంగా అలంకరించబడి వుంది ఆ గది.

హంసతూలికా తల్పాన్ని మరిపించే ముచ్చటైన ఫోమ్ బెడ్‌ని చూడగానే ముంచుకు రావటం మొదలు పెట్టింది అతనికి నిద్ర.

"పడుకోరా.... నీకు అలవాటే గదా..... ముందున్న పనులన్నిటిని మరిచిపోయి నదుల గట్లమీదా, పాడుపడిన మసీదుల మధ్యా పడుకుని గురకలు తీయటం కొత్త ఏమీ కాదుగా...." అంత వరకూ మౌనంగా వున్న అంతరాత్మ

వెక్కిరించటంతో నిద్రను దూరంగా పారద్రోలి, గదిలో ఒక ప్రక్కగా అమర్చి వున్న మినీ బార్‌లో నుంచి రమ్ సీసాను ఒకదాన్ని తీసుకొని ఒక సోఫాలో కూర్చున్నాడు.

బాటిల్ సగం ఖాళీ అవుతుండగా, గణ గణమని మ్రోతలు చేసింది ప్రక్కనే వున్న టెలిఫోన్.

"ఎవరు? ఎవరు నా ఏకాంతాన్ని నాశనం చేసేది? పేరు చెప్పండి " పళ్లు కొరుకుతూ మాట్లాడటం కొత్తగా ప్రాక్టీస్ చేస్తూ రిసీవర్ పగిలిపోయేటట్లు అరిచాడు.

"గుడ్ ఈవెనింగ్ మైడియర్ పీటర్ ఆలీ...... నేను గనీ ఖాన్‌ని మాట్లాడుతున్నాను " మెత్తగా వినవచ్చింది అవతలి నుంచి.

ఉక్కిరి బిక్కిరి అయినంత పని కాగా తల మీద అరచేత్తో చరుచుకోబోయి, అక్కడ వున్న గాయం సంగతి గుర్తుకు వచ్చి నుదురు చరుచుకున్నాడు షాడో.

తను ఊహించినట్లే గనీఖాన్‌కి ఉప్పు అందించాడు హోటల్ రిసెప్షనిస్టు. ఏ విధమైన ఉప్పో మరో క్షణంలో తేలిపోతుంది.

తలకు ఎక్కనా వద్దా అంటున్న రమ్ మత్తును దూరంగా వుంచటానికి ట్రై చేస్తూ చిన్నగా నవ్వాడు షాడో. తన రాకను గురించి అంత త్వరగా తెలుసుకోగలిగిన గనీఖాన్ ఎలర్ట్‌నెస్‌ని మెచ్చుకున్నాడు అందమైన మాటలతో.

"ఇటీజ్ ఆల్ రైట్ మై ఫ్రెండ్ నిన్ను రమ్మని ఆహ్వానించిన తరువాత నీ రాకపోకల్ని గమనించ లేకపోవటం అంటూ జరుగదు. ప్రయాణంలో బాగా అలసిపోయి ఇరిటేషన్ మూడ్‌లో వున్నావని తెలిసింది. సో... టేక్ కంప్లీట్ రెస్ట్ ఫర్

టుడే.... రేపు ఉదయం పది గంటలకు నా అసిస్టెంట్ శాంబో నిన్ను కలుస్తాడు. గుడ్ ఈవెనింగ్......" అంటూ సమాధానం కోసం ఎదురు చూడకుండా లైన్ ని డిస్కనక్ట్ చేశాడు గనీఖాన్.

తన ఇరిటేటివ్ మూడ్ని గురించి కూడా రిపోర్టు అందించిన హోటల్ రిసెప్షనిస్టు, ఆస్మాతో తన ప్రవర్తనను గురించి చెప్పాడో లేదో వూహించటానికి ట్రై చేశాడు షాడో.

అంత వరకూ అణిగి మణిగి వున్న రమ్ నిషా ఒక్కసారిగా పైకి ఎగతన్నే సరికి జంబుల్ అయిపోయాయి అతని థాట్స్.

"హెల్ విత్ ఎవ్రీ బడీ... ఐ విల్ డూ వాటెవర్ ఐ కాన్ట్.... ఎందుకు ఏమిటనే ప్రశ్నలు వేస్తే ముక్కులు పగలగొడతాను. అంతే!" పీటర్ ఆలీ మాదిరి అనుకుంటూ బాటిల్లో మిగిలి వున్న రమ్ని కూడా ఫినిష్ చేసి, ఆ సాయంత్రం ఆస్మాతో ఎరేంజి చేసుకున్న ప్రోగ్రాంకి రెడీ అవటానికి లేచి నిలబడ్డాడు.

## 13

"బయటికి కనిపించినంత అందమైనది కాదు ఈ అబ్జీ సిటీ. రాత్రి పది గంటలు దాటిన తర్వాత రోడ్ల వెంట తిరగటం ప్రమాదం....." షాడో చేతిని గట్టిగా పట్టుకుంటూ అన్నది ఆస్మా.

సాయంత్రం ఆరుగంటలకు ఆమెతో బయలు దేరిన తర్వాత ఎనిమిది నైట్ క్లబ్బుల్ని సందర్శించాడు షాడో. ఎనిమిది రెళ్ళ పదహారు పెగ్గుల రమ్ని సేవించాడు.

"ఈ పీటర్ ఆలీకి ఇంకో పేరు మొండి శిఖండి ఆలీ.... ఎటువంటి ప్రమాదకరమైన పరిస్థితులలో నయినా నిర్భయంగా సంచరించటమే నాకు ఆనందం...... " అంటూ తూలి పడబోయి తమాయించుకున్నాడు షాడో అతి కష్టం మీద.

చటుక్కున అతని భుజాన్ని పట్టుకొని పడిపోకుండా ఆపటానికి ప్రయత్నిస్తూ ప్రక్కకు తిరిగింది ఆస్మా.

తాగిన ఆల్కహాల్ అంతా తలకు పట్టి నిజంగానే స్పృహ కోల్పోయే పరిస్థితిలో గనుక వుండి వుంటే గమనించి వుండేవాడు కాదు షాడో ఆమె చర్యల్ని.

ప్రక్కకు తిరిగినట్లే తిరిగి కుడి చేతి వేళ్ళను వి ఆకారంలో పైకి ఎత్తి అటూ ఇటూ వూపింది ఆమె.

"ఇక మనం ఇక్కడ వుండటం అనవసరం. హోటల్‌కి వెళ్ళిపోదాం పద...." విపరీతమైన చనువుతో ఏకవచనాన్ని ఉపయోగిస్తూ టాక్సీని పిలువబోయింది.

అంతకు ముందు ఆమె చేసిన సైగకు దూరంలో వున్న ఒక టాక్సీ కదలటాన్ని గమనించాడు షాడో. అందులో ఎక్కి కూర్చుంటే ఏం జరుగుతుందో అర్థం అయిపోయిందతనికి.

"నాన్సెన్స్ డియర్ .... ఇంత చక్కటి రాత్రిని అవమానించినట్లే అవుతుంది టాక్సీ ఎక్కితే.... నడిచే పోదాం....." అంటూ ఆమె నడుము చుట్టూ చేయి చుట్టి ముందుకు అడుగు వేశాడు.

విధిలేనట్లు అనుసరించింది ఆస్మా.... తన చేతుల్ని కూడా అతని నడుము చుట్టూ చుట్టింది.

వంద గజాల దూరం వెళ్ళారు యిద్దరూ.... ఒక చిన్న పార్కును సమీపించారు.

అంత వరకూ దూర దూరంగా అనుసరించి వస్తూన్న టాక్సీ ఒక్కసారిగా స్పీడ్‌ని పికప్ చేసి మ్రోతలు చేసుకుంటూ వచ్చి వారి ప్రక్కన ఆగింది. అందులో నుంచి క్రిందికి దూకుతున్న నలుగురు దృఢకాయుల్ని చూడగానే పళ్ళు కొరుకుతూ ఆస్మాని అవతలికి నెట్టాడు షాడో.

వదల లేదు ఆస్మా...... విపరీతమైన భయం కలిగినట్లు అతని నడుమును మరింత గట్టిగా పట్టుకొని వ్రేలాడబడింది.

తను హోటల్ మదీనాలో ఎంటర్ అయిన క్షణం నుంచీ ఆమె కళ్ళు తన మీదనే వుండటానికి కారణం ససాక్ష్యంగా అప్పుడు అర్ధం అయింది షాడోకి.

కేర్ ఫ్రీగా తిరుగుతూ, కనిపించిన సుఖాలను ఆస్వాదిస్తూ హాయిగా జీవితం గడిపే జెట్ సెట్‌కి చెందిన యువతి కాదామె .... తన కోసమే మాటు వేసింది..... తన పరిచయాన్ని పొంది , తన అంతు చూడటానికే ప్లాను రచించింది.

ఎవరామె? గనీఖాన్ అనుచరురాలా? లేక ఇంకేదైనా గాంగ్‌కి చెందిన మనిషా?

టాక్సీలో నుంచి దూకిన హీరోలు పిడికిళ్ళు బిగించి తనను కమ్ముకోవటంతో పటాపంచలు అయిపోయాయి షాడో ఆలోచనలు.

అంత మత్తులోను అతనికి తెలియకుండానే రియాక్ట్ అయినాయి అవయవాలు. తన నడుమును పట్టుకున్న ఆస్మాను పూల చెండులా ఎత్తి అవతలికి విసిరేశాడు. పాంటు బెల్టు వెనుక దాచుకున్న పీటర్ ఆలీ ఐరన్ రాడ్‌ని బయటికి తీసి శత్రువులను ఎదుర్కున్నాడు.

"కొట్టండి... తల పగలగొట్టండి....." కర కర లాడుతున్న కంఠంతో అన్నాడు ఒక దృఢకాయుడు.

చేతిలోని రాడ్‌ని గిరగిరా తిప్పి అతని తల పగలగొట్టేశాడు షాడో. దగ్గరలో కనిపించిన ఇంకో వ్యక్తికి ముఖాన్ని పచ్చడి చేశాడు.

భరించరాని బాధతో పెద్దగా మూలుగుతూ క్రింది వాలిపోతున్న తమ సహచరుల్ని చూసి ఆశ్చర్యంతో మ్రాన్పడి పోయారు మిగిలిన యిద్దరూ. వారు ఆ ఆశ్చర్యం నుంచి తేరుకోక ముందే ఇంకో వ్యక్తి గుండెల మీద పొడిచి, పళ్ళు వూడిపోయేటట్లు ఎడమ పిడికిలిని ప్రయోగించాడు షాడో.

అక్కడితో జారిపోయింది ఆఖరి వ్యక్తి ధైర్యం. గిరుక్కున వెను తిరిగి పాదాలకు బుద్ధి చెప్పాడు ఒక్కసారిగా.

నేల కూలిన వారందరికీ మరికొన్ని పిడికిటి పోట్లు బహూకరిద్దామనే వుద్దేశ్యంతో ప్రక్కకు తిరిగాడు షాడో.

అదే సమయంలో ముంచుకు వచ్చింది ఎదురు చూడని ప్రమాదం.

అతను విదిలించిన విదిలింపుకు దూరంగా పడి, దగ్గర్లో వున్న ఒక లావుపాటి బండరాయిని అందుకుంది ఆస్మా..... రెండు అంగల్లో సమీపించి బలమంతా ఉపయోగించి కొట్టింది అతని నెత్తిమీద.

అంతకు ముందు తగిలి వున్న దెబ్బ మీదే ఇప్పుడు ఆ రాయి పడటంతో తట్టుకోలేక పోయాడు షాడో.

"డర్టీ బిచ్.... నీ అంతు చూస్తాను..... నిన్ను కత్తికో కండగా నరికి ......" బూటు ప్రక్కన బిగించి వున్న డాగర్ మీద చేయి వేయబోతూ నిలుచున్న వాడు నిలుచున్నట్లే మొదలు నరికిన చెట్టులా విరుచుకు పడిపోయాడు.

నేలను తాకీ తాకక ముందే స్పృహ తప్పి పోయిందతనికి.

* * * * *

పదునైన కత్తితో తలను ఎవరో రెండుగా చీల్చటానికి ప్రయత్నిస్తున్నట్లు బాధ పడుతూ కనులు తెరిచాడు షాడో.

గాలి, వెలుతురు చొరరాని పెద్ద గోడవున్ లో ఒక కుర్చీ మీద కూర్చుని వున్నాడతను.

చేతులు ఎత్తి తల మీద తడుముకోవటానికి ప్రయత్నించాడు. ఉన్న చోటి నుంచి ఒక్క అంగుళం కూడా కదలటానికి వీలు కానంత గట్టిగా కుర్చీ హేండ్స్‌కి కట్టి వేసి వున్నాయి అవి.

అతని కదలికల్ని గమనించారు కాబోలు ఒకరి తరువాత ఒకరుగా ఎదుటికి వచ్చారు నలుగురు దృఢకాయులు.

"హల్లో! ఏమిటి వింతగా వున్నాయి మీ అవతారాలు! కాళ్ళు జారి రోడ్డుకు అడ్డంగా పడ్డారా??" చిరునవ్వుతో ప్రశ్నించాడు షాడో.

"కదలకుండా కట్టి పడేసినా జోకులు మానలేదు వీడు.... నెత్తిమీద ఇంకో రెండు తగిలిస్తే గాని బుద్ధిరాదు......." కోపంగా అంటూ ముందుకు అడుగు

వేయబోయిన ఒక దృఢకాయుడిని బలవంతంగా ఆపాడు తలకు పెద్ద కట్టు కట్టుకుని వున్న వ్యక్తి.

"మా సహనం ఇందాక నువ్వు చేసిన రప్చర్ మూలకంగా అంతరించి పోయింది బ్రదర్.... అనవసరమైన మాటలతో కాలక్షేపం చేయకుండా యిక అసలు విషయానికి వద్దాం......" షాడో ముఖంలోకి సూటిగా చూస్తూ అన్నాడు.

"నేనా? ఇందాకా రప్చర్ చేశానా?? ఎవరు చెప్పారు??" విపరీతమైన ఆశ్చర్యంతో ప్రశ్నించాడు షాడో.

ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు వాళ్ళు.

"నేను చెప్పినట్లు చేయటమే మంచిది..... నెత్తి మీద దెబ్బ పడకుండా వీడు మన దారికి రాడు......" మళ్ళీ అన్నాడు మొదటి వ్యక్తి.

తల పగిలిన వ్యక్తి ఆలోచనలో పడటం షాడోకి కనిపించింది.

"మీరు ఎవరో నాకు తెలియదు..... నన్ను ఎందుకు ప్రశ్నిస్తున్నారో అంతకన్నా తెలియదు..... నేను ఎందుకు ఇలా బంధింపబడి వున్నానో దయచేసి చెప్పండి......." అయోమయంగా చూస్తూ అడిగాడు.

ఈ సారి తన అభిప్రాయాన్ని ఎవరికీ చెప్పలేదు మొదటి దృఢకాయుడు. ఛెంగున ముందుకు దాకి చాచి పెట్టి కొట్టాడు షాడో చెంప మీద.

ఆ అదటుకు ప్రక్కకు తూలాడు షాడో...... కుర్చీతో సహా నేలమీద పడ్డాడు.

"అయోమయంగా చూసి అమాయకంగా మాట్లాడి నువ్వు సాధించగలిగింది ఏమీ లేదు మిస్టర్ పీటర్ ఆలీ...... ఆ విషయాన్ని నువ్వు ఎంత

తొందరగా గ్రహిస్తే అంత మంచిది....." కుర్చీతో సహా అతన్ని లేపి కూర్చోబెడుతూ హెచ్చరించాడు మూడో వ్యక్తి.

"నా పేరు పీటర్ ఆలీనా? విచిత్రంగా వుందే....." తలను విదిలిస్తూ అన్నాడు షాడో.

మళ్ళీ రెచ్చిపోయాడు మొదటి వ్యక్తి. ఒక్క ఉదుటున అతన్ని సమీపించి ఎడా పెడా కురిపించాడు గుద్దుల వర్షాన్ని.

చెవుల్లో బాంబర్ విమానాలు ఎగురుతున్నట్లు భయం కరమైన శబ్దం స్టార్ట్ అవుతుండగా ఇంకోసారి క్రింద పడిపోయాడు షాడో. పడిన మనిషిని బూటు కాళ్ళతో యిష్టం వచ్చినట్లు తన్నేశాడు ఆ దృఢకాయుడు. తన్ని తన్ని ఆయాసం వచ్చి వెనక్కి తగ్గాడు.

"గనీఖాన్ పిలిస్తే నువ్వు ఇరాన్ దేశం నుంచి యిక్కడికి పరిగెత్తుకు వచ్చావ్...... ఏమిటి నీ వుద్దేశ్యం ? ఏం చేయటానికి నిన్ను అతను పిలిపించాడు??" ఇంకోసారి అతన్ని లేపుతూ అడిగాడు తల పగిలిన వ్యక్తి.

అయోమయంగా నొసలు విరుస్తూ చేతుల వంక చూసుకున్నాడు షాడో.

మొదటిసారి క్రింద పడినప్పుడు కొద్దిగా లూజ్ అయినాయి. వాటిని కుర్చీ హేండిల్స్ కేసీ కట్టి వుంచిన తాళ్ళు. రెండోసారి పడినప్పుడు మొదటి దృఢకాయుడు తన్నిన తన్నుల్ని తట్టుకోవటానికి మెలికలు తిరగటంలో పూర్తిగా విడిపోయాయి ముడులు.

ఆ విషయం అతనికి అర్థం అయ్యే లోపుగానే కనిపెట్టేశారు వాళ్ళు.

"మైగాడ్! వీడు చేతుల్ని వదిలించుకొని లేచి నిలబడ్డాడంటే మొదటికి వచ్చేస్తుంది కథ..... కట్టండి..... తాళ్ళను ఇంకోసారి గట్టిగా కట్టి ముడులు సరిగ్గా వేయండి....." అని అరుస్తూ ముందుకు వంగి షాడో చేతుల్ని కుర్చీ హేండిల్స్ కేసి అదిమి పట్టుకున్నాడు తలకు కట్టు కట్టుకొని వున్న వ్యక్తి.

ఆ మాటల్ని వినేసరికి అతనికి తెలియకుండానే కదిలాయి షాడో అవయవాలు. బరువునంతా చేతుల మీద మోపుకొని, ఫ్రీగా వున్న పాదాల్ని ఛట్ మని పైకి ఎత్తాడు.

అతన్ని గట్టిగా నొక్కి పట్టి వుంచటం మీద తన దృష్టిని కేంద్రీకరించి వున్న దృఢకాయుడు చాలా ఆలస్యంగా గుర్తించాడు ఆ ప్రమాదాన్ని గుర్తించి వెనక్కి దూకేలోపుగానే కడుపు కండరాలు చినిగిపోయేటట్లు పడనే పడింది దెబ్బ.

ఊపిరి ఆగిపోయినంత బాధ మెదడును ఆవరించుకుంటుండగా, పొట్టను చేతులతో అదుముకుంటూ మోకాళ్ళ మీద వాలిపోతున్న అతన్ని చూసేసరికి ముంచుకు వచ్చేసింది రోషం మిగిలిన ముగ్గురికి.

"కొట్టండి.... దొంగ రాస్కెల్ తల పగలగొట్టండి ......." అని అరుస్తూ కలబడ్డారు షాడో మీదికి.

ముడులు వీడి పోయిన తాళ్ళ లోనుంచి చేతుల్ని వెనక్కి లాక్కుంటూ, పెద్ద పులిలా కుర్చీలో నుంచి లేచాడు షాడో. లేస్తూనే రెండు చేతుల్నీ కలిపి గుద్దాడు ఒకతని ముఖం మీద, రెండో వ్యక్తి గుండెల్ని భుజాలతో గుద్ది అమాంతం గాలిలోకి ఎత్తేశాడు మూడో వ్యక్తిని.

"ఆపండి..... ఆపండి వాడిని..... ఆపండి...." పొట్టమీద నుంచి చేతులు తీయకుండానే బిగ్గరగా అరిచాడు క్రింద పడిన వ్యక్తి.

చేతుల్లోని దృఢకాయుడిని గిరగిరా తిప్పి అతని కేసి బాదాడు షాడో. అంతటితో ఆగకుండా తను ఖాళీ చేసిన కుర్చీని ఎత్తి దగ్గర్లో కనిపించిన వ్యక్తి నడుము మీద కొట్టాడు.

ముక్కలు ముక్కలై నలుదిక్కులకు విరజిమ్మబడ్డాయి కుర్చీ చెక్కలు. వాటి మాదిరిగానే డిజింటిగ్రేట్ అయిపోయింది ఆ వ్యక్తుల ధైర్యం. తగిలిన దెబ్బల్ని కూడా లక్ష్య పెట్టకుండా లేచి నిలబడి పిక్కబలం చూపించారు ఒక్కసారిగా.

వాళ్ళను అంత తేలిగ్గా వదిలి పెట్టే ఉద్దేశ్యం షాడోకి లేదు. విపరీతమైన కోపంతో నెత్తురు ముద్దల్లా తయారైన కనుగుడ్లను క్రూరంగా తిప్పుతూ, "ఆగండి.... ఆగండిరా పిరికి సన్నాసుల్లారా..... ఆగండి" అని గర్జిస్తూ వెన్నంటాడు.

సరిగ్గా గోడవున్ ముఖ ద్వారంలో అడుగు పెట్టేసరికి ఎక్కడి నుంచో పరుగు పరుగున వచ్చి అతని పాదాలకు అడ్డం పడింది పిల్లి పిల్ల. ఆనందంగా అరుస్తూ పొర్లిగింతలు పెట్టింది.

పొంగుతున్న పాలమీద నీరు చిలకరించినట్లు చటుక్కున మాయమైపోయింది షాడోని ఆవరించుకొని వున్న ఆవేశం.

"ఎవరు నువ్వు బేబీ? ఎక్కడి నుంచి వచ్చావ్? ముక్కు ముఖం తెలియని నన్ను చూసి ఇంతగా ఆనందపడి పోతున్నావేమిటి?" దాని తల నిమురుతూ సాదరంగా అడిగాడు.

ఆ మాటలు మరింత ఆనందాన్ని కలిగించాయి కాబోలు, తోకను నిఠారుగా ఎత్తి మూడు పిల్లి మొగ్గలు వేసిందా పిల్లి పిల్ల.......

ఎగిరెగిరి దూకుతూ గోడవున్ చివరి భాగంలోకి పరిగెత్తింది.

"ఎవరు పెంచుకుంటున్నారో గాని ముచ్చటగా వుంది ఈ పిల్లి..... చాలా తెలివితేటలు కల జీవం మాదిరిగా కనిపిస్తోంది....." అనుకుంటూ దాని వంకే చూస్తున్న షాడో కర్ణేంద్రియాలకు కొట్టవచ్చినట్లు వినిపించింది ఆ కేక.....

"మేము ఇక్కడ వున్నాం రాజూమియా.... ఇక్కడ..... ఇక్కడ....." తన చెవులు తనను ఏమారుస్తున్నా యేమోనన్న అనుమానంతో తూచి తూచి అడుగులు వేస్తూ అటుగా పోయాడు అతను.

చిన్న సైజు చెక్కల పార్టిషన్ ఒకటి వుంది గోడవున్ చివరి భాగంలో ..... ఆ పార్టిషన్ మధ్య కరచరణాలు బంధింపబడి కనిపించారతనకి ఇద్దరు పురుషులు. ఒక అందమైన యువతి.

* * * * *

"నాకు తెలుసు రాజూ మియా! ఏదో ఒక విధంగా నువ్వు మా జాడల్ని తెలుసుకొని వెతుక్కుంటూ వస్తావని అనుకుంటూనే వున్నాను......" అతన్ని చూడంగానే ఆనందంగా అన్నదా యువతి.

"మీకు ఈ దుర్గతి పట్టించింది ఎవరు?" ఆమె బంధనాలను సడలిస్తూ అడిగాడు షాడో.

"ఇంకెవరు? నిన్ను బంధించి తీసుకొచ్చిన వాళ్ళే జహీరా పట్టణంలో మమ్మల్ని కూడా బంధించారు..... నువ్వు ఏమైపోయావో అనే ఆత్రుతను

అణచుకోలేక హోటల్ నుంచి బయటికి వచ్చాం.... బాంబులతో హోటల్ని నేలమట్టం చేసే ప్లాను బెడిసి కొట్టేసరికి బల ప్రయోగంతో మమ్మల్ని బంధించి యిక్కడ దాచారు.... ఇంతకీ మా జాడలు నీకు ఎలా తెలిశాయి?" తన బంధాలు తొలిగి పోగానే మిగిలిన ఇద్దరివైపు తిరుగుతూ అడిగిందామె.

"మీ మాటలు ఒక్కటి కూడా నాకు అర్థం కావటం లేదు....... జహీరా పట్టణం పేరు ఇంతకు ముందు ఎప్పుడూ విన్నట్లు గుర్తు లేదు....." నుదురు రుద్దుకుంటూ సాలోచనగా సమాధానం యిచ్చాడు షాడో.

చేస్తున్న పనిని మధ్యలో ఆపి అతని వంక ఒకసారి విచిత్రంగా చూసిందా యువతి.

"నా మాటలు నీకు అర్థం కాకపోయినంత మాత్రాన యిప్పుడు వచ్చిన నష్టం ఏమీ లేదు గాని నీ తల మీద ఆ గాయం ఏమిటి ??" అని అడిగింది.

అప్పుడు గమనించుకున్నాడు షాడో తనకు తగిలిన దెబ్బని......

"ఇందాక నన్ను హింసించటానికి ప్రయత్నించి దొంగనాయాళ్ళ పనే అయివుంటుంది యిది..... ఇంత వరక నేను గమనించలేదు.... గమనించి వుంటే వాళ్ళ తలల్ని కూడా యిదే మాదిరి ముక్కలు చేసి వుండే వాడిని......." పారిపోయిన దృఢకాయుల్ని తలుచుకొని పళ్ళు కొరుకుతూ అన్నాడు.

తమ కాళ్ళు చేతులకు కట్టి వున్న తాళ్ళు తొలిగిపోగానే లేచి నిలబడుతూ తాము కూడా అతని వంక విచిత్రంగా చూశాడు మగవాళ్ళు యిద్దరూ.

"సమ్ థింగ్ యీజ్ రాంగ్ విత్ హిమ్ ట్వింకిల్..... ఇతని మాటల్లో ఏదో తేడా కనిపిస్తోంది. చూపుల్లో కూడా చాలా మార్పు ప్రవేశించింది......" అన్నాడు వారిలో ఒకతను.

ఎందుకనో వెంటనే ముంచుకు వచ్చేసింది షాడోకి కోపం.

"నా చూపులు ఎలా వుంటే నీ కెందుకు బే? మాటల్ని జాగ్రత్తగా రానీ.... పిచ్చివాగుడు వాగావంటే ముఖం పచ్చడి అయిపోతుంది....." తోక తొక్కిన తాచులా అతని వైపు తిరుగుతూ వార్నింగ్ యిచ్చాడు.

అఫెండ్ అయ్యాడా మనిషి.

"ముఖం పచ్చడి అవుతుందా? ఎలా అవుతుందో చూపించు...." పిడికిళ్ళు బిగించి ముందుకు వస్తూ ఛాలెంజి చేశాడు.

ఫెడీమని కొట్టి చూపించాడు షాడో.

అతనంత స్పీడ్గా కదులుతాడని ఊహించలేదా మనిషి. ఉక్కిరి బిక్కిరి అవుతూ, రెండు అడుగుల ఎత్తున గాలిలోకి లేచి అవతల పడ్డాడు.

పడిపోయిన అతని మీదికి దుమకబోతున్న షాడోని అడ్డుకుందా యువతి. కుడి భుజాన్ని గట్టిగా పట్టుకొని అతని పాదాలకు తన ఎడమ కాలిని అడ్డం వేస్తూ ఎత్తి కుదేయటానికి ప్రయత్నించింది.

ఆఖరి క్షణంలో జలగలా జారి పోయాడు షాడో. ఖాళీగా వున్న ఎడమ చేతిని ఆమె వక్షోజాల మీద వేసి మోకాలితో తొడల మీద పొడిచాడు.

తొడలు విరిగిపోయినంత బాధ మెదడును ఆవరించుకుంటుండగా, వెనక్కి తూలి వెల్లికిలా పడిపోయిందామె.

"పీటర్ ఆలీ అని పేరు పెట్టి చిత్రహింసల పాలు చేయటానికి ప్రయత్నించారు ఇందాకటి దుర్మార్గులు. రాజూమియా అని ఇంకో పేరుతో పిలిచినట్లే పిలిచి దొంగ దెబ్బలు కొట్టటానికి చూస్తున్నారు మీరు..... నా పేరు ఏదయినా అనవసరంగా నా జోలికి వచ్చారంటే ఖతమ్ చేసేస్తాను. ఖబడ్దార్......" ఖంగుమంటున్న కంఠంతో ఆల్టిమేటమ్ జారీ చేసి గిరుక్కున వెనుతిరిగాడు షాడో.

"ఆగు... ఆగు రాజూమియా ....... ఒక్క క్షణం ఆగు." అని పిలుస్తూ అతన్ని వెంబడించటానికి ప్రయత్నించాడు అంత వరకూ మౌనంగా వున్న రెండో మనిషి.

చర్రున అతనికేసి తిరిగాడు షాడో. కంటికి కనిపించనంత వేగంతో కదిలి బూటుకు అడ్డంగా బిగించి వున్న డాగర్ ని బయటికి లాగింది అతని కుడిచేయి.

తల్లక్రిందులుగా పల్టీకొట్టి ఒక పెద్ద ఆయిల్ డ్రమ్ చాటున తల దాచుకున్నాడా మనిషి.

అతను అక్కడి నుంచి యివతలికి వచ్చి తనను ఎటాక్ చేయడని స్పష్టం కాగానే వెను తిరిగి బయటికి వెళ్ళిపోయాడు షాడో.

గోడవున్ గోడల దగ్గిర దొరికిన ఒక లావుపాటి ఎలుకను నోట కరుచుకొని అతని వెనుకే పరిగెత్తుతున్న పిల్లి పిల్లను గమనించి గాఢంగా నిట్టూరుస్తూ లేచి నిలబడింది ట్వింకిల్.

అంతకు ముందు అంజాద్ అన్న మాటలు అక్షరసత్యాలు. సమ్ థింగ్ యీజ్ వెరీ రాంగ్ విత్ రాజూమియా... మునపటి మనిషి కాదని స్పష్టంగా తెలియచేస్తున్నాయి అతని చేతులు.

విపరీతమైన మానసిక వత్తిడితో పని చేసేటప్పుడు తల మీద ఏదయినా దెబ్బ తగిలితే అటువంటి పరిస్థితి ఉత్పన్నమయ్యే అవకాశాలు చాలా వున్నాయి రాజూమియా తల మీది గాయం అతనికి అమ్నీసియాను కలుగచేసిందా?? తనెవరో, తన వునికి ఏమిటో తెలుసుకోలేని మతిమరుపును ప్రవేశ పెట్టిందా??

"ఆలోచనలు అనవసరం ట్వింకిల్.... " అంటూ ఆమె ప్రక్కకు వచ్చి నిలబడ్డాడు అంజాద్." మతిని కోల్పోయినా కోల్పోకపోయినా, రాజూమియా ఫైటింగ్ ఎబిలిటీలో కొంచెం కూడా మార్పు రాలేదు...... అతను మన పక్షాన వుండకుండా విడిగా తిరిగితే చాలా ప్రమాదం... అతన్ని ఖతమ్ చేసేయటమే ఉత్తమం......" తన అభిప్రాయాన్ని వెల్లడించాడు.

అదే అభిప్రాయానికి వచ్చి, ఆయిల్ డ్రమ్ చాటున దాక్కున్న బదిలీభాయ్ కోసం చూసింది ట్వింకిల్.

"బదిలీ భాయ్...... బదిలీ భాయ్......" అని పిలుస్తూ గోడవున్ బయట కూడా వెతికింది.

ఎంత పిలిచినా, ఎంత వెతికినా కనిపిం చలేదు బదిలీ భాయ్..... షాడో బయటికి పోయిన మరుక్షణం ఆయిల్ డ్రమ్ చాటునుంచి లేచి పలాయన మంత్రం పఠించాడు తను కూడా.

# 14

"............ఎక్కడికి పోవాలి సార్? అడ్రసు చెప్పి మరుక్షణం తీసుకుపోయి దింపేస్తాను..... ఎక్కండి సార్....." రోడ్డు ప్రక్కన నిలబడిన షాడో ముందు టాక్సీని ఆపుతూ అన్నాడు టాక్సీ డ్రయివర్ ఒకతను.

తను ఎక్కడికి పోవాలో గుర్తుకు తెచ్చుకోవటానికి ప్రయత్నించాడు షాడో. ప్రయోజనం ఏమీ లేకపోవటంతో, తల అడ్డం తిప్పుతూ ప్రక్కకు తిరిగి వీధి చివరికి బయలు దేరాడు కాలినడకన.

అతను నిలబడిన ప్రదేశంలో వున్న ఒక ఎలక్ట్రిక్ పోల్ చాటున కూర్చుని, గోడవున్‌లో నుంచి తెచ్చుకున్న ఎలుకను శుభ్రంగా ఆరగించి మీసాలను కూడా తుడిచేసుకుంది పిల్లి పిల్ల. అతను అడుగు కదపగానే కుక్కపిల్ల మాదిరి తోక వూపుతూ అనుసరించింది.

ఆ వీధి చివరికి పోయి పది నిముషాలు పాటు నిలబడ్డాడు షాడో. అక్కడి నుంచి ఇంకో వీధిలోకి. ఆ వీధిలో నుంచి మరో వీధిలోకి ఇష్టం వచ్చినట్లు చక్కర్లు కొట్టాడు.

ఎన్ని చక్కర్లు కొట్టినా తన గమ్యం ఏమిటో స్ఫురణకు రాకపోయేసరికి విసుగ్గా నేలను తన్ని, ఒక షాపు ముందు కనిపించిన సిమెంట్ బెంచి తిరగబోతుండగా , ఎగిరి గంతులు వేస్తూ బిగ్గరిగా అరిచింది పిల్లి పిల్ల.

"అసలే మతి చెడి నేను ఏడుస్తుంటే నీ గోల ఏమిటి బేబీ? ఏమయింది నీకు." విసుగ్గా అడుగుతూ దానికేసి చూశాడతను.

అర్ధరాత్రి దాటిపోతూ వుండటం వల్ల నిర్మానుష్యంగా తయారయిన ఆ వీధిని పది అంగల్లో క్రాస్ చేసి, అవతలి వైపున కొంచెం దూరంలో వున్న పెద్ద హోటల్ ముందు ఆగింది పిల్లి పిల్ల. వెనక్కి చూస్తూ ఇంకోసారి అరిచింది.

"ఇదేదో చాలా పెద్ద కుటుంబంలోని వాళ్లు పెంచుకున్న జీవం అయి వుంటుంది. సిమెంట్ బెంచీల మీద పడుకోవటం దీనికి నామోషీ అనిపించి నట్లుంది....... " అనుకుంటూ ఆ హోటల్ ముందుకు పోయాడు షాడో.

అంతవరకూ కాంపౌండ్ వాల్‌కి అనుకొని కునికి పాట్లు పడుతున్న హోటల్ వాచ్‌మన్ చటుక్కున లేచి నిలబడి స్మార్ట్‌గా శాల్యూట్ చేశాడు.

"కాలి నడకన వస్తున్నారేమిటి సార్? వెహికిల్ ఏదీ దొరకలేదా?" అటెంక్షన్ ఫోజును వదలకుండా వినయంగా ప్రశ్నించాడు.

"నేనెవరో నీకు తెలుసా?" ఆశ్చర్యంగా అడిగాడు షాడో.

"భలే ప్రశ్న వేశారు సార్..... మీరు తెలియక పోవటం ఏమిటి సార్?? లోపలికి వెళ్ళండి....." అతను పీకలదాకా తాగి వున్నాడనే నిశ్చయానికి వస్తూ అన్నాడు వాచ్‌మన్.

తనెవరో తెలిసినట్లు మాట్లాడిన వాళ్లందరూ మాట్లాడిన మూడో నిముషంలో తన బుర్ర రామకీర్తన పాడించటానికి ప్రయత్నించటాన్ని మరిచిపోలేదు షాడో. ఇప్పుడు కూడా అటువంటి పరిస్థితే ఎదురు పడబోతున్నదని అనుమానించి తటపటాయించాడు అడుగు ముందుకు వేయటానికి.

అతని తల మీది గాయాన్ని కూడా గమనించి, గబగబా రిసెప్షన్ హాలు దగ్గిరికి పోయాడు వాచ్‌మన్.

"పీటర్ ఆలీ సార్ పీకల దాకా తాగి ఎక్కడో తల పగలకొట్టుకు వచ్చాడు. తాగిన మత్తులో తనేం మాట్లాడుతున్నాడో ఆయనకు అర్ధం కావటం లేదు...... " కౌంటర్ వెనుక కూర్చుని వున్న రిసెప్షనిస్టుకు రిపోర్టు చేశాడు.

వెంటనే పిలిచాడు రిసెప్షనిస్టు ఇద్దరు వర్కర్స్‌ని.....

వాచ్‌మన్ చర్చల్ని జాగ్రత్తగా గమనిస్తున్నాడు షాడో. అక్కడి నుంచి అవతలికి వెళ్ళి పోవటమే మంచిదని నిర్ణయించుకోబోతుండగా పెద్ద పెద్ద అడుగులు వేస్తూ అతని దగ్గిరికి వచ్చారు రిసెప్షనిస్టు పంపిన వర్కర్స్.

"కారులో నుంచి కాలు క్రింద పెట్టకుండా తిరగాల్సిన మీలాంటి పెద్దలు యిలా నడిరోడ్డు మీద నిలబడటం ఏమీ బాగోలేదు సార్...... మీ రూమ్‌కి తీసుకుపోతాం రండి సార్....." వినయంగా అంటూ చెరొక ప్రక్కనా నిలబడ్డారు.

అవసరం అయితే పిడకిళ్ళను ప్రయోగించటానికి సిద్ధం అవుతూ, "నేనెవరో మీకు తెలుసా?" వారిని కూడా ప్రశ్నించాడు షాడో.

"భలే వారే సార్.... గనీఖాన్ సాబ్ వంటి కోటీశ్వరుడి అతిధులు మీరు..... ఆ వషయాన్ని ఎలా మర్చిపోతాం??" చిరునవ్వుతో సమాధానం యిచ్చాడు ఒక వర్కర్.

ముఖం మీద ఎవరో లాగి పెట్టి గుద్దినట్లు గుర్తుకు వచ్చింది షాడోకి గోడవున్ లోని దృఢకాయులు మొట్ట మొదటిగా వేసిన ప్రశ్న.......

గనీఖాన్ అనే పెద్ద మనిషి ఏదో పని కోసం తనను ఇరాన్ దేశం నుంచి పిలిపించినట్లు మాట్లాడారు వాళ్ళు..... ఆ పని ఏమిటో చెప్పమని వత్తిడి చేశారు.....

సో..... వాళ్ళు అన్నట్లు పీటర్ ఆలీ అనేదే తన పేరు అని సెటిల్ అయింది..... రెండోసారి ఫైట్ చేయబోయిన వాళ్ళు పిలిచినట్లు రాజూమియా కానే కాదు......

తన ఐడెంటిటీకి సంబంధించిన సమస్య సాల్వ్ అవగానే ఉత్సాహంగా ముందుకు అడుగు వేశాడు షాడో. చెరొక ప్రక్కా నిలబడి దారి చూపిస్తున్న వర్కర్స్ సాయంతో రాజమందిరం వంటి గదిలోకి పోయి, హంసతూలికా తల్పం వంటి ఫోమ్ బెడ్ మీద విశ్రమించాడు.

నిముషాల మీద ఫోన్ చేసి ఒక డాక్టర్ని పిలిపించాడు రిసెప్షనిస్టు. అతని తల మీది గాయాన్ని శుభ్రం చేయించి, నీట్‌గా కట్టు కట్టించి శలవు తీసుకున్నాడు.

## 15

రిసెప్షనిస్టు షాడో గదిని వదిలి పోయిన రెండు నిముషాలకు, అదే కారిడార్లో నాలుగు గదుల అవతలగా వున్న తన రూమ్‌లో నుంచి మెల్లిగా బయటికి వచ్చింది ఆస్మా.

తనను ఎవరూ గమనించకుండా జాగ్రత్త పడుతూ, మెట్ల మీదుగా గ్రౌండ్ ఫ్లోర్ లో వున్న కిచెన్స్ దగ్గిరికి పోయింది.

ఒకే ఒక మనిషి వున్నాడు అక్కడ. ఏదో మేగజైన్‌ని ముఖానికి అడ్డం పెట్టుకొని గాఢ నిద్ర పోతున్నాడు.

అడుగుల్ని ఎత్తి ఎత్తి వేస్తూ అతని వెనుక నుంచి హోటల్ వెనుక భాగంలో వున్న పెద్ద సందులోకి పోయిందామె.

సందు చివర పడిపోవటానికి సిద్ధంగా వున్న ఒక రేకుల షెడ్‌లో కూర్చుని వెయిట్ చేస్తున్నారు షాడో చేతుల్లో రెండుసార్లు చావు దెబ్బలు తిన్న దృఢకాయులు నలుగురూ.

"ఏమయింది ఆస్మా? ఏమంటున్నాడు ఆ బాస్టర్డ్??" ఆమెను చూడగానే ప్రశ్నించాడు తల పగిలిన వ్యక్తి.

"చవటలు మీరు... ఎందుకూ పనికిరాని చచ్చు దద్దమ్మలు ....." అని తిట్టిన తిట్టు మరోసారి తిట్టకుండా అరగంట సేపు వారిని దుమ్ము ఎత్తి పోసిందామె.

"పేరు చెపితే గుండెలు ఆగిపడిపోయేటంతటి భయాన్ని క్రియేట్ చేయగల నరరూప రాక్షసుడు ఆ పీటర్ ఆలీ..... అటువంటి మనిషిని ఒకే ఒక దెబ్బతో మట్టి కరిపించి మీకు అప్పగించాను..... నలుగురు వీరాధివీరులు వుండి కూడా, అతని రహస్యాల్ని తెలుసుకోలేక పోయారు...... అతని చేతిలో రెండోసారి తన్నులు తినటమే కాకుండా, అతి కష్టం మీద పట్టి వుంచిన ఆ పాకిస్థాన్ స్పెషల్ బ్రాంచి వాళ్ళను కూడా పోగొట్టుకున్నారు...... మీరు అసలు మగవాళ్ళేనా?" అని అడిగింది వేడిగా.

తలలు వంచుకొని నేల మీది మట్టి బెడ్డల్ని గడ్డి పరకల్ని పరిశీలించటంలో మునిగి పోయారు ముగ్గురు దృఢకాయులు.

"జరిగి పోయిందానికి చింతించి ప్రయోజనం ఏముంటుంది ఆస్మా? ఇక ముందు జరగాల్సిన దేమిటో చెపితే బాగుంటుంది కదా !!" ధైర్యం తెచ్చుకుంటూ మెల్లిగా అన్నాడు వారి నాయకుడు.

"పూనీ ఏరియాలో వున్న మన గ్రామాల్ని ఆక్రమించుకొని, అక్కడ నిక్షిప్తమై వున్న పెట్రోలు వనరుల్ని తాము స్వంతం చేసుకోవటమే గనీఖాన్ లక్ష్యం. కల్నల్ షా ఆలంతో కలిసి అతను వేస్తున్న పథకాలకు పరమార్థం అదే. అందులో సందేహం లేదు......" వారందరి వంకా నిశితంగా చూస్తూ చెప్పింది ఆస్మా.

"పానకంలో పుడకలా మధ్యలో ప్రవేశించిన ఈ పీటర్ ఆలీని గనీఖాన్ ఏ విధంగా ఉపయోగించుకోదలుచుకున్నాడో తెలుసుకోవటానికి మనం చేసిన ప్రయత్నం దారుణంగా విఫలం అయింది.... మనం కొట్టిన దెబ్బల నుంచి అతను తేరుకొని మన కోసం వెతుకులాట ప్రారంభించక ముందే అతన్ని హతమార్చేయాలి......" అంటూ వెల్లడించింది తన నిర్ణయాన్ని.

"ఎప్పుడు ? ఎప్పుడు చేద్దాం ఆ పని ?" ఆతృతగా అడిగారు వారందరూ.

"ఎప్పుడో దేనికి ఇపుడే చేద్దాం.... డాక్టరు యిచ్చిన మందుల్ని మింగి మగతగా పడుకొని వుంటాడతను..... ఆ మగత విడక ముందే పైకి పంపించేద్దాం....." హోటల్ వైపు తిరుగుతూ వివరించింది.

చేసిన పొరపాటును దిద్దుకునే అవకాశం లభించినందుకు ఆనందపడిపోతూ ఆమెను అనుసరించారు ఆ దృఢకాయులు.

హోటల్ వెనుక గుమ్మం దగ్గిర ఆగి ఇంకోసారి వారందరి ముఖాల్లోకి చూసింది ఆస్మా.

" సి.ఐ.బి. అప్పగించాల్సిన ఈ ఎస్సైన్‌మెంట్‌ని ప్రిస్టేజి ఇష్యూగా తీసుకొని మన చేతుల్లో పెట్టారు మన ఇండియన్ స్పెషల్ బ్రాంచ్ అధికారులు. ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న గోల్డెన్ ఛాన్సు యిది. సి.ఐ.బి. ఏజెంట్స్ కంటె స్పెషల్

బ్రాంచ్ డిటెక్టివ్స్ అధికులేనని, ఎందులోను తీసి పోరని నిరూపించుకునే అపూర్వ అవకాశం.... అతి తెలివికి పోయి ఇంత వరకు పడిన కష్టాన్ని బూడిద పాలు చేయకండి...." ఆఖరి వార్నింగ్ యిచ్చి లోపలికి ఎంటర్ అయింది.

అప్పుడే అటూ యిటూ కదిలి కనులు తెరిచాడు కిచెన్‌లో నిద్రపోతున్న వ్యక్తి.

పది అంగల్లో అతన్ని సమీపించి నోటిని మూశాడు ఒక దృఢకాయుడు. రెండవ చేత్తో మెడను పట్టుకొని బలవంతంగా వెనక్కి వంచాడు.

ఫట్ మని వికృత శబ్దం చేస్తూ విరిగి పోయిందా వ్యక్తి మెడ ఎముక, ఏం జరుగుతున్నదో అర్ధం అయ్యే లోపు గానే గాలిలో కలిసిపోయాయి ప్రాణ వాయువులు.

శబ్దం కాకుండా అడుగులు వేస్తూ మెట్లు ఎక్కి మొదటి అంతస్థులో ప్రవేశించారు. వాళ్ళందరూ షాడో విశ్రమిస్తున్న గది ముందు నిలబడి ఆస్మావైపు చూశారు.

తన భుజానికి తగిలించుకున్న హేండ్ బాగ్‌లో నుంచి లావుపాటి సిగార్ వంటి వస్తువును బయటికి తీసిందామె. దాని ముందు భాగంలో వున్న ఒక బటన్‌ని నొక్కి, షాడో గది తలుపులకు వున్న కీ హోల్‌కి అంటించింది.

మాగ్నెట్ అంటుకున్నట్లు కీ హోల్‌కి అంటుకుపోయిందా వస్తువు..... రెండు క్షణాల తరువాత నీలం రంగు పొగల్ని కీ హోల్ ద్వారా గదిలోకి పంప్ చేయటం మొదలు పెట్టింది.

"రెండు నిముషాల పాటు ఈ పొగల్ని పీలిస్తే ఏనుగు వంటి మనిషయినా పీనుగులా మారి పోతాడు..... ఒక వేళ అతను తలుపుల్ని తెరుచుకొని బయటికి వస్తే బల ప్రయోగం చేయటానికి సిద్ధంగా వుండండి......" తన గది వైపు అడుగులు వేస్తూ అన్నది ఆస్మా.

ఇద్దరు వ్యక్తులు ఆమెను అనుసరించారు. దుస్తుల్లో దాచుకున్న పొడుగాటి కత్తుల్ని బయటికి తీస్తూ కారిడార్ చివర వున్న ఒక బ్రూమ్ క్లోజెట్ చాటుకు పరిగెత్తారు మిగిలిన యిద్దరూ.

* * * * *

షాడో పడుకున్న ఫోమ్ బెడ్ చాటున మాటు వేసింది పిల్లి పిల్ల.

ఎంతో నీట్ గా వుండే ఆ గదిలోకి ఎలా వచ్చిందో గాని, టీపాయ్ అడుగు భాగాన్ని అంటి పెట్టుకుని దీర్ఘాలోచన చేస్తోంది ఒక పెద్ద మిడత.

ఉన్నట్లుండి ఎగిరి దగ్గిర్లో వున్న డ్రస్సింగ్ టేబిల్ మీద పడిందది.

దానితో పాటు తను కూడా ఎగిరింది పిల్లి పిల్ల. డ్రస్సింగ్ టేబిల్ మీది వస్తువుల నన్నిటినీ చెల్లా చెదురు చేస్తూ దాన్ని పంజా క్రింద నొక్కి, పట్టుకోవటానికి ప్రయత్నించింది.

చెల్లా చెదురు అయిన వస్తువుల మ్రోతకు ఉలిక్కిపడి కనులు తెరిచాడు షాడో. డాగర్ మీద చేయి వేస్త అటు కేసి చూసి చిన్నగా నవ్వేశాడు.

దొరికినట్లే దొరికి పిల్ల పిల్ల కాలి క్రింద నుంచి జారిపోయింది మిడత..... హెలీ కాప్టర్‌లా ఎగురుతూ ముఖ ద్వారం దగ్గిరికీ పోయింది.

చటుక్కున మాయమైపోయింది షాడో నవ్వు.

ముఖద్వారం దగ్గిరికి పూర్తిగా పోకముందే గింగిరాలు తిరుగుతూ క్రింద పడిపోయిందా మిడత. ప్రాణాల్ని వదిలేసినట్లు చలనం లేకుండా వుండిపోయింది.

"ఆగు..... బేబీ.... ఆగు.... అక్కడి నుంచి కదలకు...... "డ్రస్సింగ్ టేబిల్ మీది నుంచి అటుకేసి దూకబోయిన పిల్లి పిల్లను కమాండ్ చేస్తూ రెండు అంగల్లో ముఖ ద్వారాన్ని సమీపించాడు షాడో.

సమీపించిన మరుక్షణం ఎవరో గుండెల మీద గుద్దినట్లు ఎగిరి వెనక్కి దూకాడు. ఊపిరితిత్తులకు ఏదో అడ్డం పడి ఊపిరి ఆగిపోతున్న ఫీలింగ్‌ని దూరం చేసుకోవటానికి ప్రయత్నిస్తూ తలుపులకేసి దీక్షగా చూశాడు.

సుడులు తిరుగుతూ కీ హోల్ లో నుంచి వస్తోంది నీలపు రంగు పొగ.... మంచు మాదిరి మెల్లి మెల్లిగా గదినంతా ఆక్రమించుకోవటానికి సిద్ధ పడుతోంది.

అదేమిటో, ఎందుకలా వస్తోందో తెలుసుకోవాలన్న కోరిక షాడోకి కలుగలేదు.... దాన్ని వాసన చూస్తే ఏం జరుగుతుందో అర్థం అయింది గనుక తన వెనుకే వచ్చిన పిల్లి పిల్లను చంకలో యిరికించుకొని రూమ్ వెనుక భాగంలో వున్న బాల్కనీ వైపు పరుగెత్తాడు క్షణం కూడా ఆలస్యం చేయకుండా.

"గెట్ రెడీ..... ప్రమాదాన్ని పసికట్టాడు ఆ దుర్మార్గుడు.... గెట్ రెడీ...... " నాలుగు గదుల అవతలగా వున్న తన బాల్కనీలో గోడ చాటున నిలబడి, తన వెంట వచ్చిన దృఢకాయుల్ని హెచ్చరించింది ఆస్మా.

సైలన్సర్స్ అమర్చిన రివాల్వర్లను రెండు చేతులతోను బిగించి పట్టుకొని ఎయిమ్ తీసుకున్నారు వాళ్లు.....

బాల్కనీ తలుపుల్నీ తెరిచాడు షాడో. గుడ్డిగా ముందుకు దూకాలని అనిపిస్తున్నా, ఎందుకనో స్లో అయ్యాయి అతని పాదాలు.

"తొందరపడకు.... తొందరపడకు....." మృదు స్వరంతో అంతరాత్మ చేస్తున్న హెచ్చరికలను అర్ధం చేసుకోవటానికి విశ్వ ప్రయత్నం చేస్తూ, తలను మాత్రం బయటికి పెట్టి తొంగి చూశాడు.

ఫట్ మని వినవచ్చింది సన్నటి శబ్దం.

కందిరీగలా ఎగురుతూ అతని ముఖానికి మూడు అంగుళాల దూరంలో నుంచి పోయి బాల్కనీ పిట్టగోడ మీద వున్న ఒక పూలకుండీకి తగిలింది బుల్లెట్.

ముక్కలు ముక్కలై క్రింద పడిపోతున్న ఆ కుండీని గమనించి తలను వెనక్కి లాక్కుంటూ ఆశ్చర్యంగా పిల్లి పిల్ల వంక చూశాడు షాడో.

"ప్రమాదం ఎదురైతే ఎదుర్కోనే శక్తి మాత్రమే కాదు.... ప్రమాదాన్ని ముందుగానే పసికట్టగల శక్తి ఏదో మనకి వున్నట్లు అననిపిస్తోంది బేబీ...... బాల్కానీలో ప్రమాదం పొంచి వున్నందువల్లే కాబోలు – అడుగు ముందుకు పడలేదు చూశావా??" అంటూ యింకోసారి తలను బయటికి పెట్టి, వెంటనే జరిగాడు వెనక్కి......

ఫట్ ....ఫట్....ఫట్ మని విడవకుండా వినవచ్చిందా శబ్దం......పిట్టగోడ మీది పూలకుండీలు మరో రెండు ముక్కలు ముక్కలై క్రిందికి జారిపోయాయి.

అదే సమయంలో అనీజీగా కదిలి బావురుమని అరిచింది అతని చంకలోని పిల్లి పిల్ల.....

అదిరి పడి వెనక్కి చూసిన షాడో కనులకు స్పష్టంగా కనిపించింది గదిని సగం వరకూ ఆవరించుకున్న నీలిరంగు పొగ.

"ముందు నుయ్యి వెనుక గొయ్యి మాదిరిగా తయారయింది మన పరిస్థిత..... ఇప్పుడు ఏం చేద్దాం బేబీ??" నుదురు రుద్దుకుంటూ పిల్లి పిల్లను అడిగాడు.

నోరు వుంటే సమాధానం చెప్పేదేమో.... నోరు లేదు కబట్టి గిలగిలా కొట్టుకొని క్రిందికి జారిపోయిందది. నేలకు కొట్టిన రబ్బర్ బంతిలా ఎగురుతూ, కనురెప్పపాటు కాలంలో బాల్కనీ స్పేస్‌ని దాటి, పిట్టగోడను ఎక్కింది .

"చచ్చిపోతావ్......నీ దుంప తెగ....హతమారిపోతావ్......" ఆందోళనగా దాన్ని హెచ్చిరించబోయి ఆ మాటల్ని మింగేశాడు షాడో.

పిట్టగోడ మీద నిలబడి దిక్కులు చూడలేదు పిల్లి పిల్ల. అమాంతం గాలిలోకి ఎగిరి – బాల్కనీకి పది అడుగుల దూరంలో ఎత్తుగా పెరిగి వున్న ఒక ఫెర్నీ చెట్టు మీద పడింది.... పాదాలకు పట్టు దొరుకగానే, కోతి పిల్లలా క్రింది కొమ్మల మీదికి జారి సురక్షిత ప్రదేశానికి వెళ్ళిపోయింది.

దాని మాదిరిగా దూకితే తన బరువును కొమ్మలు విరిగి వాటితో పాటు తన కాళ్ళు చేతులు కూడా విరిగిపోతాయేమో అనే ఆలోచన షాడోకి కలుగలేదు.

పిల్లి పిల్ల మాదిరిగానే రెండు అంగల్లో పిట్టగోడను సమీపించి ఎగిరి దూకాడు గాలిలోకి.

"మైగాడ్....." తప్పించుకుంటున్నాడు..కొట్టండి..... పడగొట్టండి...... " ఆందోళనగా తన వారిని హెచ్చరించింది ఆస్మా ..... అలా తప్పించుకునే మార్గం ఒకటి వున్నదని ముందుగానే ఊహించులేకపోయినందుకు బాధ పడుతూ.

ముందుకు వాలి వున్న ఫెర్న్ కొమ్మల్ని పట్టుకొని పతన వేగాన్ని తగ్గించుకున్నాడు షాడో. ఆస్మా అనుచరులు ఎయిమ్ ని కరెక్ట్ చేసుకునేలాగా, ఆ కొమ్మల్ని వదిలి క్రిందికి జారిపోయాడు

" మన శ్రమ వృధా అయింది.... వాడు హోటల్ సిబ్బందిని రెచ్చగొట్టి గోల ప్రారంభించక ముందే తప్పు కోవటం మంచిది...." అంటూ బాల్కనీలో నుంచి గదిలోకి, అక్కడి నుంచి కారిడార్ లోకి పరిగెత్తింది ఆస్మా. బ్రూమ్ క్లోజెట్ చాటున వున్న అనుచరుల్ని కూడా కలుపుకొని హోటల్ వెనుక భాగం గుండా బయటికి వెళ్ళిపోయింది.

* * * * *

ఆమె ఊహించినట్లు హోటల్ సిబ్బందిని రెచ్చగొట్టి గోల చేయలేదు షాడో.

"సిమెంట్ బెంచీల మీద పడుకోవటమే మంచిదని ముందు అనుకున్న మాటలో ఎంత సుఖం వుందో చూశావా? నీ మూలకంగా ఆ పాడు గదిలోకి పోయి ప్రాణాలు పోగొట్టుకునేటంత పని చేశాను..... ఇప్పటికయినా బుద్ధి తెచ్చుకొని నా మాట ప్రకారమే ప్రవర్తించుకో.... బాగు పడతావు." పాదాల దగ్గిరికి వచ్చిన పిల్లి పిల్లతో అంటూ, ఫెర్న్ చెట్టుకు కొద్ది దూరంలో వున్న ఒక సిమెంట్ బెంచీ మీద పడుకున్నాడు.

తూర్పు దిక్కు తెల్లబడుతుండగా కిచెన్‌లో మరణించి వున్న తమ ఎంప్లాయిని గురించి ఆందోళన పడుతూ, అతన్ని కూడా గమనించారు హోటల్ స్టాఫ్.

తన మీద జరిగిన హత్యా ప్రయత్నాన్ని గురించి వారికి చెప్పలేదు షాడో. పెదవి విప్పి ఎవరితోనయినా గట్టిగా మాట్లాడితే ప్రమాదం ముంచుకు వస్తోందని అనుభవ పూర్వకంగా అర్ధం అయిపోయిందనికి.

మరణించిన తమ ఎంప్లాయీని గురించి కూడా వాళ్ళు అతనికి చెప్పలేదు. అతనికే కాదు. ఆ విషయం రెండో కంటి వాడికి తెలియక ముందే శరీరాన్ని అవతలికి తరలించి హుషప్ చేయించాడు హోటల్ మేనేజర్.

హోటల్ మదీనా వంటి ప్రముఖ స్థలాల్లో అటువంటి పనులు జరిగాయంటే ఇంకేమైనా వుందా? బజారు పాలయిపోవూ తమ పరువు ప్రతిష్టలు??

"రాత్రి వేళ చల్లగాలి కోసం బయట పడుకోవటం బాగానే వుంది కాని, పగలు కూడా బయటే కూర్చోవటం మంచిది కాదు సార్..... దయచేసి మీ గదికి వెళ్ళండి..... ఎవరయినా చూస్తే బాగోదు...." గడ్డం పట్టుకున్నంత పని చేస్తూ బ్రతిమాలుకుంటున్న మేనేజర్ వంక అనుమానంగా చూస్తూ తన గదికి తిరిగి వచ్చాడు షాడో.

ముందు జాగ్రత్తగా పిల్లి పిల్లను బయటే వుంచి, ఊపిరి బిగపడుతూ గది నంతా కలియతిరిగాడు. బాల్కనీ దగ్గిరికి పోయి, అవసరం అయితే ఇంకోసారి

బయటికి దూకటానికి సిద్ధపడుతూ , కొంచెం కొంచెంగా గదిలోని గాలిని పీల్చి చూశాడు.

రాత్రంతా బాల్కనీ తలుపులు తెరిచి వుండటం వల్ల బయటి గాలిలో కలిసిపోయింది ఆ పాయిజన్ పొగ.....

కీ హోల్ కి అతికించి వున్న సిగరెట్ వంటి సాధనాన్ని జాగ్రత్తగా వూడతీసి, తన ఎయిర్ బేగ్ లో భద్రపరుచు కుంటుండగా అతని ముందు ప్రత్యక్షం అయ్యాడు గనీఖాన్ అనుచరుడు శాంబో.

"పీటర్ ఆలీ అంటే నువ్వేనా! నీ గురించి విని చాలా గొప్పగా వూహించుకున్నాను..... నా వూహలకి నీ అవతారానికి సంబంధం కొంచెం కూడా లేదు......" వస్తూనే కామెంట్ చేశాడతను.

ఏడు అడుగుల ఎత్తున, ఆయిల్ డ్రమ్ అంత లావునా కనిపిస్తున్న అతని పర్సనాలిటీని గమనించి నొసలు ముడి వేశాడు షాడో.

తనకు ఎదురు పడిన ప్రతి మనిషికి తనను వెక్కిరించటమో తనతో పోట్లాడాలని అనుకోవటమో తప్ప యింకే పనులు వుండవా ??

"గనీఖాన్ సార్ నిన్ను వెంటనే తీసుకు రమ్మని అన్నారు.... పల్లెటూరి మనిషిలా అలా నోరు తెరుచుకొని చూడకుండా వెంటనే బయలుదేరు....." వంకరగా నవ్వుతూ హెచ్చరించాడు శాంబో.

లాగి పెట్టి అతని ముఖం మీద గుద్దాలన్న కోరికను అతి ప్రయత్నం మీద అదుముకుంటూ, ఎయిర్ బేగ్ని భుజానికి తగిలించుకొని అతన్ని అనుసరించాడు షాడో.

హోటల్ ఎదుట పార్క్ చేసిన తమ కారులోకి, అతనితో పాటు ఎక్కుతున్న పిల్లి పిల్లను చూసి చేయి విసరబోయి , అది ఎడారి పిల్లి అని గ్రహించి, అర్జంటుగా ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నాడు శాంబో.

అరగంట తరువాత అమ్జీ సిటీ ఉత్తర దిక్కున వున్న పెద్ద పురాతన కాలపు బంగ్లా ముందు ఆగింది వారెక్కిన కారు .....

శాంబో వెనుక అడుగులు వేసిన షాడోకి దర్శన మిచ్చాడు గనీఖాన్ – –

"వెల్‌కమ్ మై ఫ్రండ్ .... వెల్‌కమ్.... ఎంత ధనం యిచ్చినా ఎవరికీ ముఖం చూపించని వాడివి, నా మాటను మన్నించి నా ఎదుటికి వచ్చినందుకు చాలా సంతోషంగా వుంది......." అంటూ .

తనను చూసిన వాళ్ళందరూ తనెవరో బాగా తెలిసినట్లు రకరకాల పేర్లు పెట్టి మరీ పిలుస్తుంటే, తన ముఖం ఎవరికీ తెలియదన్నట్లు మాట్లాడుతున్న అతని అజ్ఞానానికి ఒకింత విస్తుబోయాడు షాడో.

అతిగా మాట్లాడకూడదని అంతకు ముందే నిర్ణయించుకొని వుండటం వల్ల పెదవి విప్పకుండా ఒక చిన్న చిరునవ్వును మాత్రం వెలువరించాడు.

భుజం మీద చేయి వేసి అతన్ని ఒక పెద్ద విశాలమైన గదిలోకి తీసుకుపోయాడు గనీఖాన్. అక్కడ వున్న సోఫాలో కూర్చోబెట్టి శాంబోతో మరో గదిలోకి పోయి రెండు నిముషాల తరువాత తిరిగి వచ్చాడు.

తనను గురించిన అభిప్రాయాలన్నిటినీ శాంబో అతని చెవిలో వూదటం జరిగిందని వెంటనే అర్థం అయిపోయింది షాడోకి.

అతను అనుకున్నట్లే మరో పద్ధతిలో సంభాషణను ప్రారంభించాడు గనీఖాన్.

"మా దేశంలో మాకు చేతకాని ఒక ప్రత్యేకమైన పనికోసం నిన్ను పిలిపించాను మై ఫ్రెండ్.... ఆ పనేమిటో నీకు తెలియచేసే ముందు అసలు నువ్వు పని చేసే విధానాలను ఒకసారి చూడాలని వుంది..... పది మంది శత్రువులు ఎదురైనప్పుడు నువ్వు ఏ ఆయుధంతో ఎదుర్కొంటావ్??" ఎదురుగా వున్న సోఫాలో కూర్చుంటూ మృదువుగా అడిగాడు.

ప్రమాదం ముంచుకు వచ్చినప్పుడల్లా, తన చేయి తనకు తెలియకుండానే బూటు ప్రక్కన బిగించి వున్న డాగర్ మీదికి పోవటం షాడోకి గుర్తుకు వచ్చింది.

ఆ సంగతి తెలిసే అతనలా ప్రశ్నిస్తున్నాడని అనుకుని , మెరుపులా డాగర్ ని బయటికి లాగాడు . లాగుతూనే అండర్ హేండ్ త్రోలో ముందుకు విసిరాడు.

అందమైన వెండి పళ్ళెంలో రకరకలా పళ్ళను, ఫలహారాలను నింపుకొని ఆ గదిలోకి వస్తోంది ఒక పరిచారిక.

గిర్రున తిరుగుతూ పోయి, పళ్లెంలో వున్న ఒక యాపిల్ పండులో దిగబడింది డాగర్.

కెవ్వున అరిచి పళ్ళేన్ని వదిలి వెనక్కి పరిగెత్తుతున్న ఆ పరిచారికను చూసి పకపకా నవ్వాడు గనీఖాన్.

"వెల్ డన్ మై ఫ్రెండ్.... వెరీ వెల్ డన్.... కత్తులు కటార్లు ఒకే ఒక మనిషిని ఎదుర్కోవటానికి మాత్రమే పనికి వస్తాయి. నీకు ఇతర ఆయుధాల్ని

వాడటం అంటే ఇంట్రెస్ట్ లేదా? లేక....." అంటూ మాటను మధ్యలోనే వదిలేశాడు సాభిప్రాయంగా చూస్తూ.

ఇతర ఆయుధాలు ఉపయోగించటం తనకు చేత కాదనే వుద్దేశ్యం అతనికి కలుగుతున్నదేమో అనే అనుమానం షాడోకి కలిగింది.

అరిచేతుల్ని పాంటుకేసి తుడుచుకుంటూ లేచి, యాపిల్ పండుతో పాటు క్రింద పడిన డాగర్‌ని చూసి రెండు అంగల్లో ఒక గోడ దగ్గిరి టేబిల్‌ని సమీపించాడు.

అంతకు ముందే నీట్‌గా క్లీన్ చేసి ఆ టేబిల్ మీద పెట్టబడి వుందొక పాయింట్ ఫార్టీ ఫోర్ కాలిబర్ రివాల్వర్.

దాన్ని చేతుల్లోకి తీసుకొని గిర్రున వెనక్కి తిరిగాడు..... తిరుగుతూ ట్రిగ్గర్‌ని ప్రెస్ చేశాడు.

ధన్ ధన్ ధనాధన్ మని వికృత శబ్దాలు చేస్తూ నిప్పులు కక్కింది రివాల్వర్.

గనీఖాన్ తల ప్రక్కనుంచి పోయి ఒక గోడలో దిగబడ్డాయి రెండు బుల్లెట్లు. దూరంగా నిలబడిన శాంబో చెవికి పావు అంగుళం దూరంలో నుంచి వెళ్ళి ఒక కిటికీ అవతల పడ్డాయి మరో రెండు.

ఎయిమ్ తీసుకోవటానికి ఎటువంటి ప్రయత్నము చేయకుండా, ప్రపంచంలో ఏ ఏజెంట్ అంతవరకూ చేయని ఒక విచిత్రమైన ఫీట్‌ని చేశాడు షాడో.

ఎడమ కాలిని వెనక్కి జరిపి, కుడి కాలి మీద వంగుతూ రివాల్వర్ బారెల్ని ఆ గది మూలకేసి గురిపెట్టాడు.

గుండెలు జలదరించే శబ్దంతో ప్రేలిందది ఒకే ఒకసారి.... గోడ మూలకు తగిలి షార్ప్‌గా రిఫ్లక్ట్ అయింది బుల్లెట్.....

రెండు అంగుళాల పొడవున్న పుల్లనొకదాన్ని నోటిలో పెట్టుకుని నములుతున్నాడు శాంబో..... అసలు ఏం జరుగుతున్నదో అతనికి అర్థం కాకముందే సూటిగా పోయి ఆ పుల్లను మధ్యకు విరిచేసింది రిఫ్లక్స్ యాక్షన్‌లో బయలుదేరిన బుల్లెట్.

అది ఒక పావు అంగుళం యివతలకు జరిగి తన నోటికి తగిలినట్లయితే ఏ జరిగేదో వూహించుకునేసరికి జ్వరం వచ్చినట్లు కంపించిపోతూ వెనక్కి దూకి నేల మీద చతికిల బడ్డాడు శాంబో.

పొగలు వెలువరుస్తున్న రివాల్వర్‌ని టేబిల్ మీద పెడుతూ తన వంక చూసిన షాడోని సమీపించి కౌగలించుకున్నంత పని చేశాడు గనీఖాన్.

"ఎక్సలెంట్ అనే పదం కూడా సరిపోదు మై ఫ్రెండ్ నీ చాతుర్యానికి..... ఇటీజ్ సింప్లీ ఫెంటాస్టిక్...... రిఫ్లక్స్ అయిన బుల్లెట్లను యిష్టం వచ్చిన చోటికి పంపగలవాళ్ళను నేను యింతవరకూ చూడలేదు.... అసలా పని చేయగలవాళ్ళు భూమి మీద వున్నారని కూడా వినలేదు... సూపర్బ్ మై ఫ్రెండ్...... ఇటీజ్ రియల్లీ సూపర్బ్.... " అంటూ మెచ్చుకున్నాడు.

అక్కడి నుంచి పారిపోయి, ఎవరూ లేని ఏకాంత ప్రదేశంలో కూర్చుని, తనని గురించి, తన ఎబిలిటీస్‌ని గురించి ఒకసారి ఆలోచించుకోవాలన్న కోరికను అదిమి పట్టుకొని తల వూపాడు షాడో.

అవసరం అయినప్పుడల్లా డాగర్ మీదికే చేతులు పోవటం వల్ల, అదే తన ఫేవరేట్ ఆయుధం అని అనుకున్నాడు తను..... రివాల్వర్‌ని చేతుల్లోకి తీసుకోగానే డాగర్ మాదిరిగానే దాన్ని కూడా ఎక్కువగా ఉపయోగించిన ఫీలింగ్ కలిగింది. ఆ ఫీలింగ్‌లో యదార్ధం ఉన్నదో లేదో తెలుసుకోవటానికే యిష్టం వచ్చినట్లు ప్రయోగించాడు దాన్ని. అనుకున్న పద్ధతిలో అనుకున్న ప్రదేశానికి కరెక్ట్‌గా పంపగలిగాడు బుల్లెట్లని. రివాల్వర్ తన ఫేవరెట్ ఆయుధమా ?

అయితే – డాగర్ మాదిరిగా రివాల్వర్‌ని అందుబాటులో ఉంచుకోలేదెందుకని??

"వెరీగుడ్ మై డియర్ పీటర్ ఆలీ..... ఇక ఇటువంటి చిన్ని చిన్ని పరీక్షలతో, ప్రయోగాలతో టైం వేస్ట్ చేయకుండా అసలు విషయంలోకి వద్దాం......." అంటూ చప్పట్లు చరిచాడు గనీఖాన్.

వెంటనే ఆ గదిలో ప్రత్యక్షం అయ్యారు నలుగురు సర్వెంట్స్ .

"బిజినెస్ వ్యవహారాలు మాట్లాడే ముందు గొంతు తడుపుకోవటం నా ఆచారం....... మన వద్ద వున్న వైన్స్ అన్నిటిలోను అమూల్యమైన వాటిని తీసుకు రండి...... రిఫ్లక్స్ యాక్షన్‌తో టార్గెట్స్ ని ఛేదించగల మొనగాడు మనతో చేతులు కలుపుతున్న శుభసందర్భాన్ని ఘనంగా సెలెబ్రేట్ చేసుకోవాలి ....." సగర్వంగా ఆజ్ఞాలు జారీ చేశాడు గనీఖాన్.

క్షణాల మీద తీసుకురాబడందా గదిలోకి, వెండి తొడుగులతో అలంకరించబడిన ఒక అందమైన డైనింగ్ టేబిల్... వెల్వెట్ కుషన్స్ కలిగిన సీట్లు దాని ముందు చేయబడ్డాయి.

ఖరీదయిన వైన్ బాటిల్స్, రుచికరమైన స్నాక్స్ బంగారు పళ్ళేరాలలో డైనింగ్ టేబిల్ మీదికి చేర్చబడ్డాయి.

"కమాన్ మై ఫ్రెండ్...... లెటజ్ డ్రింక్ ఫర్ అవర్ బిజినెస్ రిలేషన్ షిప్...." అంటూ వైన్ గ్లాసును ఎత్తి షాడో వైపు తిరిగాడు గనీఖాన్.

తన చేతికి వచ్చిన గ్లాసును అందుకుంటూ ఎందుకో ఎదుట పదిగజాల దూరంలో వున్న కిటికీ కేసీ చూశాడు షాడో.

చూసిన మరుక్షణం గ్లాసును అవతలికి విసిరి కొట్టి ఒక్కసారిగా గాలిలోకి ఎగిరాడు.

"మైగాడ్! ఏమయింది? ఏమయింది మై ఫ్రెండ్? ఏమిటది??" ఆందోళనగా ప్రశ్నిస్తూ కుర్చీలో నుంచి లేచాడు గనీఖాన్.

అతను లేచి నిలబడేసరికి డైనింగ్ టేబిల్ మీది నుంచి అవతలికి దూకి, మరోసారి జంప్ చేస్తూ కిటికీని సమీపించాడు షాడో.

అతనికి తెలియకుండానే స్తంభించింది ఊపిరి. కడుపు నరాలను బిగతీస్తూ నాభి కమలం దగ్గిర్నించి బయలు దేరిందొక శబ్దం....... కంఠంలోని కండరాల్ని విపరీతమైన బాధకు గురిచేస్తూ పెదవుల్ని దాటింది ఆ గది దద్దరిల్లి పోయేటట్లు.

శబ్దంతో పాటు కదిలింది అతని కుడి పాదం. కంటికి కనిపించినంత వేగంతో కిటికీ మధ్యలో వున్న ఉడెన్ బార్ ని తాకింది.

పాతిక పౌండ్ల ఇనుప సమ్మెటతో బలంకొద్దీ బాదినట్లు కిరకిరలాడుతూ మధ్యకు విరిగి పోయింది అది. చుట్టూ ఉన్న ఊచలతో పాటు ఊడి అవతలి ప్రక్కకు పడిపోయింది.

ఆ ఖాళీలో నుంచి అవతలకు చూశాడు షాడో.

అతను టేబిల్ మీది నుంచి ఎగరటాన్ని గమనించి వడి వడిగా ఇంకో గదిలోకి పరిగెత్తుతున్నాడు గనీఖాన్ అనుచరుడొకతను.

పగబట్టిన పాములా తన వెనుక ప్రత్యక్షం అయిన షాడోని గమనించి, పళ్ళు కొరుకుతూ బయటికి తీశాడు దుస్తుల్లో వున్న రివాల్వర్‌ని.

రివాల్వర్‌తో సహా ఆ చేతిని పట్టుకొని మధ్యకు విరిచేశాడు షాడో. సిమెంట్ బస్తాను ఎత్తినట్లు అమాంతం అతన్ని గాలిలోకి ఎత్తి ఒక గోడ కేసి కొట్టాడు.

కీచుగా అరిచి క్రిందికి జారిపోయాడా వ్యక్తి. చలిమిడి ముద్దలా నేలకు అతుక్కుపోయాడు.

కిటికీని బ్రద్ధలు కొట్టే సమయంలో షాడో వెలువరించిన సింహనాదాన్ని భరించలేక చెవులు మూసుకున్న గనీఖాన్ తెప్పరించుకొని ఆ గదిలోకి వచ్చేసరికి, నేలను కౌగలించుకున్న ఆ వ్యక్తి మీదికి ఇంకోసారి లంఘించి పైకి లేవబోతున్నాడు షాడో.

"నా సర్వెంట్స్ అందరిలోకి అత్యంత సమర్దుడు యితను.... ఆగు మై ఫ్రెండ్...... కొంచెం ఆగి, అసలు విషయం ఏమిటో చెప్పు....." అంటూ అతన్ని అడ్డుకున్నాడు గనీఖాన్.

"ఇటువంటి సర్వెంట్స్‌ని నమ్ముకొంటే నీ గతి కుక్కలు నక్కలు కూడా చూడవు..... నమ్మకం నటిస్తూ యితను ఏం చేస్తున్నాడో చూడండి....." పడిపోయిన వ్యక్తి షర్టును పట్టుకొని సర్రున చించుతూ అన్నాడు షాడో.

చిరిగిపోయిన షర్టు వెనుక నుంచి దబ్ మని శబ్దం చేస్తూ క్రింద పడిందొక మినీ టేప్ రికార్డర్.

చటుక్కున ముందుకు వంగి దాన్ని పరిశీలించి చూశాడు గనీఖాన్ వెనుకే అక్కడికి వచ్చిన శాంబో.... ముందుకు జరిగిన టేప్‌ని రివైండ్ చేసి ఆన్ బటన్‌ని నొక్కాడు.

షాడో ఆ భవనంలో అడుగు పెట్టి గనీ ఖాన్‌ని కలుసుకున్న క్షణం నుంచి జరిగిన సంభాషణ మొత్తం టేప్ చేయబడింది..... కత్తి విసురు, పరిచారిక అరుపు, రివాల్వర్ మ్రోతలు అన్నీ క్లియర్ కట్‌గా ఎక్కించబడ్డాయి అందులోకి.

"నమ్మకస్తుడివని నా సమీపంలో వుంచుకున్నందుకు తగినట్లు బుద్ధి చెప్పావు...... నీ వంటి విశ్వాస హీనులకు మరణమే సరయిన మందు......" ఎర్రబడిన కనులతో అంటూ శాంబోవైపు తిరిగాడు గనీఖాన్.

టేప్ రికార్డర్‌ని అవతల పెట్టి ఆ వ్యక్తి మీదికి వంగాడు శాంబో.

వెంటనే అతని భుజాల్ని పట్టుకొని బలవంతంగా వెనక్కి నెట్టాడు షాడో.

"ఏమిటిది మై ఫ్రెండ్? ఏం చేస్తున్నావ్ నువ్వు?" చర్రున అతని కేసి తిరుగుతూ ప్రశ్నించాడు గనీఖాన్.

"అనవసరమైన ఆవేశంలో పడి మీరు తప్పులు చేయకుండా అడ్డుకుంటున్నాను. మీ రహస్యాల్ని సేకరించి ఏదో చేయాలన్న ఆలోచన ఇతనికి స్వయంగా కలిగిందని నేను అనుకోను..... ఇతని వెనుక ఇంకెవరయినా వున్నారేమో తెలుసుకోకుండా తొందరపడటం మంచిదా??" ఎదురు ప్రశ్న వేశాడు షాడో.

ఆ ప్రశ్నలోని దూరదృష్టిని వెంటనే మెచ్చుకున్నాడు గనీఖాన్.

"యువార్ కరెక్ట్ మై ఫ్రెండ్..... ఆవేశం నా బుద్ధిని మందగింప చేసింది....." అంటూ ఇంకోసారి శాంబో వైపు చూశాడు.

తనను వెనక్కి నెట్టిన షాడో కేసి కొరకొరా చూస్తున్నాడు శాంబో. గనీఖాన్ తన వైపు తిరగ్గానే యాక్షన్ లోకి దిగిపోయాడు.

పడిన చోటి నుంచి కదలకుండా, మూసుకున్న నోటిని తెరవకుండా రాతి బొమ్మలా కూర్చున్న ఆ వ్యక్తిలో వెంటనే వచ్చింది చలనం. అతని అరుపులతో ఆ గది గోడలు దద్దరిల్లి పోసాగాయి.

అతని జుట్టు పట్టుకొని పిడికిటి పోట్లతో యిష్టం వచ్చినట్లు పొడిచి, పొడిచి , వెనక్కి తగ్గాడు శాంబో పది నిముషాల తరువాత .

ముక్కల వెంట, చెవుల వెంట వెలువడుతున్న రక్తపు ధారల్ని చేతులతో తుడుచుకుంటూ వెల్లికిలా పరుండి పోయాడా వ్యక్తి గది గచ్చు మీద. బాధా

సూచకమైన అరుపులు తప్ప ఒక్క మాట కూడా బయటికి రాలేదు అతని నోటి వెంట.

"వీడు ఇటువంటి దెబ్బలకు దారిలో పడదు..... అంగుళం అంగుళం చొప్పున కాళ్ళు చేతులు కత్తిరిస్తే అప్పుడు పెదవులు విప్పుతాడు......." అంటూ ప్రక్క గదిలోకి పోయి ఒక పెద్ద కత్తితో తిరిగి వచ్చాడు శాంబో.

మరోసారి అతన్ని ఆపేశాడు షాడో.

కత్తిని క్రిందికి దించుతూ గనీఖాన్ వైపు చూశాడు శాంబో.

షాడో కంట పడకుండా ఆగమని సైగ చేశా డతనికి గనీఖాన్.

ఆ విషయాలను గమనించలేదు షాడో.

"ఆఖరిసారిగా అడుగుతున్నాం మై ఫ్రెండ్.... నిన్ను ఈ పనికి పురిగొల్పింది ఎవరో చెపుతావా చెప్పవా?" వెల్లికిలా పడి వున్న వ్యక్తి ముందు మోకరించి కూర్చుంటూ ప్రశ్నించాడు.

"ఎవరూ పురికొల్పలేదు.... నేనే చేశాను..... ఇందులో ఎవరి ప్రమేయము లేదు...." తల ప్రక్కకు తిప్పుకుంటూ అన్నాడతను.

ఆ మాట అతని నోటి వెంట వెలువడిన మరుక్షణం, అతని కుడి కాలి చీల మండను కుడిచేత్తో పట్టుకున్నాడు షాడో. ఎడమ చేతి వేళ్ళతో కుడి మోచేతిని చుట్టి నెమ్మదిగా నొక్కటం మొదలు పెట్టాడు.

రెండు నిముషాల పాటు ఎటువంటి చలనము కనిపించ లేదు ఆ వ్యక్తిలో..... రెండు నిముషాలు గడిచి మూడో నిముషం అడుగు పెడుతుండగా ప్రారంభం అయింది భయంకరమైన బాధ.

ఐదో నిముషం అరుగు దెంచేసరికి మంద్ర గబ్బలు తన కాళ్ళు చేతుల్ని పట్టి పీకుతున్న దారుణమైన కేకలు పెడుతూ ఎగిరెగిరి పడసాగాడు.

మరో అర నిముషం తరువాత చేతుల్ని తీసేశాడు షాడో.

"చెప్పు బ్రదర్.... అసలు విషయం చెప్పి ఈ బాధ నుంచి విముక్తి పొందు....." అన్నాడు మృదు స్వరంతో.

పెద్ద బక్కెట్‌తో నీళ్లు ముఖం మీద చల్లినట్లు చెమటలతో తడిసి పోయిందా వ్యక్తి ముఖం.

"నాకు.... నాకు.... డబ్బు యిచ్చాదు..... చెప్పినట్లు చేయకపోతే నా కుటుంబాన్ని సర్వనాశనం చేస్తామని బెదిరించారు..... డబ్బుకు ఆశపడి వారి చేతుల్లో చిక్కాను..... నా కుటుంబాన్ని కూడా ప్రమాదంలో యిరికించాను......" గద్గద స్వరంతో అన్నాడతను.

తన వంక కోరగా చూసిన వారందర్నీ పిడికిటి పోట్లతో నలగగొట్టటమే తన జీవిత ధ్యేయం అనుకుంటున్న షాడో హృదయం ఒక్కసారిగా ఏదో తెలియని అనుభూతితో ద్రవించి పోయింది ఆ మాటల్ని వినగానే.

"నీకు నీ కుటుంబానికి వచ్చిన ప్రమాదం ఏమీ లేదు..... వాళ్ళు ఎవరో, ఎక్కడ వుంటారో చెప్పు......" సిన్సియర్‌గా అన్నాడు అతని ముఖంలోకి చూస్తూ.

రెండో ఆలోచన లేకుండా పెదవులు పూర్తిగా విప్పేశాడు ఆ వ్యక్తి.

తన ఇంట్లోనే మకాం పెట్టారట వాళ్ళు.....తను ఇంటికి వెళ్ళేదాకా అక్కడే వుంటారట......

ఆ మాటల్ని వినగానే అతని చేతులు పట్టుకొని లేపి నిలబెట్టాడు షాడో.

అతని ఉద్దేశ్యాన్ని అర్ధం చేసుకొని చప్పట్లు చరిచాడు గనీఖాన్.

పరుగు పరుగున వచ్చిన పది మంది అనుచరులకు బందీని చూపించి వాళ్ళు చేయాల్సిన పనిని వివరించాడు.

శాంబో ముందు దారి తీస్తుండగా రెండు కార్లలో బయలు దేరి పోయారు వాళ్ళు. అరగంట తరువాత తిరిగి వచ్చారు ఒక గుంపును వెంట బెట్టుకొని.

గోడవున్‌లో తనను కుర్చీలో కూర్చోబెట్టి చిత్రహంసలు పాలు చేయటానికి ప్రయత్నించిన ధృడకాయులు నలుగురూ ఆ గుంపులో వుండటాన్ని చూసేసరికి ఆశ్చర్యంతో విజిల్ వేశాడు షాడో. వారితో పాటు తీసుకురాబడింది ఒక అందమైన యువతి. విజిల్ వేస్తున్న షాడో ముఖం మీద చాచి పెట్టి కొట్టటానికి ప్రయత్నించింది.

చటుక్కున తల వంచుకొని ఆ దెబ్బనుంచి తప్పించుకున్నాడు షాడో.

"నిన్ను ఎక్కడో చూసినట్లు అనిపిస్తోంది బేబీ.... నీ ముఖం బాగా సుపరిచితమైనది గానే అగుపిస్తోంది....." అన్నాడు ఆమె చేతిని వెనక్కి విరిచి పట్టుకుంటూ.

బందీలను తీసుకొని శాంబో బంగ్లాలోకి రావటాన్ని చూసిన వెంటనే ఇంకో గదిలోకి పోయి ఒక కవర్‌ని తీసుకు వచ్చాడు గనీఖాన్. అందులోని ఫోటోలను కొన్నింటిని షాడోకి చూపించాడు.

తన ఎదుట వున్న ధృడకాయుల ముఖాలు ఆ యువతి వదనం ఆ ఫోటోలలో వుండటాన్ని గమనించి అయోమయంగా నొసలు ఎగురవేశాడు షాడో.

"పూనీ ఏరియాలో వున్న భారతీయ గ్రామాల్ని ఆక్రమించుకొని, అక్కడ భూ గర్భంలో నిక్షిప్తమై వున్న ఆయిల్ వనరుల్ని స్వంతం చేసుకోవటమే నా లక్ష్యమని ఒక నీలివార్తను పుట్టించాను.....మన శత్రువులు అందరూ ఆ వార్తను నమ్మి కాళ్ళు విరగద్రొక్కు కుంటున్నారు..... అందుకు సాక్ష్యం వీళ్ళే మై ఫ్రెండ్.... ఈ పథకాన్ని నాశనం చేయటానికి భారతదేశం నుంచి వచ్చిన ఇండియన్ స్పెషల్ డిటెక్టివ్‌లు........" సంతోషంగా అన్నాడు గనీఖాన్.

ఇండియన్ స్పెషల్ బ్రాంచి అనే మాటను కూడా ఎక్కడో విన్నట్లు ఆనిపించి తల బరుక్కున్నాడు షాడో.

"వీళ్ళని తీసుకు పోయి మన అండర్‌గ్రౌండ్ సెక్యూరిటీ సెల్స్‌లో బంధించండి..... వీళ్ళ సంగతి తర్వాత ఆలోచిద్దాం....." తన అనుచరులకు ఆజ్ఞ యిచ్చాడు గనీఖాన్.

నిప్పులు కక్కుతున్నట్లు చూస్తున్న స్పెషల్ బ్రాంచి డిటెక్టివ్స్‌ని అవతలికి లాక్కుపోయారు కొందరు అనుచరులు.

గనీఖాన్ సంభాషణను టేప్ చేయటానికి ప్రయత్నించిన వ్యక్తి. అతని కుటుంబ సభ్యులు అక్కడ మిగిలారు.

"మన ఉప్పు తిని మనకే ద్రోహం తల పెట్టిన వీరందర్ని ఖతమ్ చేసేయండి....." ఖంగుమంటున్న కంఠంతో అన్నాడు గనీఖాన్.

నాలుగేళ్ళ పసిపిల్ల, పదేళ్ళ బాలుడు వున్నారు ఆ కుటుంబంలో.... విపరీతమైన భయంతో గజగజా వణికిపోతోంది ఆ వ్యక్తి భార్య.

అంతకు ముందు ఆ వ్యక్తిని హింసించటానికి తెచ్చిన కత్తిని మరోసార అందుకొని ముందుకు అడుగు వేయబోయిన శాంబోని మళ్ళీ అడ్డుకున్నాడు షాడో.

"నిజం చెపితే ఎటువంటి హానీ కలుగదని అన్నాం ఇందాక..... ఆ మాటను విస్మరించి చెడుపు చేయటం బాగుంటుందా ?" గనీఖాన్ వైపు తిరుగుతూ ప్రశ్నించాడు.

"నువ్వేం మాట్లాడుతున్నావో నీకు అర్థం అవుతోందా? మనల్ని వెన్నుపోటు పొడవటానికి ప్రయత్నించిన వీడిని ప్రాణాలతో వదిలేయాలా??" ఆశ్చర్యంగా అడిగాడు గనీఖాన్.

"వదిలేస్తామని అనబట్టేగదా ఇతను ఆ ఏజెంట్ల రహస్యాన్ని బయట పెట్టింది.... ఇప్పుడు మాట తప్పితే వెన్నుపోటు పొడిచేది మనమే అవుతుంది కదా!!"

"నథింగ్ డూయింగ్ మై ఫ్రెండ్.... వీడు సకుటుంబంగా ఖతమ్ అయిపోవాల్సిందే.... క్షమించే ప్రసక్తి లేదు......" ఖండితంగా అన్నాడు గనీఖాన్.

అతనా మాట అనగానే కదిలాడు శాంబ.... దగ్గిర్లో వున్న నాలుగేళ్ళ పసిపిల్ల మీదికి కత్తిని విసరబోయాడు.

తను ఏం చేస్తున్నాడో తనకే తెలియని ఒక విచిత్రమైన పరిస్థితిలో చిక్కుపడుతూ ఎగిరి అతని ముందుకు దూకాడు షాడో. క్రిందికి వాలబోతున్న కత్తికి తన చేతిని అడ్డం పెట్టి మోకాలితో బలంగా పొడిచాడు అతని తొడల మీద.

తొడ ఎముకలు విరిగిపోయినంత బాధ మనస్సును ఆవరించుకుంటుండగా వెనక్కి తూలాడు శాంబో.

ఇండియన్ స్పెషల్ బ్రాంచి ఏజెంట్లను బంధించి తీసుకురావటానికి పోయిన గనీఖాన్ అనుచరుల్లో నలుగురు అక్కడే వున్నారు. శాంబో వెనక్కి పడటాన్ని గమనించే సరికి, తమ పాంటు జేబుల్లో నుంచి రివాల్వర్లను బయటికి తీశారు వాళ్ళు.

చేయెత్తి వారిని ఆపాడు గనీఖాన్.

"డబ్బు యిస్తే ఎటువంటి పని అయినా చేసే మెర్సిలెస్ కిల్లర్‌వి నువ్వు..... నీ వృత్తికి విరుద్ధంగా ప్రవర్తించటం దేనికి? ముక్కు ముగం తెలియని ఈ ట్రెయిటర్స్ మీద నీకు ఇంత అభిమానం ఎందుకు?" షాడో ముఖంలోకి సూటిగా చూస్తూ ప్రశ్నించాడు.

ఆలోచించటం ప్రారంభించాడు షాడో.

డబ్బు యిస్తే ఎటువంటి దారుణమైన పని అయినా కళ్ళు మూసుకొని చేసేయగల మెర్సిలెస్ కిల్లరట తను !

ఆ దారుణమైన పనులేమిటో గాని ఒక్కటి కూడా తను చేయలేదు ఇంత వరకూ!! పై పెచ్చు సెంటిమెంటల్ ఆలోచనలు అనేకం వాటికనే వచ్చేస్తున్నాయి.

ఎందుకని ??

ఎటువంటి డిఫికల్ట్ సిచ్యుయేషన్స్ లోనయినా శరవేగంతో ఆలోచించి సమాధానాలు సమకూర్చగల అతని బ్రెయిన్ , ఆ క్లిష్ట పరిస్థితిలో కూడా వెంటనే రెడీ చేసింది చక్కటి జవాబుని.

డబ్బు! డబ్బు!!

డబ్బు యిస్తే కదా తను అటువంటి పనులు చేసేది?

మరి ఇంతవరకూ ఎవరూ ఆ డబ్బును ఇవ్వలేదు కదా!!

డబ్బును చూడకుండా, తీసుకోకుండా నేరాలు చేయటం, నేరాలు చేస్తుండగా చూడటం తప్పు కదా !!!

"శహభాష్ మై ఫ్రెండ్...... యువ్వార్ ఎక్సలెంట్ అండ్ ఎఫిషియంట్...." అతని సమాధానాన్ని విని ఆనందంగా మెచ్చుకున్నాడు గనీఖాన్.

" నీ కోరిక నేను తీరుస్తాను.... నీకు సంతృప్తి కలిగే విధంగా ఏర్పాటు చేస్తాను..... అంత వరకూ ఇటువంటి చిన్న చిన్న విషయాలతో ఆపూర్వమైన నీ మేధస్సును చికాకు పరచకు..... "అంటూ సైగ చేశాడు తన అనుచరులకు.

షాడో కొట్టిన దెబ్బకు పోటెత్తి పోతున్న తొడల్ని రుద్దుకుంటూ కోరగా చూస్తున్న శాంబో ఏదో అనటానికి నోరు తెరిచాడు. గనీఖాన్ ఉరిమి చూసేసరికి తల వంచుకొని అక్కడి వారందర్నీ వెంట బెట్టుకొని అండర్‌గ్రౌండ్ సెక్యూరిటీ సెల్స్ వైపు వెళ్ళిపోయాడు.

తన చేతుల్లో వున్న కవర్‌ని తీసి అందులోని మరో రెండు ఫోటోల్ని షాడోకి చూపించాడు గనీఖాన్.

గోడవున్‌లో తనను రాజూమియా రాజూమియా అనిపిలిచి, ముక్కు ముగం ఏకం చేయటానికి ప్రయత్నించిన అందమైన యువతి, ఆమె సహచరుల్లో లావుపాటి వ్యక్తి ముఖాలు ఆ ఫోటోల్లో కనిపించి ఉలికిపాటును నేర్పుగా కప్పి పెట్టుకున్నాడు షాడో.

"వీళ్ళను నా దారినుంచి తొలగించటం కోసం నిన్ను పిలిపించాను పీటర్ ఆలీ...... మా పాకిస్థాన్ స్పెషల్ బ్రాంచిలో అమితమైన పేరు ప్రఖ్యాతలు కల ఏజెంట్లు వీళ్ళు..... ఆవలిస్తే ప్రేవులు లెక్క బెట్టగల మేధావులు....." ఫోటోల్ని చేతుల్లో తిప్పుతూ అన్నాడు గనీఖాన్.

"నేను ప్రచారం చేసిన నీలివార్తను నమ్మి నా అంతు చూడటానికి వచ్చిన ఇండియన్ ఏజెంట్లను క్షణంలో పట్టిచ్చిన నువ్వు నా చెంత వుండగా వీళ్ళని గురించి ఇక ఆలోచించ వలసిన అవసరం నాకు లేదు....." అంటూ ఆ ఫోటోల్ని చించి ఒక మూలకి విసిరేశాడు.

"ఇప్పుడు మనం ఒక స్నేహితుడి దగ్గిరికి పోదాం.... అక్కడ నువ్వు చేయాల్సిన మరో ముఖ్యమైన పనిని గురించి చెపుతాను..... నీకు కావాల్సిన డబ్బును కూడా అక్కడే యిప్పిస్తాను......." ఆ గదిలో నుంచి బయటికి దారి తీస్తూ చెప్పాడు.

ఆ మాటల్ని అర్ధం చేసుకోవటానికి ప్రయత్నిస్తూ అతన్ని వెంబడించాడు షాడో.

# 16

లావుపాటి సిగార్‌ని వెలిగించుకొని తన గదిలో నిలబడి వున్న కల్నల్ షా ఆలం సడన్‌గా ప్రత్యక్షం అయిన గనీఖాన్‌ని గమనించి ఆశ్చర్యంతో నోరు తెరిచాడు.

గనీఖాన్ వెనుకే బుద్ధిమంతుడిలా అడుగులు వేస్తూ వచ్చిన షాడోని చూసేసరికి మాయం అయింది ఆ ఆశ్చర్యం..... అనుమానంతో ముడి పడ్డాయి అతని కనుబొమలు.

"మన వారందర్నీ పిలిపించండి కల్నల్ సాబ్..... ఆపరేషన్ గోల్డెన్ రోబ్ స్టార్ట్ కాబోతున్నది.... కమాన్ ...... హర్రీ అప్......" అక్కడ వున్న ఒక కుర్చీలో కూర్చుంటూ అన్నాడు గనీఖాన్.

టేబిల్ మీద వున్న ఫోన్‌ని అందుకొని ఎవరెవరికో కబురు అందించాడు కల్నల్ షా ఆలం .....

అరగంట కూడా పూర్తిగా గడవక ముందే ఆ గదిలో సమావేశం అయ్యారు పాతిక మంది పాకిస్థాన్ మిలటరీ అధికారులు....

"మై డియర్ ఫ్రెండ్స్...... ఎప్పుడెప్పుడని మీరు ఎదురు చూస్తున్న సుదినం తరుముకుంటూ వచ్చేసింది ఇప్పుడు...." వారందర్నీ అడ్రస్ చేస్తూ అన్నాడు గనీఖాన్.

"ఈ దేశంలో ఇంత వరకూ ఎవరూ చేయలేని అపూర్వమైన అత్యంత ప్రమాదకరమైన పనిని చేయటానికి నిర్ణయించుకొని సరైన అవకాశం కోసం ఎదురు చూస్తున్నాం మనం......."

"రాజ్యాలను ఆక్రమించుకోవాలన్నా, సింహాసనాల్ని చేజిక్కించుకోవాలన్నా దారుణమైన మారణ హోమాలు చేయక తప్పదని మీ కందరికీ తెలుసు..... అటువంటి ఘాతుకచర్యలు చేసిన అనంతరం, చేజిక్కించుకున్న అధికారాన్ని

నిలబెట్టుకోవటానికి చాలా కష్టాలు పడవలసి వస్తుందని కూడా మీరు ఎరుగుదురు......."

"ఆ బాధ లేవీ లేకుండా రెండో కంటివాడికి తెలియకుండా ఈ పాకిస్థాన్ సింహాసనాన్ని అధిష్టించటం కల్నల్ షా ఆలం చిరకాల వాంఛ..... అతను గద్దెను ఎక్కిన తరువాత దేశంలో ఎవరయినా అసంతృప్తి పరులు తల ఎత్తితే వారిని కంట్రోల్ చేయటానికి మీరు, అందుకు కావల్సిన ధనసహాయం చేయటానికి నేను సిద్ధంగా వున్నామని కల్నల్ సాబ్‌కి ఎప్పుడో వాగ్దానం చేసి వున్నాం. ....."

మెచ్చుకోలుగా తలలు వూపారు గనీఖాన్ మాటల్ని శ్రద్ధగా వింటున్న మిలటరీ అధికారులు అందరూ.....

అప్పటి కప్పుడు పాకిస్థాన్ సింహాసనం తన కైవశం అయిపోయిన ఫీలింగ్ కలిగి రెండు అంగుళాలు విస్తరించింది కల్నల్ షా ఆలం ఛాతీ...... ఫట్ ఫట్ మని శబ్దం చేస్తూ తెగి క్రింద పడిపోయాయి అతని యూనిఫాం గుండీలు రెండు.

"ఇందాక నేను అన్నట్లు ఇంత వరకూ మన దేశంలో ఎవరూ చేయనటు వంటి అత్యంత ప్రమాదకరమైన ఈ పనిని సజావుగా సాధించగల మనిషి కోసం, అవకాశం కోసం ఎదురు చూస్తూ కాలక్షేపం చేస్తున్నాను నేను..... మిమ్మల్ని కూడా చేతులు ముడుచుకు కూర్చోమని బలవంతంగా ఆపుతున్నాను..... అందుకు మీలో కొందరు చిరాకు కూడా పడ్డారు......" మరోసారి అందుకున్నాడు గనీఖాన్.

అందుకు కూడా తలలు వూపారు మిలటరీ అధికార్లు.

"ఇంతకాలం తరువాత మనకు కావల్సిన మనిషి దొరికాడు మైడియర్ ఫ్రెండ్స్..... కల్నల్ షా ఆలం పాకిస్థాన్ అధ్యక్షుడిని కలిసి మాట్లాడటానికి వెళ్ళినప్పుడు తనతో తీసుకు పోతాడు యితన్ని....." షాడోని చూపిస్తూ అన్నాడతను.

"మాటల మధ్యలో ఏదో గుర్తుకు వచ్చినట్లు కల్నల్ సాబ్ బయటికి వచ్చేస్తాడు. అతను బయటికి వచ్చిన మరుక్షణం చుట్టూ వుండే అంగ రక్షకులతో సహా మన అధ్యక్షుడిని హతమారుస్తాడు ఈ పీటర్ ఆలీ..... పాకిస్థాన్ సంహాసనాన్ని పువ్వుల్లో పెట్టి మనకు అందిస్తాడు......"

"అధ్యక్షుడు హతమార్చ బడ్డాడని తెలియగానే మిలటరీ దళాల్లో అశాంతి తెలరేగకుండా చూసుకోవాలి మీరు.... ప్రజా జీవితంలో ఒడిదుడుకులు కలుగకుండా నేను చూసుకుంటాను.... మనందరి అండతో షా ఆలం పాకిస్థాన్ అధ్యక్షుడు అవుతాడు...... మన బంగారు కలలన్నిటినీ నిజం చేస్తాడు......."

"ఇటువంటి మహత్తర కార్యాన్ని చేయటానికి డబ్బు అడుగుతున్నాడు ఈ పీటర్ ఆలీ...... ఎంత ఇస్తే బాగుంటుందో ఎంత ముట్ట చెపితే ముచ్చటగా వుంటుందో మీరే నిర్ణయించండి....." అంటూ అసలు విషయాన్ని నీట్‌గా ప్రెజెంట్ చేశాడు వారందరికీ.

"అడగమనండి.... ఎంత కావాలో అతన్నే అడగమనండి.... ఇంత దూరం వచ్చిన తరువాత ముసుగులో గుద్దులాటలు దేనికి ?" అన్నాడు ఒక అధికారి.

ఆ మాటలకు అంగీకార సూచకంగా తలలు వూపుతున్న మిగిలిన వారందరి వంకా చిరునవ్వుతో చూసి షాడో వైపు తిరిగాడు గనీఖాన్.

ఎంత అడగాలో షాడోకి అర్ధం కాలేదు.... అర్ధంకాని పరిస్థితులు ఏర్పడినప్పుడు అమోఘంగా పని చేసే అతని అంతరంగం వెంటనే ఆదుకుంది అతన్ని.

"నా మీద నమ్మక ముంచి ఈ విషయాలు నాకు తెలియ చెప్పిన మీ ముందు నిలబడి బేరాలు సాగించటం నాకు యిష్టం లేదు. మీరే చెప్పండి....మీకు తోచింది మీరే యివ్వండి......" అన్నాడతను తడుముకోకుండా.

"శహభాష్ పీటర్ ఆలీ....... నీ రెప్యూటేషన్‌కి తగినట్లు మాట్లాడావు మరోసారి....." అంటూ కల్నల్ సాబ్ వైపు చూశాడు గనీఖాన్.

టేబిల్ సొరుగులో నుంచి పెద్ద బ్రీఫ్ కేసును తీసి అతనికి యిచ్చాడు షా ఆలం.

అక్కడ వున్న అధికారులు అందరూ చూస్తుండగా దాన్ని షాడో పరం చేశాడు గనీఖాన్.

అందులో వున్న నోట్ల కట్టల్ని చూసి ఆనందంగా తల వూపాడు షాడో.

ఏ డబ్బుకోసం తను కరుకు కసాయి మనిషని అందరి చేతా పిలిపించుకుంటున్నాడో ఆ డబ్బు తన చేతిలోకి వచ్చేసింది..... ఇక నిరభ్యంతరంగా మొదలు పెట్టవచ్చు తన దమన కాండ..... తన ఎదుటికి వచ్చిన వారందర్నీ ఖతం చేసి అవతల పారేయచ్చు....

అండర్‌గ్రౌండ్ సెల్స్‌లో బంధింపబడి వున్న వారందర్నీ చంపి తన డ్యూటీని ప్రారంభించమంటారేమో తెలుసుకోవటానికి గనీఖాన్ వైపు చూశాడతను.

"కల్నల్ షా ఆలం ఇంకొద్దిసేపు ఆగి పాకిస్థాన్ అధ్యక్షుడికి ఫోన్ చేస్తాడు...... రేపు సాయంకాలం చీకటి పడిన తర్వాత పర్సనల్‌గా మాట్లాడటానికి పర్మిషన్ తీసుకుంటాడు..... అంత వరకూ నువ్వు నీ హోటల్ గదిలో రెస్ట్ తీసుకోవచ్చు మై ఫ్రండ్......" అంటూ సైగ చేశాడు గనీఖాన్.

అంత వరకూ ఆ గది ద్వారం బయట నిలబడి వున్న శాంబో వెంటనే ముందుకు వచ్చి షాడో దగ్గిర నిలబడ్డాడు.

తన ప్రశ్నను తనలోనే దాచుకొని అతన్ని అనుసరించాడు షాడో. తన కోసం సిద్ధంగా వున్న కారులో హోటల్ మదీనాకు బయలు దేరాడు.

కారు మ్రోత దూరంగా వెళ్ళిపోయిన తర్వాత గనీఖాన్‌ని ప్రశ్నించాడు అంత వరకూ మౌనంగా వున్న ఒక మిలటరీ అధికారి –

"పాకిస్థాన్ అధ్యక్షుడిని తొలగించటం అంత తేలిక కాదు..... తొలగించిన తర్వాత ఈ మనిషి డబ్బుకు ఆశపడి మన విషయాల్ని బయటి ప్రపంచానికి తెలియ చేస్తే ప్రమాదంలో పడమా ?" అంటూ.

ఫక్కున నవ్వి అతని భుజం మీద తట్టాడు గనీఖాన్.

"అంత తెలివి తక్కువవాళ్ళం కాదు మై ఫ్రండ్ మన మందరం.... పని పూర్తి అయిపోయిన మరుక్షణం పీటర్ ఆలీని బంధించమని ఉత్తర్వులు జారీ చేస్తాడు కల్నల్ షా ఆలం.... ప్రజలందరూ చూస్తుండగా అతన్ని ఉరితీసి న్యాయాన్ని పరిరక్షిస్తాడు. " అంటూ వివరించాడు తన పథకాన్ని.

ఇంకో రెండు అంగుళాలు విస్తరించింది కల్నల్ షా ఆలం ఛాతీ...... ఫట్‌మని శబ్దం చేస్తూ ఎగిరిపోయాయి మరో రెండు బటన్స్.

"పీటర్ ఆలీ మీద నిందవేసి అతని నోటని శాశ్వతంగా మూసే మీ ఆలోచన బాగానే వుంది గనీఖాన్ సాబ్......" వెంటనే అందుకున్నాడు అక్కడ సమావేశమై వున్న వారిలో ఒక అధికారి. "అతి తెలివి చూపి అతను మొదటికే మోసం తెస్తే ఏం చేయాలి? మనం యిచ్చిన సొమ్ముతో పరార్ అయిపోతే మన గతి ఏమిటి?" అని ప్రశ్నించాడు.

"పీటర్ ఆలీ అటువంటి మనిషి కాదు మై ఫ్రండ్...... అయినా సరే ఏ మనిషినీ అతిగా నమ్మటం నాకు అలవాటు లేదు..... ఈ క్షణం నుంచి మన పని పూర్తి చేసేదాకా నీడలా అతన్ని వెన్నంటి వుంటాడు మా శాంబో.... హోటల్ మదీనాలో నుంచి అతన్ని ఒక్క అడుగు కూడా అవతలికి వేయనీయడు ....." సగర్వంగా చెప్పాడు గనీఖాన్ తను చేసిన ఏర్పాట్లను.

తనకు పట్టబోతున్న రాజయోగాన్ని తలుచుకొని మురిసిపోతూ, మద్యపానం తమ దేశాచారాలకు విరుద్ధమని తెలిసి కూడా ఖరీదయిన విదేశీ మద్యపు సీసాలను తెప్పించాడు కల్నల్ షా ఆలం..... తన సంతోషాన్ని సెలబ్రేట్ చేసుకోవటం మొదలు పెట్టాడు.

## 17

మసక చీకట్లు అబ్జీ సిటీని ఆవరించుకుంటుండగా నిద్రలేచి, బద్ధకంగా వళ్ళు విరుచుకుంటూ కారిడార్లోకి తొంగిచూశాడు షాడో.....

గదికి నాలుగు అడుగుల దూరంలో ఒక స్టూల్ మీద కూర్చుని వున్నాడు శాంబో. తలుపులు తెరిచిన సవ్వడిని వినగానే లేచి నిలబడ్డాడు.

"నిన్ను అనవసరంగా డిస్టర్బ్ చేసినందుకు క్షమించాలి..... ఏమీ తోచక తొంగి చూశాను..... అంతకు మించి పెద్ద కారణమేమీ లేదు. " అంటూ ఠక్కున తలుపుల్ని మూసి, ఒక సోఫాలో కూర్చున్నాడు షాడో.

గనీఖాన్ దగ్గిర్నించి హోటల్‌కి తిరిగి వచ్చిన క్షణం నుంచీ వెన్నంటే వుంటున్నాడు శాంబో...... వదిలి పెట్టి అవతలికి పోవటం లేదు.

"వీళ్ళ వరస చూస్తుంటే మన మీద పూర్తి నమ్మకం కలిగినట్లు కనిపించటం లేదు. ఇటువంటి అనుమానపు పక్షుల్ని చూస్తే నాకు అరికాలి మంట నెత్తికి ఎక్కుతుంది. వాట్ ఎబౌట్ యూ డియర్?" తనతో పాటు నిద్రలేచి అటూ యిటూ చూస్తున్న పిల్లి పిల్లను ప్రశ్నించాడు.

తనకు కూడా అటువంటి ఫీలింగ్సే కలుగుతున్నట్లు నోటిని యింత తెరిచి పెద్దగా ఆవలించిందది.

"వెరీ గుడ్ డియర్.... శుభ్రంగా స్నానం చేసి ఈ శాంబో గాడికి గుణపాఠం నేర్పే విషయం గురించి ఆలోచిద్దాం....." అంటూ బాత్ రూమ్ లోకి పోయాడు షాడో. తల మీద గాయం తడవకుండా జాగ్రత్త పడుతూ, బద్దకం తీరేదాకా బేతింగ్ టబ్‌లో కూర్చుని యివతలికి వచ్చాడు.

పిల్లి పిల్లతో పాటు వెంట బెట్టుకు తిరుగుతున్న ఎయిర్ బేగ్‌లో నుంచి మరో జత దుస్తుల్ని బయటికి తీసి వేసుకుంటుండగా కనిపించిందతనికి ఆ దృశ్యం.

బాత్ రూమ్ లోకి పోతూ తన బూట్లను సోఫా దగ్గిరే వదిలి పోయాడతను. కుడికాలి బూటును పట్టుకొని ఎలుక పిల్లను విదిలించినట్లు విదిలిస్తోంది పిల్లి పిల్ల.

ఆ అదటుకు దాని ప్రక్కన బిగించి వుండే డాగర్ జారి క్రింద పడిపోయింది.... ఒక్క డాగరే కాదు... బూటు మడమ కూడా లూజు అయినట్లు కదులుతోంది.

"స్టాపిట్.... స్టాఫ్ దట్ నాన్సెన్స్ డియర్....... బంగారం లాంటి ఆ బూట్లను నాశనం చేస్తే వట్టి పాదాలతో తిరగాల్సి వస్తుంది" కోపంగా అంటూ దాని నోట్లో నుంచి ఆ బూట్లను బలవంతంగా లాక్కున్నాడు.

అలా లాక్కుంటుండగా మరింతగా కదిలి, ప్రక్కకు తిరిగంది మడమ.....

మందపాటి లెదర్ ఉండాల్సిన ప్రదేశంలో చిన్న డొల్ల ఒకటి ప్రత్యక్ష్యం అయింది. ఆ డొల్లలో నుంచి జారి అతని చేతిలో పడ్డాయి మూడు మెటల్ బాల్స్.....

గోలీకాయల సైజులో వున్న ఆ మెటల్ బాల్స్ బూటులోకి ఎలా వచ్చాయో, వాటి ఉపయోగం ఏమిటో అర్థంకాక అయోమయంగా తల బరుక్కున్నాడు షాడో.

"చూడగా చూడగా మన గురించి మనకే తెలియని విషయాలు చాలా వున్నట్లు అనిపిస్తోంది డియర్.... గనీఖాన్ వంటి పెద్ద మనుష్యుల వద్ద పెద్ద పెద్ద మొత్తాల్లో డబ్బులు తీసుకొని హత్యలు చేయటమే కాకుండా, తీరిక సమయాల్లో చిన్న పిల్లలతో గోలీకాయలు ఆడుకునే అలవాటు కూడా మనకు వున్నట్లు

కనిపిస్తోంది....... " పిల్లి పిల్లతో అంటూ ఆ మెటల్ బాల్స్‌ని పాంటు జేబులో పడేసుకొని, ప్రక్కకు జరిగిన బూటు మడమను యధాస్థానానికి చేర్చాడు.

అతను ఎక్కడికో ప్రయాణం అవుతున్నట్లు గ్రహించి తను కూడా రెడీ అయిపోయింది పిల్లి పిల్ల...... అతని కంటే ముందుగా వెళ్ళి తలుపుల దగ్గిర నిలబడింది.

గనీఖాన్ యిచ్చిన బ్రీఫ్ కేసులో నుంచి నాలుగు నోట్ల కట్టల్ని కూడా పాంటు జేబులోకి నెట్టుకొని గది బయటికి వచ్చాడు షాడో.

వెంటనే లేచి నిలబడ్డాడు స్టూల్ మీద కూర్చుని వున్న శాంబో.

"నువ్వు హోటల్‌ని వదిలి ఎక్కడికీ పోకూడదని గనీఖాన్ సాబ్ అన్నారు..... ఏమైనా కావాలంటే హోటల్ స్టాఫ్ తెచ్చి పెడతారు. ......" షాడో దారికి అడ్డం నిలబడుతూ వెల్లడించాడు.

"గోలీకాయలు ఆడుకోవటానికి పోతున్నాను శాంబో...... ఈ హోటల్లో నాతో ఆ ఆట ఆడేవాళ్ళు దొరకరు...." జేబులో నుంచి ఒక బాల్‌ని తీసి అతనికి చూపిస్తూ అన్నాడు షాడో.

" ఏమిటిది? ఏదీ నన్ను చూడనీ?" అనుమానంగా అంటూ చేతిని జాచాడు శాంబో.

అతనికి యివ్వటానికి అన్నట్లు మెటల్ బాల్‌ని ముందుకు జరుపుతుండగా షాడో చూపుడు వేలికి తగిలింది దాని మీద వున్న చిన్న బుడిపె. అది ఎందుకుందో అర్థం కాకపోయినా, గట్టిగా దాన్ని ప్రెస్ చేసి, శాంబో చేతికి అందకుండా నేల బారున కారిడార్ చివరికి దొర్లించాడు షాడో.

చిన్న పిల్లడిలా కాళ్ళను జాచి దాన్ని అడ్డుకోవటానికి ప్రయత్నించాడు శాంబో.....

స్మూత్‌గా వున్న ఫ్లోరింగ్ మీద జర్రున జారుతూ అతని పాదాల్ని తప్పించుకొని పది గజాల దూరం వెళ్ళి పోయిందా మెటల్ బాల్.... పదకొండో గజంలోకి అడుగు పెడుతూనే దిక్కులు దద్దిరిల్లి పోయే శబ్దంతో బ్రద్దలైంది.

కనులు మిరుమిట్లు గొలిపే వెలుగు శాంబోని గుడ్డి వాడిని చేసేసింది పదిక్షణాల పాటు...... సుడులు తిరుగుతూ గాలిలోకి లేచిన నల్లటి పొగలు అతన్ని ఉక్కిరి బిక్కిరి కావించి నేల మీద పడేశాయి.

మెటల్ బాల్ కోసం అతను ప్రక్కకు తిరిగిన మరుక్షణం వెను తిరిగి ఎలివేటర్ వైపు పరిగెత్తటం వల్ల ఆ ఎఫెక్ట్స్ నుంచి రక్షింపబడ్డాడు షాడో.

అప్పటికీ ఆ చప్పుడు ఆ దృశ్యం అతన్ని నిశ్చేష్టుడిని చేసేశాయి....

"ఆటలాడుకునే గోలీలలో యింత పవరుంటుందని నేను అనుకోలేదు.... సరదా పడి మన గదిలోనే దాన్ని దొర్లించక పోవటం మన అదృష్టం..... ఏది ఏమయినా శాంబో పీడ ప్రస్తుతానికి విరగడ అయింది. కమాన్ బేబీ..... కమాన్ " అని పిల్లి పిల్లను పిలుస్తూ ఎలివేటర్లో క్రింది అంతస్థులోకి వెళ్ళిపోయాడు.

పై అంతస్థులోని ప్రేలుడు హోటల్ స్టాఫ్‌ని, ఇతర కస్టమర్స్ అందర్నీ ఆకర్షించింది. గుంపులు గుంపులుగా పైకి పోతున్నారు వారందరూ.

ఆ సందడి మధ్యలో, రిసెప్షన్ హాల్లో వున్న మరో యిద్దరు గనీఖాన్ అనుచరులుకు స్లిప్ యిచ్చేశాడు షాడో. పరుగులాంటి నడకతో హోటల్లో నుంచి బయటపడి ఒక టాక్సీ ఎక్కాడు.

" ఎక్కడికి పోవాలి సాబ్ ?" వెంటనే ప్రశ్నించాడు టాక్సీ డ్రయివర్.

"నీ ఇష్టం వచ్చిన చోటికి పోనీయ్..... ముందు ఇక్కడి నుంచి బయట పడితే అంతే చాలు......" ఎవరైనా తనను అనుసరిస్తున్నారేమోనని వెనక్కి చూస్తూ అన్నాడు షాడో.

ఆ మాట అననే అన్నాడని రెండు గంటల సేపు సిటీ అంతా తిప్పి, విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించబడిన ఒక పార్కు ముందు టాక్సీని ఆపాడు ఆ డ్రయివర్.

పాంటు జేబులో వున్న నోట్ల కట్టల్లో నుంచి నాలుగు నోట్లను తీసి అతని మీదికి విసిరేస్తూ క్రిందికి దిగబోయాడు షాడో.

"ఇంకో రెండు గంటలు తిప్పుతాను కదలకండి సార్..... మీ వంటి కస్టమర్స్ సంవత్సరానికి ఒకళ్ళు తగిలితే చాలు సార్..... మా దరిద్రం తీరి పోతుంది. కూర్చోండి సార్.. ..." అంటూ టాక్సీని ముందుకు అదిలించబోయాడు డ్రయివర్.

ఇంకో రెండు నోట్లను తీసి అతని మీదికి విసురుతూ, టాక్సీ దిగిపోయాడు షాడో. అతని మాటల్ని వినిపించుకోకుండా పార్కులోకి పోబోయాడు.

"సార్... సార్..." అంటూ అతని వెనుకే పరిగెత్తుకు వచ్చాడు టాక్సీ డ్రయివర్.

"నాకు సంభందించిన విషయం కాదు గాని, మీరు చూపిన ఔదార్యానికి ప్రతిగా సహాయం చేయటం న్యాయమని చెపుతున్నాను....మీరు మదీనా హోటల్ దగ్గిర నా బండి ఎక్కిన క్షణం నుంచీ ఒక కారు మనల్ని ఫాలో అవుతూ వస్తోంది.

ఇప్పుడు అది ఈ పార్కుకు రెండో ప్రక్కన పార్క్ చేసి వుంది....." అని చెప్పి, వేగంగా వెనక్కి వెళ్ళిపోయాడు.

పెదవుల మీదికి రాబోయిన నవ్వును బలవంతంగా అణుచుకుంటూ సూటిగా పార్కులోకే పోయాడు షాడో.

ఒక కారు తనను ఫాలో అవటాన్ని హోటల్ ముందు నుంచి కదిలిన రెండో క్షణంలోనే గమనించాడు తను.... పీటర్ ఆలీ గమనించలేని విషయం ఈ ప్రపంచంలో ఏదయినా వుంటుందా??

జీడీ కామారపు జిగట బంకలా అంటుకోవటానికి ప్రయత్నించిన శాంబోని వదిలించుకున్నట్లే వీళ్ళను కూడా వలదిలించుకోవచ్చు....... కాదు కూడదని వాళ్ళు మొండికెత్తితే..... పేరు పొందిన హంతకుడు తను.....చిటికెలో సఫా చేసి అవతల పారేయవచ్చు....

పాదాల వెనుకే పరిగెత్తుకు వస్తున్న పిల్లి పిల్లకు పార్క్ ఎంట్రన్స్‌లో కనబడిన కబాబుల దుకాణంలో కొన్ని పాకెట్లను పర్చేజ్ చేసి, తాపీగా పార్క్ చివర వత్తుగా పెరిగి వున్న పూ పొదల మధ్యకు పోయాడతను.

రెండు నిముషాల తరువాత యదార్థం అయింది అతని వూహ......

వెనుకా ముందు చూసుకుంటూ అతన్ని సమీపించాడు ఒక వ్యక్తి.

కూర్చున్న బెంచీ మీది నుంచి చర్రున లేవబోతున్న షాడోని చూడగానే భయపడినట్లు రెండు అడుగులు వెనక్కి వేస్తూ, "శత్రువును కాదు షాడో సాబ్..... స్నేహితుడినే.... మీకు బాగా తెలిసిన బదిలీ భాయ్‌ని......" లోగొంతుకలతో గబగబా అన్నాడు.

# 18

అతను గోడవున్‌లో తనను హింసించటానికి ప్రయత్నించిన రెండో బాచ్‌కి చెందిన మనిషి అని గ్రహించి నొసలు ముడి వేశాడు షాడో. అతను తనను సంభోదించిన పద్ధతిని గమనించి మరింతగా కోపం తెచ్చుకున్నాడు.

"పీటర్ ఆలీని నేను...... మీరు అన్నట్లు రాజూ మియాను కాదు...... మీ మాటల్ని నేను నమ్మలేదని గ్రహించి ఇప్పుడు ఇంకో కొత్త పేరును తగిలిస్తున్నారా?" అని ప్రశ్నించాడు.

కబాబుల పాకెట్స్‌ని చించటాన్ని ఆపి తన వంకే చూడటం మొదలు పెట్టిన పిల్లి పిల్ల మీద ఒక కన్ను వేసి వుంచి, విషణ్ణ వదనంతో చిన్నగా నవ్వాడు బదిలీ భాయ్.

"పీటర్ ఆలీ అనే కాదు....... అటువంటి పేర్లు ఇంకో వంద తగిలించుకు తిరిగినా యిక నన్ను ఏమార్చలేరు మీరు..... ఈ పిల్లి పిల్లను మచ్చిక చేసుకున్న రోజునే వచ్చింది నాకు అనుమానం..... గోడవున్‌లో డాగర్‌ని బయటికి తీసే పోజును చూసేసరికి యదార్థం నాకు అవగతం అయిపోయింది ......." అన్నాడు.

"చూడు మిస్టర్..... ప్రాణాల మీద ఆశ వుంటే పిచ్చి పిచ్చి మాటలు మాని వచ్చిన దారినే వెళ్ళిపోవటం చాలా మంచిది...... ఈ పీటర్ ఆలీకి కోపం వస్తే ఏం చేస్తాడో నీకు తెలియదు......" కనుబొమ్మల్లో నుంచి గుర్రుగా చూస్తూ అతన్ని హెచ్చిరంచాడు షాడో.

" అది కాదు షాడో సాబ్.... దయచేసి నా మాట కొంచెం –" పూర్తి కానే లేదు బదిలీ భాయ్ మాట.

కంటికి కనిపించనంత వేగంతో కదిలి అతని గడ్డానికి కనెక్ట్ అయింది షాడో పిడికిలి.

బాధా సూచకమైన శబ్దం చేస్తూ గాలిలోకి ఎగిరి నాలుగు అడుగుల దూరంలో పడ్డాడు బదిలీ భాయ్......

బూటు ప్రక్కన బిగించి వున్న డాగర్‌ని బయటికి లాగాడు షాడో. ఒక్క అంగలో అతన్ని సమీపించి గాలిలోకి ఎత్తాడు దాన్ని.

"దించండి షాడో సాబ్..... ఎంతో మంది శత్రువుల రక్తాన్ని చవి చూసి పదునెక్కిన మీ డాగర్‌ని సూటిగా నా గుండెల్లోకి దించండి..... నా ప్రాణాలు పోయినా సరే లెక్క చేయను నేను. మీరు పీటర్ ఆలీ కాదు..... సి.ఐ.బి. ఏజెంట్ షాడో..... రాజూమియా అనే మారు పేరు పెట్టుకొని పాకిస్థాన్ స్పెషల్ బ్రాంచి వాళ్ళ కళ్ళు కప్పారు.... నన్ను కూడా చాలా దూరం ఏమార్చారు గాని, మీకు తెలియకుండానే బట్టబయలు అయింది మీ నాటకం......." గుండెల మీదికి వస్తున్న డాగర్‌ని చూసి యిసుమంత కూడా చలించకుండా అన్నాడు బదిలీ భాయ్.....

భయంతో గావు కేకలు పెట్టాల్సిన అతను అలా నిబ్బరంగా మాట్లాడటం ఆశ్చర్యాన్ని కలిగించి, డాగర్ ని వెనక్కి తీసుకున్నాడు షాడో.

" చూడు మిస్టర్.... నీకు ఎవరో మత్తు మందు పెట్టి మతి పోగొట్టినట్లున్నారు. నా పేరు షాడో కాదు... పీటర్ ఆలీ....." అన్నాడు.

"లేదు షాడో సాబ్..... మత్తు మందు పెట్టి మతి పోగొట్టింది నాకు కాదు.... మీకే..... గుర్తుకు తెచ్చుకోండి సాబ్..... ఒక్కసారి వెనక్కి తిరిగి గట్టిగా

ఆలోచించి చూడండి......." మోచేతుల మీద లేస్తూ మరింత నమ్మకంగా అన్నాడు బదిలీ భాయ్.

ఆలోచించటానికి ప్రయత్నించాడు షాడో.....

కత్తి పెట్టి పొడిచినట్లు ఒక్కసారిగా స్టార్ట్ అయింది విపరీతమైన శిరోవేదన.

"నో... నో..... నేను షాడోని కాదు...... పీటర్ ఆలీనే...... నా పేరు పీటర్ ఆలీనే...... " చెమటలు క్రమ్ముతున్న ముఖాన్ని అరిచేతులతో రుద్దుకుంటూ బిగ్గరిగా అన్నాడు.

పూర్తిగా లేచి కూర్చుని అతని భుజం మీద చేయి వేశాడు బదిలీ భాయ్.....

"మీ మాటల్ని కాదనే తాహతు నాకు ఏనాడు లేదు..... కాని నాకు ఒక్క అవకాశం యిస్తే నా మాటలే యదార్థాలని నిరూపిస్తాను....... నాతో కొద్దిసేపు తిరగగలరా?" అనునయంగా అడిగాడు.

వెంటనే ప్రవేశించింది అనుమానం షాడో కనుల్లోకి.

"నాటకాలు ఆడుతున్నావా? బ్రతకాలని లేదా?" క్రూరంగా అడిగాడు.

చిన్నగా నవ్వి తల అడ్డం తిప్పాడు బదిలీ భాయ్.

"నాటకాలు ఆడి మిమ్మల్ని ఏమైనా చేసే ధైర్యం నాకు ఇంకో వంద జన్మలెత్తినా రాదు షాడో సాబ్...... మీకు అపకారం చేశానని తెలిసిన మరుక్షణం, ఈ పాకిస్థాన్ భూభాగంలోనే నరికి ముక్కలు చేసి కాకులకు గద్దలకు వేస్తాడు మీ స్నేహితుడు బందిపోటు మహమ్మద్..... సప్త సముద్రాల అవతల దాక్కున్నా

వెతుక్కుంటూ వచ్చి సజీవంగా దహనం చేస్తాడు మీ గంగారాం...... బ్రతికి వుండగానే పులులకు సింహాలకు వేస్తారు మీ సి.ఐ.బి. స్టాఫ్..... లేదు సాబ్...... మీ ముందు నాటకాలు ఆడే ధైర్యం నాకు లేదు " అంటూ లేచి నిలబడ్డాడు.

అతను చెప్పిన పేర్లన్నీ ఎక్కడో విన్న సెన్సేషన్ ఒక్క క్షణం మనస్సులో మెదిలి వెంటనే మాయం అయిపోతుండగా, తను కూడా లేచాడు షాడో.

"ఆల్‌రైట్.... నీకు ఖచ్చితంగా ఒక గంట టైమ్ యిస్తున్నాను..... నీ మాటలు యదార్థాలని నిరూపించుకోలేకపోతే నీ పని ఖతమ్ అయిపోతుంది......" అన్నాడు.

పట్టరాని సంతోషంతో తల మునకలైపోతూ పొదల మధ్యలో నుంచి అతన్ని పార్కు వెనక్కి తీసుకుపోయాడు బదిలీ భాయ్. అక్కడ ఆపి వుంచిన టాక్సీలో అతన్ని కూర్చోబెట్టి , అరగంట తరువాత ఒక పెద్ద మురికి వాడ దగ్గిరికి తీసుకుపోయాడు.

చీకటితో నిండిన సందులు, అడుగుకు అరడజను బురద గుంటలు. కిక్కిరిసి వున్న రేకుల షెడ్లు – ఎంత మాత్రము నచ్చలేదు షాడోకి అక్కడి వాతావరణం. అయినా సరే మారు మాటాడకుండా అతన్ని అనుసరించాడు.

టాక్సీని మెయిన్ రోడ్డు మీదే వదిలి, రెండు సందుల్ని క్రాస్ చేయించాడు బదిలీ భాయ్.... మూడో సందు మొగదల వున్న ఒక పెద్ద రావిచెట్టు క్రింద నిలబెట్టి వెయిట్ చేయమని సైగ చేశాడు.

రావి చెట్టుకు వంద గజాల దూరంలో వున్నది ఒక పెద్ద చెక్కల కట్టడం. పోలీసుల కళ్ళ పడకుండా యమజోరుగా సాగుతోంది అక్కడ దొంగ సారా వ్యాపారం.

పీకల దాకా తాగి, తాగిన మత్తులో యిష్టం వచ్చినట్లు కారు కూతలు కూస్తూ కట్టడంలో నుంచి బయటికి వచ్చారు నలుగురు వ్యక్తులు.

అదే సమయంలో ఒక చంటి బిడ్డను చంకన బెట్టుకొని అటుగా వచ్చింది ఒక పడుచు పిల్ల.

ఆమెను చూసేసరికి మతులు మరింతగా పోయాయి ఆ వ్యక్తులకు.

"వారేవా ప్యారీ.... భలే సమయానికి వచ్చావ్......" అంటూ తోడేళ్ళ మాదిరి చుట్టుముట్టా రామెను.

కెవ్వున అరిచి వదిలించుకోవటానికి ప్రయత్నించిందామె.

చెక్కల కట్టడానికి తగిలి ప్రతి ధ్వనించింది ఆమె అరుపు...... పుట్టలో నుంచి వెలువడిన చీమల్లా బయటికి వచ్చారు అందులో వున్న ఆల్కహాలిక్స్ అందరూ.....

"పట్టుకోండి... గట్టిగా పట్టుకోండి...... మీ అవసరం తీరిన తర్వాత మాకు కూడా ఇవ్వండి అవకాశం......." అని అరుస్తూ హుషార్ చేశారు ఆ వ్యక్తుల్ని.

దీనాతి దీనంగా వేడుకుంటున్న ఆ యువతిని, ఆ గలాభాకు బెదిరి గుక్కలు పడుతున్న ఆమె పసి బిడ్డను గమనించే సరికి కడుపులో ఎవరో చేయి పెట్టి కెలికినట్లు అనుభూతిని పొందాడు షాడో.

"ఇదెక్కడి అన్యాయం? వంటరిగా వున్న ఆడపిల్లను ఆ దుర్మార్గులు అలా అవమానిస్తుంటే అడ్డం తిరిగి ఆపటానికి బదులు, అలా సంతోషిస్తున్నారేమిటి అందరూ ?" అసహ్యంగా చూస్తూ అన్నాడు బదిలీ భాయ్‌తో.

"ఇక్కడ ప్రతి రోజు జరిగే తంతు యిది...... వాళ్ళ ఆనందం వాళ్ళది. కాదనటానికి మనం ఎవరం? ఆ పిల్ల మన చుట్టం కాదుగా....." నిర్లిప్తంగా సమాధానం యిచ్చాడు బదిలీ భాయ్.

పడుచు పిల్ల పమిటెను లాగుతూ, వున్నట్లుండి ఆమె బిడ్డ మీద చేయి వేశాడు ఒక వ్యక్తి. బలవంతంగా యివతలికి లాగి ప్రక్కకు విసిరేయబోయాడు.

అంతే !

తనేం చేస్తున్నాడో తనకే తెలియని ఒక విచిత్రమైన ఆవేశంలో మునిగిపోతూ గుండెలు చెదిరిపోయేటట్లు సింహనాదం చేశాడు షాడో. వింటి నుంచి వెలువడిన బాణంలా పోయి ఆ వ్యక్తుల మీద కలబడ్డాడు.

రెండే రెండు దెబ్బలకు తాగిన సారామత్తు తలలలో నుంచి దిగిపోతుండగా, పిక్కబలం చూపించారు యిద్దరు....

ప్రక్కకు విసిరి వేయబోయిన పసిబిడ్డను వదిలి కట్టడంలోకి పరిగెత్తాడు మూడో వ్యక్తి.

చటుక్కున ముందుకు వంగి, ఆ బిడ్డను క్రింద పడక ముందే చేతుల్లోకి తీసుకున్నాడు షాడో..... అదే వూపులో ఛట్ మని పాదాన్ని ఎత్తి నాలుగో వ్యక్తి గుండెల మీద తన్నాడు.

అరవటానికి కూడా ఓపికలేక, నోటి వెంట నెత్తురు వెలువడుతుండగా ఒక బురద గుంటలో పడిపోయాడతను.

గుండెలకు చేతులు అడ్డం పెట్టుకొని బెంబేలెత్తి పోతున్న యువతికి బిడ్డను అప్పగించి, మురికి గుంటలో పడిన వ్యక్తిని యువతలకు లాగాడు షాడో. అతని జేబులు వెతికి, సగం తడిసిన అగ్గిపెట్టెను స్వాధీన పరుచుకున్నాడు.

"అయ్యబాబోయ్.... ఆగండి.... ఆగండి షాడో సాబ్... ఏం చేయబోతున్నారు??" ఆశ్చర్యంగా ప్రశ్నించాడు బదిలీభాయ్.......

"అమాయకురాలైన ఆ పడుచు అవమానం పాలవటానికి ఈ సారా కొట్టే కారణం..... దీన్ని, దీనిలోని వారందర్నీ తగల బెడితే గాని వీళ్ళకు బుద్ధిరాదు....." అగ్గి పెట్టెలో నుంచి రెండు పుల్లల్ని బయటికి తీసి పట్టుకుంటూ అన్నాడు షాడో.

"డబ్బు యిస్తే ఎటువంటి దారుణాలైన చేయగల పీటర్ ఆలీ మీరు.... మీకు నీతులు, న్యాయాలు వుంటాయా? ఎన్నో తప్పులు మీ వెనుక పెట్టుకొని, ఎవరో చేసిన తప్పుల్ని ఎంచి చూపటం పద్ధతేనా?" కూల్‌గా అడిగాడు బదిలీ భాయ్.....

దానంతట అదే జారి పోయింది షాడో చేతిలోని అగ్గిపెట్టె.

నిజమే..... ఏ డబ్బు తీసుకొని పాకిస్థాన్ అధ్యక్షుడిని హతమార్చటానికి అంగీకరించి వచ్చిన తనకు ఎందుకు కలిగింది ఈ పిచ్చి ఆవేశం ??

"మీరు పీటర్ ఆలీ కాదు కాబట్టి..... ఆపదలో వున్న శత్రువులనైనా ఆదుకునే పెద్ద గుండె కల షాడో మీరే కాబట్టి యిలా రియాక్ట్ అయ్యారు...

ఇప్పటికైనా నమ్ముతారా నా మాట....... " అతని ఆలోచనల్ని గమనించి మాట మీద మాటగా వదిలాడు బదిలీ భాయ్.

మరోసారి తలలో కత్తులు దిగబడుతున్న సెన్సేషన్ కలిగి, కణతల్ని నొక్కుకుంటూ రావి చెట్టు దగ్గర్నించి యివతలికి వచ్చేశాడు షాడో.

ముందున్న రెండు సందుల్లో ఒక దాన్ని క్రాస్ చేస్తుండగా, ఒక ఇంటి చాటునుంచి అతని మీదికి దూకాయి రెండు ఆకారాలు.

"అయ్య బాబోయ్...... ఆగండి..... ఆగండి...... అంతా సరిఅయిపోతున్న ఆఖరి క్షణంలో తొందర పడకండి..... ఆగండి అంజాద్ సార్......." కీచుగా అరుస్తూ షాడో ముందుకు జంప్ చేశాడు బదిలీభాయ్.

అప్పటికే చాలా ఆలస్యం జరిగిపోయింది.

తన అంతరంగంలో చెలరేగిన సంఘర్షణను అణుచుకోవటానికి ప్రయత్నిస్తూ, క్షణంలో పదో వంతు కాలం లేట్ చేశాడు షాడో. ఆ కాస్త వ్యవధిలోను బలంగా అతని తలను తాకిందొక ఐరన్ రాడ్.

కనుల ముందు పంచరంగుల నక్షత్రాలు ప్రత్యక్షం అవుతుండగా, చేతులు జాచి ఆ రాడ్‌ని పట్టుకున్నాడతను...... అదే వూపులో గాలిలోకి ఎగిరి ఆ ఆకారం గుండెల మీద తన్నాడు.... తన్నుతూ వుండగానే వెనుక నుంచి మెడ మీద పడిందొక దెబ్బ.

నల్లని సిల్కు పరదాలు మెదడును చుట్టుకుంటున్నట్లు అనుభూతిని పొందుతూ ముందుకు పడిపోయాడతను.....

పడిపోతున్న సమయంలో "ఆగండి.... దయచేసి ఆగండి......." అని అరుస్తూ బదిలీ భాయ్ తనకు అడ్డంగా నిలబడటం, బాధా సూచకమైన ఆర్తనాదం ఒకటి అతని నోటి వెంట వెలువడటం కనిపించిందతనికి...... ఆ తరువాత ఏం జరిగిందో షాడోకి తెలియదు.

# 19

"రాజూ మియా ....రాజూమియా ......."

దూరం నుంచి ఎవరో తనను పిలుస్తున్నట్లు అనిపించి కనులు తెరిచాడు షాడో.

"నేనిక్కడ వున్నాను? నాకు ఏమయింది??" అని అడుగుతూ లేచి కూర్చున్న అతనికి ప్రక్కనే కనిపించింది ట్వింకిల్.

"మై గాడ్ మేం సాబ్! మీరు ఎక్కడి నుంచి వచ్చారు? నన్ను ఏ మార్చి మన రహస్యాలు తెలుసకోవాలని ప్లాను వేసిన నా గర్ల్ ఫ్రెండ్ ఆస్మా ఏమయింది?" ఆశ్చర్యంగా ఆమె వంక చూస్తూ అడిగాడు.

"ఆస్మా సంగతి ఏమో గాని, నువ్వు పర్మినెంట్‌గా మతి పోగొట్టుకున్నావనే భ్రమలో పడి చేయకూడని తప్పు చేసేశాం రాజూమియా...... బదిలీ భాయ్‌ని బలి తీసుకున్నాం....." బాధగా అన్నదామె.

గుండెల మీద ఎవరో లాగి పెట్టి గుద్దినట్లు ఉక్కిరి బిక్కిరి అవుతూ ప్రక్కకు చూశాడు షాడో.

నాలుగు అడుగుల దూరంలోనే పడి వున్నాడు బదిలీ భాయ్...... జెండా స్తంభంలా అతని ఛాతీలో దిగబడి వుంది అంజాద్ ఉపయోగించే పిడిబాకు.....

క్షణాలు గడిచిన కొద్దీ మృత్యు ముఖంలోకి పోతూ కూడా, తెలివిని కొంచెం కూడా కోల్పోలేదు బదిలీ భాయ్..... షాడో తన వైపు చూడగానే ముఖమంతా నోరు చేసుకొని నవ్వాడు.

"అసలు విషయం తప్ప మిగిలినదంతా మేం సాబ్‌కి చెప్పేశాను రాజూమియా.....ఇక వంటిరిగానే పని చేయాలి నువ్వు..... వెంట రావటానికి వీలు పడేటట్లు లేదు నాకు......" అన్నాడు....

అతని పెదవుల చివర్ల నుంచి జారుతున్న రక్తపు ధారల్ని చూడగానే మనస్సు వికలమై పోయింది షాడోకి.

అంత బాధలోను, మరణానికి దగ్గిరి దగ్గిరిగా పోతున్నానని తెలిసి కూడా తన గుట్టును దాచి పెట్టాడతను..... తన ఐడెంటిటీని అతని గుండెల్లోనే పదిల పరుచుకున్నాడు.

"అసలు విషయం ఏమిటి రాజూమియా......ఏం జరిగింది ??" బదిలీ భాయ్ మాటల్ని వినగానే ప్రశ్నించింది ట్వింకిల్.

హోటల్ మదీనాలో తారసపడి తన కోసమే ఎదురు చూస్తున్న ఆస్మా గురించి చెప్పాడు షాడో. ఆమె సహచరులు దాడి చేయటం వల్ల తను మతిని పోగొట్టుకున్న విధానాన్ని వర్ణించాడు.... మతి లేని సమయంలో గనీఖాన్‌ని కలిసి మాట్లాడిన మాటలన్నింటినీ గుర్తుకు తెచ్చుకుంటూ వివరించి చెప్పాడు.

గనీఖాన్ పథకం ఏమిటో అర్థం చేసుకునే సరికి స్థాణువై పోయింది ట్వింకిల్.

"మైగాడ్ ! ఈ రోజు ఉదయమే ఇక్కడికి పది కిలోమీటర్ల దూరంలో వున్న చల్మా రిజర్వాయర్ ప్రారంభోత్సవసభకు హాజరు అయ్యాడు మన అధ్యక్షుడు. ఇంకో రెండు రోజులు పాటు అక్కడే వుంటాడు. గనీఖాన్ పథకం ఆచరణలో పెట్టటానికి సరైన సమయం ఇదే..... మనం త్వరపడకపోతే సర్వనాశనం తప్పదు....." అంటూ చివ్వున లేచి నిలబడింది.

అదే సమయంలో వారందరి మీదికి ఫోకస్ చేయబడ్డాయి నాలుగు పవర్ పుల్ ఫ్లడ్ లైట్లు.

"హాల్ట్.... హాల్ట్ దేర్..... అడుగు ముందుకు వేస్తే ఖతం చేసేస్తాం......" ఖంగుమనే కంఠంతో వినవచ్చింది ఒక మిలటరీ కమాండ్.

పీటర్ ఆలీగా తను ఆడిన నాటకం బట్టబయలు అయిపోయిందని గ్రహించటానికి ఎంతో వ్యవధి షాడోకి అవసరం లేకపోయింది.

బరువైన రైఫిల్స్ పట్టుకొని బిలబిలలాడుతూ వచ్చేస్తున్నారు. అనేక మంది సైనికులు.....

అప్రయత్నంగా పాంటు జేబులో చేయి పెట్టి అంతకు ముందు అవేమిటో తెలియకుండా భద్రపరిచిన మెటల్ బాల్స్‌లో ఒక దాన్ని తీశాడు షాడో. దాని మీది బుడిపెను గట్టిగా అదిమి శక్తి కొద్ది ముందుకు విసిరాడు.

గాలిలో వుండగానే దారుణమైన మ్రోతలు చేస్తూ ప్రేలిపోయిందది.... కనులు మిరుమిట్లు కొలిపే కాంతులతో పట్ట పగలుగా మార్చి వేసిందా ప్రదేశాన్ని.

ఆ వెలుగును చూడలేక కనులు మూసుకున్నారు సోల్జర్స్...... తిరిగి కనులు తెరిచేసరికి, బదిలీ భాయ్‌ని చేతుల్లోకి ఎత్తుకొని మాయం అయిపోయాడు షాడో.

* * * * *

"బ్రహ్మాండమైన ఇంజక్షన్స్ చేసి, ఇతని ప్రాణాల్ని నిలబెడతాను..... అందుకు బోలెడంత ఖర్చు అవుతుంది. తట్టుకోగలవా?" ఒకదాని తర్వాత ఒకటిగా నాలుగు సిరంజిల్లో ఒకే మెడిసిన్‌ని కొద్ది కొద్దిగా లోడ్ చేసి తీసుకు వస్తూ అన్నాడు డాక్టర్.

పాంటు జేబులో చేయి పెట్టాడు షాడో. గనీఖాన్ యిచ్చిన నోట్ల కట్టల్ని బయటికి తీయటానికి.

ఎగ్జామినేషన్ రూమ్ లోని లైటు వెలుగులో మొట్టమొదటిసారి అతని ముఖాన్ని క్లియర్‌గా చూసి కెవ్వున అరిచాడు డాక్టర్....

"నువ్వా..... పెంపుడు పిల్లి అని చెప్పి పెద్ద పులిని అంటకట్టి పారిపోయిన దుర్మార్గుడివి..... నిన్ను పోలీసులకు అప్పగిస్తాను..... నీ అంతు చూస్తాను " అంటూ చేతుల్లో వున్న సిరంజిలన్నిటినీ అవతల పడేసి కన్సల్టింగ్ రూమ్ లోకి పరిగెత్తబోతూ బ్రేకులు పడినట్లు ఆగిపోయాడు.

కన్సల్టింగ్ రూమ్‌లో టేబిల్ మీద కూర్చుని వుంది పిల్లి పిల్ల. అతన్ని చూడగానే ఆనందంగా నోరు తెరిచి వళ్ళు విరుచుకుంది.

శిలా విగ్రహంలా బిగుసుకు పోయిన డాక్టర్ భుజం తట్టి బయటికి తీసిన నోట్ల కట్టల నన్నిటినీ అతని చేతిలో పెట్టాడు షాడో.

"ఇతని ప్రాణాలు కాపాడితే ఇంతకు రెట్టింపు యిస్తాను. ఒకే మందును రెండు ఇంజక్షన్స్‌గా చేసి బ్రతకాల్సిన ఖర్మ ఇక మీకు పట్టకుండా చేస్తాను.....కెన్ యూ డూ యిట్ డాక్టర్ ? కెన్ యూ సేవ్ మై ఫ్రెండ్ ??" అడిగాడు ఆర్ద్రంగా .

తన చేతిలోకి వచ్చిన డబ్బువంకా, అతని ముఖం వంకా పట్టి పట్టి చూసి గంభీరంగా తల వూపాడు డాక్టర్.

"కత్తి పోటు బలమైందే....కాని విటల్ ఆర్గాన్స్‌కి ఏమంత పెద్ద డామేజి జరగలేదని అనుకుంటున్నాను.... యస్ మై ఫ్రండ్.... ఇతను బ్రతకటానికి ఎనభై శాతం అవకాశాలు వున్నాయి......" అన్నాడు....

"థేంక్యూ డాక్టర్.... థేంక్యూ వెరీ మచ్......" అంటూ వెనుతిరిగి కన్సల్టింగ్ రూమ్ లోకి వచ్చాడు షాడో. పిల్లిపిల్లను చంకలో పెట్టుకొని పరుగులాంటి నడకతో రోడ్డు ఎక్కాడు.

అతని ప్రమేయం లేకుండా పాదాలు వాటంతట అవే కదులుతున్నాయి..... అంతరంగంలోని ఆలోచనలు మాత్రం అగ్నిపర్వతాల్లా వుడుకుతున్నాయి.

హోటల్లో శాంబోనించి తప్పించుకోవటానికి తను చేసిన గొడవ వల్ల బయటపడి వుండదు తన బండారం...... ఒకే ఒక యిన్సిడెంట్ మూలకంగా తారుమారు అయి వుంటుంది ప్లాను అంతా.....

పది నిముషాల తరువాత పాడు పడిన మసీదును సమీపించి ఆగాడతను..... అక్కడ ప్రమాదం ఏదీ పొంచి లేదని నిశ్చయం కాగానే మసీదు వెనుక వున్న పొదల లోకి పోయి చూశాడు.

యదార్థం అయింది అతని అనుమానం.

పట్టుదలగా ప్రయత్నించి తను కట్టిన తాళ్ళను తెంపుకున్నాడు ఒరిజినల్ పీటర్ ఆలీ...... బంధ విముక్తుడు కాగానే సరాసరి గనీఖాన్‌ని కాంటాక్ట్ చేసి వుంటాడు....

తన పథకానికి వత్తాసు పలుకుతున్న మిలటరీ అధికారులను హెచ్చరించి సిటీ నంతా గాలించమని చెప్పి వుంటాడు గనీఖాన్.....

అదృష్టం బాగుండి తప్పించుకోగలిగాడు తను...... అంజాద్, ట్వింకిల్ ఏమయ్యారో తెలియదు......

ఆలోచనల్ని అక్కడితో ఆపి పరుగులాంటి నడకతో గనీఖాన్ బంగ్లా వైపు బయలుదేరాడు షాడో. రెండు గంటల తరువాత మెయిన్ గేటును సమీపించి, ఒకింత ఆశ్చర్యానికి గురి అయ్యాడు.

అంతకు ముందు శాంబోతో కలిసి తను వచ్చినప్పుడు సెక్యూరిటీ గార్డులతో బిజీగా కనపడింది ఆ ప్రాంతమంతా...... ఎక్కడి వారక్కడ మాయం అయినట్లు నిర్మానుష్యంగా వున్నది అది ఇప్పుడు......

మెయిన్ గేటును దాటి బంగ్లా ముందు గదిలో అడుగు పెట్టాడు.... ముందు వెనుకలు చూసుకుంటూ నాలుగు గదుల్ని అధిగమించేసరికి, ఒక హాలులో అతనికి అగుపించాడు మిషన్ గన్ పట్టుకొని శిలా విగ్రహంలా నిలబడిన గార్డు ఒకతను.

అతని పాదాల దగ్గిర మూరెడు ఎత్తున కట్టబడిన పెద్ద సిమెంట్ దిమ్మను గమనించగానే, అంతకు ముందు గనీఖాన్ చెప్పిన అండర్ గ్రౌండ్ సెక్యూరిటీ సెల్

అదే అయివుంటుందని అర్ధం అయి, చంకలోని పిల్లిని మెల్లిగా ఆ హాలు ముందుకు వదిలాడు.

వెచ్చగా కూర్చున్న తనను ఒక్కసారిగా క్రిందికి దింపేసరికి కోపం వచ్చింది కాబోలు కచ్చగా అరిచిందా పిల్లి పిల్ల..... ఎగిరి గంతులు వేసింది.

గార్డు కంట పడ్డాయి ఆ గంతులు, విచిత్రంగా చూస్తూ ముందుకు వచ్చాడతను, మిషన్ గన్‌ని భుజానికి తగిలించుకొని.

నాలుగు అడుగుల దూరంలోకి రానిచ్చి, పెద్ద పులిలా లంఘించాడు షాడో. ఒక చేత్తో మిషన్ గన్‌ని గట్టిగా పట్టుకొని రెండవ చేత్తో లాగిపెట్టి గుద్దాడు అతని నెత్తిమీద.

ముక్కుల వెంట రక్తపు ధారలు వెలువడుతుండగా చాప చుట్టలా వరిగిపోయాడతను. అతని దెబ్బకు వ్రేలాడుతున్న తాళం చెవుల గుత్తిని గమనించి, దాన్ని అందుకుంటూ సిమెంట్ దిమ్మ దగ్గిరికి పోయాడు షాడో.

బరువుగా వున్న పెద్ద ఇనుప రేకు పరిచి వుంది దిమ్మమీద...... దాన్ని ప్రక్కకు లాగగానే కనిపించాయి చెక్కతో తయారుచేయబడిన మెట్లు.

లోపల ఇంకెవరయినా వుంటే తన పని ఖతమ్ అయిపోతుందనే భయంతో తూచి తూచి అడుగులు వేస్తూ క్రిందికి దిగి చుట్టూ చూశాడు.

లోపల కాపలా లేదు...... ఎట్ట ఎదుట వున్న ఒక సెల్ లో అతనికి కనిపించింది ఆస్మా..... ఆమెతో పాటు బంధింపబడి వున్న స్పెషల్ బ్రాంచి డిటెక్టివ్స్‌ని చూసి తనలో తను నవ్వుకుంటూ పది అడుగులు ముందుకు వేశాడు.

ఆ తరువాతి సెల్‌లో నిలబడి అతన్ని చూడగానే నేలకు వంగి సలాం చేశాడు ఆస్మా తరుపున పని చేసిన గనీఖాన్ అనుచరుడు.

తాళం చెవుల గుత్తిలో నుంచి ఒక చెవిని సెలక్ట్ చేసి ఆ సెల్ డోర్‌ని తెరిచాడు షాడో.

పెద్ద ఎత్తున కృతజ్ఞతలు తెలియ చేసుకోబోతున్న అతన్ని, అతని కుటుంబ సభ్యులను వారించి, పారిపోమని సైగ చేస్తుండగా ఆ ప్రక్కనే వున్న మరో గదిలో దర్శన మిచ్చాడు మసీదు దగ్గిర్నించి పారిపోయి వచ్చిన ఒరిజినల్ పీటర్ ఆలీ....

మొదటి చూపులోనే షాడోని గుర్తు పట్టేశాడతను.

"నీ రక్తం తాగుతాను బే ..... నీ అంతు చూస్తాను....." సెల్ డోర్ దగ్గిర నిలబడి పళ్ళు కొరుకుతూ హెచ్చరించాడు.

"ఎలా తాగుతావు బే? ఎలా చూస్తావు నా అంతు?? చూడటానికే గదా నువ్వు యిక్కడికి వచ్చింది..... మరి ఈ బందిఖానా ఖర్మ నీ కెందుకు పట్టిందిట??" చిరునవ్వుతో అడిగాడు షాడో.

"నమ్మించి మోసం చేశాడు ఆ గనీఖాన్.... వాడిని కత్తికో కండగా నరుకుతాను......" జరిగింది తలుచుకొని మరింత ఆవేశానికి గురి అయ్యాడతను......

"ఇంతకీ ఎక్కడికి వెళ్లాడు గనీఖాన్?" అతని సెల్ తాళం తీయటానికి ప్రయత్నిస్తున్నట్లు నటిస్తూ కాజువల్‌గా అడిగాడు షాడో.

"చల్మా రిజర్వాయర్ దగ్గిర వుండే గెస్ట్ హౌస్‌లో బస చేశాడట వీళ్ళ అధ్యక్షుడు.... తెల్లవారు ఝామున ఐదు గంటలకే లేచి మార్నింగ్ వాక్‌కి బయలు

దేరటం ఆయనకు అలవాటుట..... ఆ సమయంలో చుట్టు ముట్టి ఖతం చేస్తారట...... అందుకే వెళ్ళాడు......"

" మరి నువ్వు యిక్కడ వుండి పోయావేం ?" ఇంకో ప్రశ్న వేశాడు షాడో.

"నువ్వు ఎవరివో నాకు తెలియదు.... నా ముఖం చూస్తే మీకు ఏమనిపిస్తోంది? వట్టి వెర్రివాడిలా కనిపిస్తున్నానా?" మరింత కోపంగా సమాధానం యిచ్చాడు పీటర్ ఆలీ. "డబ్బుకోసం దారుణాలు చేసే మనిషినే నేను..... గనీఖాన్ మాదిరిగా దేశాధినేతల ప్రాణాలు తీయటానికి పథకాలు వేయటం మాత్రం నా వల్ల కాదు...... ఆ పని చేయటానికి నిరాకరించినందువల్లనే నాకు ఈ గతి పట్టింది......"

చేతుల్లోని తాళం చెవుల గుత్తిని అతని సెల్ లోకి విసిరాడు షాడో.

"నీ ప్రిన్సిపల్స్ నాకు నచ్చాయి..... ఒక పది నిముషాలు కష్టపడితే నీకు నువ్వుగా ఈ సెల్ తాళం వూడతీసుకోగలవు..... నీతో పాటు ఇంకా కొంతమంది ఇక్కడ బంధింపబడి వున్నారు..... వారిని కూడా విడుదల చేసి, ఎంత త్వరగా వీలయితే ఈ దేశాన్ని వదిలి పారిపోండి.... గనీఖాన్ పథకం సక్సెస్ అయితే మీ పని ఖాళీ అయిపోతుంది." అంటూ వింటి నుంచి వెలువడిన బాణంలా పైకి వచ్చేశాడు.

అప్పుడే బంగ్లా ముఖద్వారాన్ని దాటుతున్నాడు గనీఖాన్ సర్వెంట్. తన భార్యా బిడ్డల్ని వెంట బెట్టుకొని, అతని సహాయంతో, బంగ్లా వెనుక వున్న ఒక మోటార్ బైక్ని వెతికి పట్టుకున్నాడు షాడో. ఒకే ఒక కిక్తో దాన్ని స్టార్ట్ చేసి, చల్మా రిజర్వాయర్ వైపు పోనిచ్చాడు.

ఆఖరి క్షణంలో పరుగు పరుగున వచ్చి అతని వీపు మీదికి దూకింది పిల్లి పిల్ల. వాడిగా వున్న గోళ్లతో షర్టును బిగించి పట్టుకొని వ్రేలాడబడింది .

## 20

ఉదయం అయిదు గంటల సమయంలో కూడా విపరీతమైన చెమటతో స్నానం చేసినట్లు తయారయింది. అధ్యక్షుడి వెనుకే అడుగులు వేస్తున్న కల్నల్ షా ఆలం శరీరం.

ఆ విషయాన్ని గమనించి ఆయన అనుమానిస్తాడేమోననే భయంతో వేగంగా కొట్టుకుంటున్న గుండెల్ని చిక్కబట్టుకొని ఎడమ చేతి వైపున వున్న పొదల కేసి చూశాడతను.

ఎంతో సాఫీగా జరిగి పోతుందని అనుకున్న తమ పథకానికి అనుకోని అడ్డంకులు ఎదురయ్యాయి... అయినాసరే మొండిగా కదిలి వచ్చాడు గనీఖాన్..... తమ అనుచరులలో మెరికల్లాంటి నలుగుర్ని వెంట బెట్టుకొని తనే స్వయంగా మాటు వేశాడు.

ఐదు గంటల నాలుగు నిముషాలకు పెట్టబడింది ముహూర్తం ..... అందుకు సరిగ్గా ఇంకొక్క నిముషమే వుంది వ్యవధి......

బరువైన పొట్ట మీది నుంచి క్రిందికి జారిపోతున్న బెల్టును పైకి లాక్కునే నెపంతో, బెల్టులోని రివాల్వర్‌ని సర్దుకున్నాడతను......

అధ్యక్షుడి ముందు అడుగులు వేస్తున్నారు అరడజను మంది బాడీగార్డులు వారిలో యిద్దర్ని పడగొట్టటం తన వంతు......

ఉన్నట్లుండి ఆగి పోయారు బాడీ గార్డులు.

"గెట్ బాక్ సర్...గెట్ బాక్....." అని అరుస్తూ తను రివాల్వర్లను పైకి ఎత్తారు.

అదే సమయంలో పొదల చాటు నుంచి లేచాడు గనీఖాన్. తన అనుచరులను హెచ్చరిస్తూ కాల్పులు ప్రారంభించాడు.

బాడీ గార్డుల హెచ్చరికను వినగానే ఎగిరి ప్రక్కకు దూకాడు అధ్యక్షుడు. గనీఖాన్ బుల్లెట్లనుంచి తనను తను రక్షించుకున్నాడు....

పరిస్థితి మరో విధంగా మరులుతున్నదని గ్రహించి తన రివాల్వర్ని ఆయన కేసి గురి పెట్టాడు కల్నల్ షా ఆలం.

సరిగ్గా అప్పుడే అక్కడికి పది అడుగుల దూరంలో వున్న ఒక చెట్టు మీది నుంచి అతని భుజాల పైకి దూకిందొక ఎడారి పిల్లి. పెద్ద పులిలా అరుస్తూ పంజాలు విప్పి ఎటాక్ ప్రారంభించింది.

చేతిలోని రివాల్వర్ ఎగిరి పోతుండగా వెల్లికిలా పడిపోయాడు కల్నల్ షా ఆలం......

పిల్లి పిల్ల పంజా దెబ్బలకు తన కనులు ఛిన్నా భిన్నం అవుతున్న ఆఖరి క్షణంలో అతనికి కనిపించాడు అదే చెట్టు మీది నుంచి గనీఖాన్ మీదికి జంప్ చేస్తున్న యువకుడు.

"మైగాడ్! అతనే..... పీటర్ ఆలీగా నటించి మనల్ని మోసం చేసింది అతనే......" అనే అరుపు అప్రయత్నంగా వెలువడింది అతని నోటి నుంచి.....

అదిరి పడి తన రివాల్వర్ని అటు కేసి తిప్పాడు గనీఖాన్.

గుండెలు జలదరించేటట్లు షాట్ చేశాడు షాడో...... ఎడమకాలితో నేలను తన్ని అమాంతం గాలిలోకి ఎగిరాడు.

చేతిలోని రివాల్వర్ ప్రేలకముందే మధ్యకు పగిలింది గనీఖాన్ తల...... అతని శరీరం నేలను తాకకముందే షాడో విసిరిన ఎడం పాదం ముఖానికి కనెక్ట్ అయి విరుచుకు పడిపోయాడు ప్రక్కనే వున్న శాంబో.

క్రింద పడిపోయిన కల్నల్ సాబ్ కను గ్రుడ్లను పీకి అతని గుండెల మీద గంతులు వేస్తోంది పిల్లి పిల్ల.....

దుస్తులకు అంటిన మట్టిని దులుపుకోవటం కూడా మరిచిపోయి, దాన్ని శాంతింప చేయటానికి ప్రయత్నిస్తున్నాడు అధ్యక్షుడు.

"ఆర్ యూ ఆల్ రైట్ సర్?" ప్రశ్నించాడు షాడో.....

గనీఖాన్ ప్రయోగించిన బుల్లెట్స్‌కి ఆహుతి అయిపోయిన తన బాడీ గార్డుల వైపు చూసి బరువుగా నిట్టూరుస్తూ తల వూపాడాయన.

గనీఖాన్ అనుచరులు యింకెవరయినా ఆ చుట్టపట్ల వున్నారేమోనని ఒకసారి కలియ చూసి, అక్కడికి వంద అడుగుల దూరంలో వున్న పెద్ద చెట్టు చాటుకు పరిగెత్తాడు షాడో. స్పృహలేని స్థితిలో అచేతనంగా ట్వింకిల్‌ని, అంజాద్‌ని ఒకరి తరువాత ఒకరిని తీసుకు వచ్చి తను దాగుకున్న చెట్టు క్రింద పడుకోబెట్టాడు.

"వీళ్ళు..... వీళ్ళు....." వారిద్దరినీ చూసి గుర్తు పట్టటానికి ప్రయత్నించాడు పాకిస్థాన్ అధ్యక్షుడు.

"మీ స్పెషల్ బ్రాంచి ఏజెంట్స్ సర్..... మీ ప్రాణాలు కాపాడటానికి ప్రయత్నిస్తూ ఈ దుర్మార్గులకు చిక్కుబడ్డారు ...... వీళ్ళ రాక్షస పథకం విజయవంతం అయి వుంటే నేరం వీరిద్దరి మీదా రుద్దబడేది......" సమాధానం యిచ్చాడు షాడో.

"మరి నువ్వెవరివి?"

ఆ ప్రశ్నకు సమాధానం యివ్వటానికి కొంచెం తటపటాయించి, చిన్నగా నవ్వాడు షాడో.

"మిమ్మల్ని కాపాడే ప్రయత్నంలో ఏవైనా మోట పనులు చేసేందుకు ట్వింకిల్ మేం సాబ్ అపాయింట్ చేసిన ఒక దేశ దిమ్మరిని సార్..... నా పేరు రాజూమియా......" అని అంటూ వుండగా కాల్పుల శబ్దాన్ని విని గెస్ట్ హౌస్ దగ్గర్నించి పరిగెత్తుకు వస్తున్న రక్షణ సిబ్బంది అతనికి కనిపించారు......

కల్నల్ సాబ్ శరీరాన్ని వదిలి, దేశాధ్యక్షుడి చేతుల్లోకి పోయింది పిల్లి పిల్ల..... తనకు అంతటి గౌరవం లభించినందుకు గర్వపడుతున్నట్లు కోరగా చూసింది షాడో వంక.....

అంత వరకే చూశాడు షాడో...... రక్షణ సిబ్బంది ఆ ప్రదేశాన్ని సమీపించేలోగా చెట్ల చాటుకు పోయి మాయం అయినాడు.

## 21

" ....... ఇడియట్స్...... బ్లడీరోగ్స్..... వద్దు వద్దన్న పనిని వదలకుండా చేయందే నిద్రపట్టని డండర్ హెడ్స్..... ఎవడు వెళ్ళమన్నవాడు వీళ్ళని ఆ

దేశంలోకి? ఎవరో చేయాల్సిన పనిని వీళ్ళు చేయటం దేనికి? ? అసలు ఆ దేశంలో ఎవరు ఏమైపోతే మనకు దేనికి??" పట్టరాని కోపంతో ఎయిర్ కండిషన్డ్ రూమ్ అదిరిపోయేటట్లు స్కోల్డింగ్ ప్రారంభించారు కులకర్ణి.

పావుగంట పాటు ఆ అరుపుల్ని భరించి ఆఖరికి అసహనంగా కుర్చీలో అటూ ఇటూ కదిలారు హోమ్ మినిస్టర్ గారు.

"మనల్ని కాదని వెళ్ళారు స్పెషల్ బ్రాంచి వాళ్ళు.... మనం పూనుకొక పోయినట్లయితే వెళ్ళిన పనిని సాధించలేకపోవటం మాట అటుంచి వాళ్ళ ప్రాణాలు కూడా పోగొట్టుకుని వుండేవాళ్ళు. గనీఖాన్ రచించిన రాక్షస పథకంలో మన చేతులు కూడా వున్నాయనే ప్రచారం ప్రారంభం అయ్యేది వాళ్ళ ఐడెంటిటీలు బయట పడిన మరుక్షణం..... నన్ను అడిగితే మన అభీష్టానికి వ్యతిరేకంగా అక్కడికి వెళ్ళి మన పరువులు కాపాడాడు రాజు...... అందుకు సంతోషించాలి....." అన్నారాయన.

" అవును.... సంతోషించక ఇప్పుడు చేయగలిగింది ఏముంది ? ఆ బదిలీ భాయ్ దయ వల్ల ఈయన గారికి పట్టిన పిచ్చి నయమై, పిచ్చిలో వుండగా జరిగిన సంగతులు అదృష్టవశాత్తూ గుర్తుకు వచ్చాయి కాబట్టి సరిపోయింది. మతి స్థిమిత పడకపోయినా, ఆ విషయాలు గుర్తుకు రాక పోయినా ఏం జరిగి వుండేదో ఆలోచించారా మీరు?" ఉన్నట్లుండి ఆయన మీదే ఎటాక్ ప్రారంభించారు కులకర్ణి.

"అంతా మంచిగానే ముగిసింది కదా.... ఇప్పుడు ఆ గొడవలన్నీ దేనికి??" పట్టు వదలకుండా రెట్టించారు హోమ్ మినిష్టర్ గారు.

"దేనికా? ఆ గొడవలు దేనికా? అంతా మంచిగానే ముగిసిందా? దీనికి సమాధానం ఏం చెపుతారో చెప్పండి ...." కసిగా అంటూ ఒక కవర్‌ని ఆయనకు అందించారు కులకర్ణి.


పాకిస్తాన్ గవర్నమెంట్ ముద్ర వున్న ఆ కవరులోని కాగితాన్ని తీసి ఆశ్చర్యంతో ప్రూన్పడి పోయారాయన.

"ట్వింకిల్, అంజాద్ అనబడే స్పెషల్ బ్రాంచి ఏజెంట్లు ఆపరేషన్ గోల్డెన్ రోబ్‌లో తమకు సహాయం చేసేందుకు టెంపరరీగా అపాయింట్ చేసుకున్న రాజూమియాను పూర్తి టైమ్ స్పెషల్ బ్రాంచి ఏజెంట్‌గా నియమించటమైంది..... స్పెషల్ బ్రాంచి హెడ్ క్వార్టర్స్‌కు వచ్చి తన వివరాలు సమర్పించుకోవలసిందిగా తెలియచేయటమైనది ......."

తగిలిన దెబ్బ నయమైన కోలుకుంటున్న బదిలీ భాయ్ ద్వారా ట్వింకిల్ పంపించిన అపాయింట్‌మెంట్ ఆర్డర్ అది..... ఒక నెలలోపల వచ్చి డ్యూటీలో జాయిన్ కమ్మని అండర్ లైన్ చేయబడి వుంది అందులో.

ఇక అక్కడ వుండటం ఆరోగ్యానికి ఏమంత మంచిది కాదని గ్రహించి చల్లగా లేచారు షాడో, ముఖేష్, శ్రీకర్..... ఒకరి వెనుక ఒకరుగా ఆ గదిలో నుంచి బయటికి వచ్చి శరవేగంతో మాయమై పోయారు.

- : శుభం :-


GOLDEN ROBE
MADHU
BAABU